''ఈ సముద్ర మందున్న తిమింగిలములు నన్ను తప్పక తినివేయును. నన్ను యిక్కడ కెందుకు తీసుకువచ్చితివి?''

సత్యవ్రతుడు చిన్నగా నవ్వి యిట్లనెను. ''నీవు చాల విచిత్రమైన చేపవు. నీవు ఒక గంట కాలములో నూరు మైళ్ళు పొడవున్న సరస్సుకంటె పెరిగినావు. ఇదివర కెన్నడును నేను యిటువంటి దానిని చూడలేదు. నీవు సాధారణమైన చేపవు కావు. నీవెవరో నే నెరుగుదును. నీవు సాక్షాత్తు నారాయణుని రూపము. అయితే యే ప్రయోజనము కొరకై నీవు యీ రూపము దాల్చితివో నేనెరుగను. దేవాదిదేవా! నీకు నా నమస్కారము. అన్ని జీవులకు నీవు ఆశ్రయుడవు. నా వంటి అసహాయులను రక్షించుట కొరకే నీవు ఒక రూపము ధరింతువు. నీవు నాకు వ్యక్తమగుటచేత, యీ రూపము నెందుకు ధరించితివో దయచేసి నాకు చెప్పవలెను''. మత్స్య రూపములోనున్న భగవంతుడు సత్యవ్రతునితో నిట్లనెను. ''నీవు చెప్పినది సరియైనది. ఒక ప్రయోజనము కొరకు యీ రూపము ధరించినాను. ఏడు దినముల లోగా యీ ముల్లోకములు నీటిలో మునిగిపోవును. మహాప్రళయము సంభవించనున్నది. పూర్తిగా నీటిలో మునిగిన తర్వాత నీవైపుగా వచ్చు పడవనొక దానిని చూడగలవు. అప్రమత్తతో నుండి దాని రాకను గమనించవలెను. దానిని చూచిన వెంటనే నీవు ఆ పడవలో ప్రవేశించవలెను. ఓషధులను, విత్తనములను ప్రోగుచేసి, సప్తర్షులు వెంటరాగా వారితో పడవ నెక్కవలెను. నీ చుట్టును చిమ్మ చీకటిగా నుండును. కాని ఋషుల నుండి ఆవిర్భవించే తేజస్సు వెలుగునిచ్చి నీకు సహాయపడగలదు. అల్లకల్లోలముగా నున్న సముద్రమందు పెద్ద పెద్ద అలలు పడవ నటు నిటు విసురుగా ఊపుచుండును. నీవు భయపడవద్దు. నేను నీటిలో నుందును. నన్ను నీవు చూచినపుడు, వాసుకి సర్పమును త్రాడుగా జేసుకుని నా కొమ్ము నొకదానిని యీ పడవకు కట్టివేయుము. ఈ సముద్రమందు తనివితీర ఆటలాడుదును. ఇట్లు బ్రహ్మకు ఒక రాత్రి అగువరకు జరుగగలదు. నీవు నాతో నుండగలవు''.

''ఆ చేప అదృశ్యమయ్యెను''.

''భూమిపై కుశాసనము పరచి కూర్చుని సత్యవ్రతుడు, ఆ యేడు దినములు నారాయణుని నిర్విరామముగా ధ్యానించుచుండెను. ఏడవ రోజు నల్లని మేఘములు ఆకాశమును కప్పి, యేకధారగా వర్షము కురిసెను. శీఘ్రముగా భూమి అదృశ్యమగుచుండెను. దూరముగా తనవైపు త్వరత్వరగా వచ్చుచున్న పడవను కాంచెను. ఇంతకు పూర్వము సూచించినట్లుగా, ఓషధులు, వివిధ వృక్షముల విత్తనములతో పడవలో ప్రవేశించెను. సప్తర్షులు తన్ననుసరించిరి. భగవన్నామములను వారు ఉచ్చరించుచుండిరి. వారిట్లనిరి. 'ఓరాజా! భయపడకుము. భగవన్నామముతో యీ ప్రమాదకర ప్రయాణము చేయగలము'.

''బంగారు వన్నెలో బృహద్రూపముతో నున్న మత్స్యమును గాంచి, భగవంతుని కీర్తించుట మొదలిడిరి. అది చేరువకు వచ్చెను. ఇది వరలో సూచించిన ప్రకారము, ఆ మత్స్యము కొమ్ము నొకదానిని పడవకు గట్టిగా కట్టివేసెను. అలలకు పడవ విసురుగా అటు నిటు ఊగుచుండెను. అయితే పడవలో వారెవరూ, నారాయణుని అండలో నున్నామను ధైర్యముతో భీతి చెందలేదు.

''భగవంతునికి నమస్కరించి రాజు యిట్లనెను. 'ప్రభూ! అజ్ఞాన ప్రపంచములో పడియున్న మానవులు, నీ అనుగ్రహము చేత ముక్తి పొందగలుగుచున్నారు. చీకటిలో నున్న వారికి వెలుగు చూపి సహాయము చేయుచున్నావు. మాకు ఆత్మవిద్యను బోధింపవలయును. దాని వలన మేము నీలోని వారమనే జ్ఞానమును పొందగలము. దాని రహస్యము బోధించవలెను. తన్నావరించిన మాయ సత్యమని భావించి, అహంకార

మమకారములతో గుడ్డిగా సంచరించు మానవులు యెట్లు నీటి నతిక్రమించగలుగుదురో నాకు బోధించవలెను ఈ మాయ అనే తెరను ఛేదించి, నిన్ను దర్శించగలుగునట్లు మాకు సహాయపడవలెను'.

''అపార కరుణా సముద్రుడైన భగవంతుడు, సత్యవ్రతునికి బ్రహ్మవిద్య బోధించుటకు నిశ్చయించెను. జ్ఞాన భక్తి కర్మ యోగములను బోధించెను.

''సముద్రమందు లీలలు జరుపుచున్నపుడు, మత్స్యావతారములో నున్న నారాయణుడు హయగ్రీవుడను అసురునితో యుద్ధము చేసి వేదములను తెచ్చి ప్రళయాంతమున బ్రహ్మకు అప్పగించెను.

''సత్యవ్రతుడు వివస్వతునికి జన్మించి, శ్రాద్ధ దేవుడను పేరుతో వైవస్వత మన్వంతరమున మనువుగా వ్యవహరించెను''

నవమ స్కంధము

102 మార్కండేయుడు

శుకుడు పరీక్షిత్తునకు చెప్పిన భాగవతమును ఉగ్రశ్రవుడు జ్ఞప్తికి తెచ్చుకొన్నప్పుడు, శౌనకుడు హఠాత్తుగా మార్కండేయుని గురించి తెలుసుకొనవలెనని కోరిక గలిగి, ఉగ్రశ్రవుని మధ్యలో ఆపి యిట్లనెను. ''ప్రభూ! నన్నొక సందేహము వేధించుచున్నది. మహాప్రళయము సంభవించినపుడు, యీ లోకమంతయు నీటిలో మునిగిపోగా, మృకండుని కుమారుడైన మార్కండేయుడు, అమృతత్వము నొంది యుండుటచేత యెట్టి బాధను అనుభవించలేదని కొందరు చెప్పగా విని యున్నాము. ఇది యెట్లు సాధ్యమా అనిపించుచున్నది. నాకు తెలిసినంత వరకు మార్కండేయుడు మా గోత్రములో అనగా భార్గవ గోత్రములో జన్మించినాడని మాత్రము తెలియును. పుట్టినప్పటి నుండి అతనిని మన మెరుగుదుము. ఇంతవరకు మనము ప్రళయమును చూడలేదు. అటువంటపుడు ప్రళయములో మార్కండేయున కెట్టి హాని జరుగలేదను కథకు ఆధారమేమి? మరియు సముద్రజలముపై మర్రి ఆకు నందు భగవంతుడు శిశువు రూపములో మండగా అతడు చూచినట్లు, పద్మముల వంటి అతని చేతులు, పద్మము వంటి పాదము బొటన వ్రేలును పట్టుకుని పెదవుల వద్ద పెట్టుకున్నట్లు, సంతృప్తితో అతని ముఖము ప్రకాశవంతమైనట్లు కూడ వినియున్నాము. చిత్రాతి చిత్రమైన యీ వృత్తాంతమును దయచేసి మాకు విశదీకరింపవలెను''.

ఉగ్రశ్రవుడు (సూతుడు) యిట్లనెను. ''నీ ప్రశ్న సముచితముగా సవ్యముగా నున్నది. అంతేకాక నాకు, యీ ప్రపంచమునకు నారాయణుని కథ వివరించుటకు తెలుసుకొనుటకు అవకాశమేర్పడుచున్నది. ఈ కలియుగము నందు ప్రధాన లక్షణములైన మాయ, అజ్ఞానము మానవుని మనస్సు నుండి పారద్రోలు శక్తి యీ మార్కండేయ వృత్తాంతమునకు గలదు.

''మార్కండేయునికి తండ్రి మృకండుడు పవిత్ర యజ్ఞోపవీతము ధరింపజేసి గాయత్రి మంత్రము నుపదేశించెను. యువకుడైన మార్కండేయుడు వేద వేదాంగములలో ప్రావీణ్యము సంపాదించవలెనని దృఢముగా సంకల్పించుకొనెను. వానిని నిర్విరామముగా అధ్యయనము చేసి, స్వాధ్యాయమను తపస్సు నాచరించుటలో పరిపూర్ణుడయ్యెను. అతడు నైష్ఠిక బ్రహ్మచారి. అతడు నారవస్త్రములు ధరించియుండెను. తల మీద వెంట్రుకలు జడలు కట్టెను. అతని ప్రశాంత వదనము యోగులకు కూడ యీర్ష్య కలుగునట్లుండెను. అతని చేతియందు కమండలము ఉండెను. మౌంజి, లేడి చర్మము అతని ప్రకాశము నినుమడింపజేయుచుండెను. ఎల్లపుడును చేతిలో జపమాల యుండగా అతని పెదవులు భగవన్నామము నుచ్చరించుచుండెను. ఉదయము, సాయంకాలము విశ్వబ్ధముగా భిక్షా పాత్రను తీసుకుని బయటికి వెళ్ళి, తిరిగి గురువుకు భిక్ష తీసుకొని వచ్చుచుండెను. గురువు తనకు యేమైన యిచ్చినచో భుజించెడివాడు, లేకున్న పస్తుండెడివాడు. భగవంతునికి చేయు పూజా విధానముల యెడ ఉన్న గాఢభక్తిచేత అతడు మృత్యుంజయుడయ్యెను. బ్రహ్మకు, భృగువునకు, మహాదేవునకు, దక్షునకు, దేవతలకు, పితృదేవతలకు, అందరకూ అది యొక అద్భుతముగా తోచెను. గొప్ప యోగి యైన మార్కండేయుని మనస్సులో యెట్టి అల్లకల్లోలములు లేవు. అతి ప్రశాంతమైన

సరస్సువలె నుండెడిది నారాయణుని గురించిన ఆలోచనలే అతని మనస్సు నందు ఉండెడివి

''అతని సుస్థిర తపశ్శక్తిపై ఇంద్రునికి సందేహము గలిగెను ఇంద్రుడు మార్కండేయుని తపస్సు భంగము గావింపదలచెను. ఆ యోగి మనస్సు నల్లకల్లోలము గావించుటకు తన పరివారమును పంపెను గంధర్వులు గానము చేసిరి అప్సరసలు నాట్యమాడిరి ప్రణయదేవతయైన మన్మధుడు వారికి నాయకత్వము వహించెను వసంతుడు, మలయానిలుడు అతనికి సహాయకులుగా నుండిరి మలయానిలుడు ప్రణయ భావములు రేకెత్తించు చల్లని వాయువులను బరపుచుండెను. హిమాచలమునకు ఉత్తరదిక్కున పుష్పభద్రయను నదీ తీరమున 'చిత్ర'యను పేరుగల గుట్ట యొకటి ఉండెను. అచట మార్కండేయుడు ఆశ్రమము నిర్మించుకొనెను అది పవిత్రస్థలము. ఆశ్రమము సమీపములోని సరస్సు తీరము, భగవంతు వర్ణించుట కర్హమైన పువ్వులను పుష్పించు వృక్షములు, పొదలు, లతలతో నిండియుండెను. ఆశ్రమము, పరిసర ప్రాంతములందు ప్రశాంతత వ్యాపించి యుండెను ఆ ప్రదేశమున వాయువు కామునితో కూడి ప్రవేశించి, జలపాతము నుండి జలను తెచ్చి చుట్టును జల్లెను. తుమ్మెదలు ఝుమ్మని ఝుంకారముతో, మత్తెక్కిన వానివలె, గానము చేయుచుండెను. కోయిలలు ప్రణయ గీతములను విన్పించుచుండెను. నెమళ్ళు విచ్చలవిడిగా నాట్యము చేయుచుండెను. పక్షులు వాతావరణమందలి మత్తును గ్రహించినట్లుండెను వసంతుడు ఆ స్థలమున ప్రవేశించి, వృక్షముల పచ్చని ఆకులు, రెమ్మలు, పుష్పముల వెనుక దాగి పిచ్చి యెక్కించునట్లుగా పుష్పపరిమళమును వ్యాపింపజేసెను మన్మధుడు, గాయకులతో నాట్యకత్తెలతో అచటికి వచ్చి దాడి చేయుటకు సన్నాగము సన్నెను

''మార్కండేయుడు యోగ సమాధికి సన్నద్ధుడై యుండెను. అతడప్పుడే అగ్ని పూజలు ముగించి కనులు మూసుకుని యుండెను అగ్ని మూర్తీభవించి ఆసీనుడైనట్లు గోచరించెను

''అతని సమక్షములో అప్సరసలు నాట్యము చేయుచుండిరి చెరకు విల్లును మన్మధుడు యెత్తి, అయిదు అమ్ములను వింట సంధించెను ఇంద్రుని కతిప్రియమైన అప్సరస పుంజకస్థల ఋషిని కవ్వించుటకు వచ్చెను. మార్కండేయుడు కనులు తెరచుట చూచి, యిదే తగిన సమయమని యెంచి మన్మధుడు బాణములు ప్రయోగిం ను అయితే భగవదనుగ్రహము లేని మానవ ప్రయత్నములు విఫలమైనట్లు, మన్మధ బాణముల న్నియు ని యోజనము లయ్యెను మార్కండేయుని తీవ్రతపము వేడికి నిలువలేక, నిద్రించుచున్న త్రాచును కదిపి పారి యిన బాలురవలె, దూరముగా పారిపోయిరి. అతడు స్తిమితము గోల్పోక, వారిని శపింపక యుండెను అతనిలోని గొప్ప సుగుణమిది

''మన్మధుడు అతని పరివారము ముఖములు వ్రేలవేసుకుని తిరిగి వచ్చుట జూచిన ఇంద్రుడు జరిగిన విషయము నూహించి, అదెట్లు జరిగెనాయని ఆశ్చర్యపడెను.

''తప స్వాధ్యాయ సంయమములతో సంపన్నుడైన మార్కండేయునికి నారాయణుడు, నర నారాయణ రూపముతో ప్రత్యక్షమయ్యెను. ఒకరు నల్లగాను, మరొకరు తెల్లగాను నుండిరి. వారి నే
వికసించిన పద్మ పత్రములవలె నుండెను. ఒకొక్కరికి నాలుగు భుజము లుండెను వారు లేడి చర్మము, నార దుస్తులు ధరించి యుండిరి. మెడలో యజ్ఞోపవీతము, చేతి వ్రేళ్ళయందు పవిత్రమైన దర్భలు కలిగి యుండిరి చేతులందు కమండలము, జపమాల, బ్రహ్మదండము నుండెను తన పూర్వులందరూ చేసిన తపస్సులు ఫలితము కూడగట్టుకుని రూపము ధరించెనా యని మార్కండేయుడు భావించెను అత్యంత ఉత్సాహముతో లేచి నిలబడి, వారి పాదములపై బడెను. కనులు అశ్రువులతో నిండి యుండుటచే వారిని

సరిగా చూడలేకుండెను. అతడు చేతులు జోడించి, తడబడుచున్న పదములతో వారికి స్వాగతము పలికెను. వారికి అర్ఘ్యపాద్యముల నిచ్చి అసీనులను జేసెను. వారిని పుష్పములతో పూజించెను. తనను తాను సముదాయించుకున్న పిదప, వారిని కీర్తించెను. అతడిట్లు పలికెను. 'ప్రభూ! ఈ లోకము నంతనూ వ్యాపించి యున్నావు. నీవు బ్రహ్మవు, మహేశ్వరుడవు. నాలో నున్న ఆత్మవు నీవు. నీవు వాక్కునకు, మనస్సునకు ఇంద్రియములకు ప్రభుడవు. మానవులు ఇంద్రియము లాడించునట్లు ఆడునట్లుగా చేయుచున్నావు. ఈ బొమ్మలాట నుండి తిరిగి వారిని నీవే రక్షించుచున్నావు. లోక కళ్యాణము కొరకై నీవు యీ ద్వంద్వ రూపములు ధరించుచున్నావు. సాలెపురుగు తన నుండి ఉత్పన్నమైన పదార్థముతో గూడు కట్టుకుని, తిరిగి ఆ గూడును తానే విప్పివేసి దానిని మ్రింగినట్లు, యీ లోకమును సృష్టించి తిరిగి నీలో లయము గావించుకొనుచున్నావు.

'' 'నీ పాదముల చెంత ఆశ్రయము పొందిన వానికి కర్మ తన నంటి పెట్టుకుని యుండునన్న భయముండదు. గుణములు, కాల ప్రభావము అతని కుండవు., నేనెప్పుడును నిన్నే తలంచుచుందును. అందుకు నీవిపుడు ప్రత్యక్షమై నన్ననుగ్రహించినావు. నీ పాద స్పర్శకు మించినది వేరొకటి లేదు. నీ దర్శన భాగ్యము కలిగిన మానవునకు శిథిలమయే శరీరముపై మమకారము యెట్లు ఉండగలదు? ఈ శరీరము అనిత్యము, అసత్యము, నిష్ప్రయోజనమైనది, ఆత్మను మనస్సు గ్రహింపకుండ మరుగుపరచును. ఈ లోకమందు సృష్టి స్థితి లయలు నీ మాయవలన కలుగుచున్నవి; త్రిగుణములచే, మానవుని అజ్ఞానముచే నీమాయ యినుమడించుచున్నది. నీవు సర్వజ్ఞుడవు, నిత్యుడవు, ఆది పురుషుడవు. నీకు నా నమస్కారము. నీవు యీ లోకమంతయు వ్యాపించి యున్నావు. నిన్ను అరికట్టు వస్తువేదియు లేదు. అన్నింటికీ ప్రభువునైన నీకు నా ప్రణామములు. ఇంద్రియ ప్రలోభములు మానవునికి భ్రాంతి కల్గించి వివేచనా శక్తిని నశింపజేయును. ఇంద్రియములందు, శ్వాసయందు, హృదయమందు నీ ఉనికిని గ్రహించలేకున్నాడు. నీ మాయచేత అజ్ఞానమను సముద్రములో యీదులాడుచున్నాడు. సృష్టికర్తయైన బ్రహ్మ కూడ, నీవు వేదములు బోధించి సత్యమును తెలియజెప్పునంతవరకు, అవిద్యలో నుండెనని చెప్పుదురు. దేవాదిదేవుడవైన నీకు నా నమోవాకము లు'.

''నర నారాయణులు అతని పూజలను చిరునవ్వుతో స్వీకరించిరి. వారిట్లు పలికిరి. 'నీ సంయమము, తపశ్శక్తి స్వాధ్యాయము, విశ్వాసభక్తి నిన్ను సిద్ధపురుషుని గావించెను. మాకు మిక్కిలి సంతోషము కలిగెను. నీవు కోరు వరమును మేము ప్రసాదించగలము'.

''మార్కండేయు డిట్లనెను. 'మిమ్ము దర్శించిన తర్వాత, యే మానవునకైనను యితర విషయములపై కోరిక యుండునా? అయినప్పటికీ భగవదాజ్ఞను ఉల్లంఘించుట మర్యాద కాదు. అందుచే నేనొక వరమడిగెదను, మానవుని మనస్సులో అజ్ఞానమునకు కారణమైన మాయను గురించి తెలియగోరుచున్నాను. దయచేసి తెలుపవలెను'.

'' 'అట్లే కానిమ్ము. భగవంతుని మాయ నీకు వ్యక్తము కాగలదు' అని పలికి నర నారాయణులు బదరికాశ్రమమునకు వెళ్ళిపోయిరి''.

103 మార్కండేయుడు చూచిన దృశ్యము

''పుష్పభద్రా నదీ తీరమున 'చిత్ర' అను గుట్టపై నిర్మించుకొనిన ఆశ్రమములో మార్కండేయుడు ప్రార్థనతో, ధ్యానముతో కాలము గడపుచుండెను. వర నారాయణులుగా ప్రత్యక్షమై తన్ననుగ్రహించిన ఆ సుదినమును పదేపదే తలచుకొనుచుండెను అతడు అన్నింటి యందు భగవంతునే చూచుచుండెను భగవంతుడు తప్ప యింకేదియు అతనికి గోచరించుట లేదు. ఒకొక్కపుడు అతని ఆలోచనలన్నియు భగవంతుని యందు నిమగ్నమై యుండి, నిత్యమూ జరుపు పూజా విధులను మరచుచుండెను.

''ఒకరోజు అకస్మాత్తుగా పెద్దగాలి వీచ నారంభించెను. అది ఒక భీకరమైన తుఫానుగా చెలరేగి కుండపోతగా వర్షింపసాగెను. పిడుగులతో ఆ గుట్ట దద్దరిల్లుచుండెను. మెరపులతో ఆ ప్రదేశము ఉండి ఉండి వెలుగుతో నిండుచుండెను. అసాధారణమైన వర్షము కురియుచుండెను. వర్షధారలు అదే పనిగా పడుచుండెను. నాలుగు సముద్రములు నిండి, పొంగి పొరలి ఒకటి అగునట్లు ఉండెను. నీటితో నిండి భూమి కన్పింపకుండెను. తిమింగలములు, పెద్ద జలచరములు, మొసళ్ళు మాత్రమే కన్పించుచుండెను. సుడిగుండములు యేర్పడి, వాటి పరిధిలోనికి వచ్చిన వానిని కబళించుచుండెను. వర్షము, సముద్రముల హోరు, యింకేదియు వినిపించనంత తీవ్రముగా నుండెను

''అట్లు చూచుచుండగనే, భూమి అదృశ్యమగుట మార్కండేయుడు చూచి భయవిహ్వలుడయ్యెను. అతి త్వరలోనే యెత్తైన గుట్టలు, పర్వతములు నీటిలో మునిగిపోవుట జూచెను ఆకాశమునకు, భూమికి మధ్య నుండు గీత, భూమి అదృశ్యమగుటచేత, కనుపించకుండెను. మిగిలిన రెండు లోకములు, దేవతలు, నక్షత్రములు కూడ జలమయము లగుట జూచెను అతడు దిక్కు తెలియక, గమ్యము లేక ఆ నీటిపై తేలుచున్నట్లు కనుగొనెను. ఆకలి దప్పికలతో సతమతమగుచుండెను. పెద్దచేపలు, తిమింగిలములు, యితర జలచరములు చాల భయంకరముగా నుండెను. చుట్టూ చీకటి ఆవరించెను విసరివైచిన కొయ్య మాదిరిగా ఆ నీటిలో ఒంటరిగా భయమావహింపగా తేలుచుండెను ఒకసారి సుడిగుండములో చిక్కుకుని తిరిగి యది దూరముగా విసరివైచినపుడు, ఒక పెద్ద అల వచ్చి మరొక చోటుకు తీసుకుపోయెను తాను నిర్జించిన భయములన్నీ ఒక్కసారిగా కలుగుచున్నట్లు తోచెను. అనారోగ్యముతో బాధపడుచు విచారించుచుండెను. భయభ్రాంతులకు లోనయినట్లు తలచెను మరణము కలుగునేమో యను ఆలోచన రాగా, ఆ ఆలోచనకు భయకంపితుడయ్యెను ఒకప్పుడు మృత్యువును జయించితినన్న విషయము అతనికి తెలుసు! అయిననూ, యిప్పుడు తాను నిజముగా మరణించ నున్నాడని తలంచి భీతి చెందెను. ఆ విధముగా అతడు భయము, బాధ ముంచుకురాగా, అలలచే అటు నిటు చెదరిపడుచుండెను

''ఆ విధముగా నీటిలో తేలుచున్న మార్కండేయుడు దూరముగా నున్న ఒక అశ్వత్థవృక్షమును చూచెను అశ్వత్థవృక్షము పెద్దదిగను, దాని కొమ్మలకున్న ఆకులు కొత్తగా ఆకుపచ్చని రంగుతో నున్నట్లు అతడు చూచెను. ఆ చెట్టులో ఒక కొమ్మ తాను నిలిచియున్న ప్రదేశమువైపు వాలియున్నట్లు గమనించెను ఆ కొమ్మలోని అశ్వత్థ పత్రముపై అతడొక విచిత్ర దృశ్యమును గాంచెను

''అశ్వత్థ పత్రము మీద ఒక శిశువు నిద్రించుచుండుట అతడు చూచెను ఆ శిశువు నుండి వెలువడు కాంతి చుట్టును ఆవరించియున్న చీకటిని పారద్రోలుచున్నదా యను నట్లుండెను నీలమణి వర్ణములో ఆ

శిశువు ఉండెను. పద్మమువలె శిశువు ముఖము సుందరముగా నుండెను. మెడ శంఖము వలె అతి చక్కగా నుండెను. వక్షము విశాలముగా నుండి, నాసిక సొనపట్టినట్లుండెను. వంకరలు తిరిగిన తల వెంట్రుకలు ముఖము మీద పడుచూ, ఉచ్ఛ్వాసమునకు కదలుచు ఆడుచున్నట్లుండెను. ఆలిచిప్పలవలె నున్న ఆ శిశువు చెవులు దానిమ్మ పుష్పములను ధరించెను. ఆ శిశువు చిరు పెదవులపై దరహాసము గోచరించెను. చిన్నారి చేతులతో పద్మము మొగ్గవలె నున్న పాదము బొటకన వ్రేలును పట్టుకుని లాగి పెదవులతో చప్పరించుచూ అమితానంద ములో మునిగి యుండెను.

''అత్యంత సుందరముగా నున్న ఆ శిశువు నుండి మార్కండేయుడు తన కండ్లను మరల్చలేకపోయెను. ఆ శిశువును చూచినంతనే, మార్కండేయ మహర్షి అంతవరకు తాను పొందిన అలసటను మరచిపోయెను. మరింత వెడల్పు చేసుకున్న కన్నులతో ఆ శిశువు వట్లే చూచుచు ఋషి తన్మయత్వము చెందెను. ఈ శిశువు యెవరా యని తలచెను. మరింత దగ్గరగా వెళ్ళి శిశువును చూచెను. శిశువు దగ్గరకు వెళ్ళగా ఆ శిశువు శ్వాస తనను లాగుచున్నట్లు అనిపించెను. మార్కండేయుడు, దోమ ప్రవేశించినట్లుగా, శిశువు ఉచ్ఛ్వాసతో శిశువు శరీరము నందు ప్రవేశించెను.

''శిశువు శరీరము లోపల మార్కండేయుడు, వర్షము రాకముందున్న ప్రపంచమును గాంచెను. ఆ దృశ్యము చూచిన మార్కండేయుడు అచ్చెరువందెను. అతడు భూమినంతయు జూచెను. స్వర్గమును, నక్షత్రములతో నిండిన ఆకాశమును గాంచెను. పర్వతములు, ద్వీపములు, దేవతలు నాలుగు దిక్కులను రక్షించుట జూచెను. అసురులను జూచెను. అడవులు, నగరములు, ఆశ్రమములు, అన్నిటినీ జూచెను. హిమవత్పర్వతము, పుష్పభద్రా నదీతీరము, చిత్రగిరిపై తన ఆశ్రమమునూ కనుగొనెను. ఇంతలో శిశువు నిశ్శ్వాసముతో మార్కండేయుడు బయటకు వెడలి వచ్చెను. తిరిగి మార్కండేయుడు సముద్రముపై తేలుచుండెను. ఇంకను ఆ శిశువును చూచుచు, శిశువుచే ఆకృష్టుడై యాదుకొని దగ్గరకు చేరి, శిశువును ఆలింగనము చేయదలచెను. అంతలో ఆ శిశువు అక్కడ నుండి అదృశ్యమయ్యెను. అశ్వత్థ వృక్షము, సముద్రము, నీటి అలలు అన్నియు అదృశ్యమయ్యెను. తిరిగి తన ఆశ్రమములో నేలపై తానున్నట్లు మార్కండేయుడు కనుగొనెను.

''ఈ విచిత్ర అనుభవమును పొందిన మార్కండేయుడు, నారాయణుని యందు మనసు లగ్నము చేసి సమాధిలో నున్నట్లుండెను.

''పార్వతీ పరమేశ్వరులు ప్రమథ గణములతో ఆకాశమునందు సంచరించుచుండిరి. పార్వతి మార్కండే యుని జూచి, భర్తతో ఋషిని ఆశీర్వదించి అనుగ్రహించమని జెప్పెను. వారు భూమికి దిగి వచ్చి మార్కండేయునికి ప్రత్యక్షమైరి. మార్కండేయుడు అత్యంత ఉత్సాహముతో వారికి స్వాగతము చెప్పి గౌరవ మర్యాదలు సలిపెను. ఫల పుష్ప హారతులతో పూజించి, ప్రణమిల్లి ప్రార్థించెను. అంత పరమేశ్వరుడు (మహాదేవుడు) మార్కండేయునితో యిట్లనెను. 'నీకు నారాయణునందున్న భక్తిచే సిద్ధిని పొందితివి. నీవు అతనిచే వరమును పొంది, విష్ణుమాయను తెలుసుకునే ప్రత్యేకత సాధించినావు. నీవు చిరంజీవివై పురాణచర్యు డుగా పేరు గాంచెదవు. నీవు చెప్పు భగవత్కథలను విని యీ లోకములోని ప్రజలు తరింతురు'.

''పార్వతీ పరమేశ్వరులు ప్రమథ గణములతో తిరిగి ఆకాశమున కెగసిపోయిరి. మార్కండేయుడు, తనకు గలిగిన విచిత్ర అనుభవమును — మహా ప్రళయము, అందు అశ్వత్థ వృక్షపు ఆకులో శిశువును గాంచుట — పదే పదే చింతించుచుండెను''.

నవమ స్కంధము

104 సుకన్య

ప్రళయము తర్వాత భగవంతుడు తప్ప యింకేదియు మిగులలేదు. నారాయణుని నాభి నుండి పద్మము, పద్మము నుండి బ్రహ్మ ఆవిర్భవించెను. బ్రహ్మ మానసపుత్రుడు మరీచి మహర్షి. దాక్షాయణి అతని భార్య వారి కుమారుడు కశ్యపుడు. కశ్యపుని భార్య అదితి వారి పుత్రుడు సూర్యుడు. సూర్యుని కుమారుడు శ్రాద్ధదేవుడు. పూర్వ కల్పములో అతడు సత్యవ్రతుడు. ఈ కల్పములో వివస్వతునికి కుమారుడుగా బుట్టి, మనువుగా వ్యవహరించుటచే వైవస్వత మనువుగా ప్రసిద్ధి పొందెను శ్రాద్ధదేవుని కుమారుడు ఇక్ష్వాకుడు వైవస్వతుని వంశము సూర్య వంశమని పేరొందెను ఆ తర్వాత ఇక్ష్వాకుడు రాజ్యమేలి పేరుగాంచుటచే ఇక్ష్వాకు వంశమని పేరు బడసెను

మను పుత్రులలో ఒకడు శర్యాతి అతడు చాల ధర్మశీలుడు. అతని పుత్రిక సుకన్య ఆమె అందమైనది పద్మముల వంటి నేత్రములు గలది ఆమెకు యుక్తవయస్సు వచ్చినప్పటికీ, తండ్రి ఆమె యింకను పసిబాలిక యని తలంచుచుండెను. తండ్రికి ఆమెపై అమితప్రేమ అమాయకురాలైన ఆమె అందరికీ ప్రేమ పాత్రురాల య్యెను

ఒకసారి రాజు తన పరివారముతో అడవికి వెళ్ళినపుడు, సుకన్య కూడ తండ్రి ననుసరించి వెళ్ళెను. వారు చ్యవన మహర్షి ఆశ్రమమునకు వచ్చిరి చ్యవనుడు చాల కాలము ధ్యానములో మునిగి యుండెను. తపస్సు ప్రారంభించి అనేక సంవత్సరములు గడచి యుండుటచే అతని చుట్టును మట్టి పుట్టలు కట్టుటచే, అతడు కనుపించక యుండెను. రాకుమారి సుకన్య అచట సంచరించుచూ, మహర్షి చుట్టునున్న పుట్టను వింతగా చూడసాగెను పుట్ట దగ్గరగా వెళ్ళి చూడగా, ఒక కన్నము నుండి మిణుగురు పురుగు వలె మెరయుచున్న రెండు మెరపు బిందువులను గాంచెను పసితనపు చేష్టలను విడనాడని సుకన్య ఒక దర్భపుల్లను తీసుకుని ఆ కన్నములో పెట్టి మెరయుచున్న బిందువులకు తగులునట్లు గుచ్చెను ఆ రెండును మహర్షి నేత్రములు; సుకన్య వానిని గుచ్చి ఋషికి బాధ కలిగించెను ఆ ఋషి ఆగ్రహము చెంది, రాజు సేనా పరివారము స్తంభించిపోవునట్లు చేసెను ఈ దారుణ పరిణామమునకు కారణమేమిటో రాజు ఊహించలేకపోయెను ప్రతిఒక్కరిని పిలిచి మహర్షి నెవరైననూ అవమానించిరేమోయని అడిగెను సుకన్య సంకోచించుచు తండ్రిని సమీపించి, జరిగిన దంతయూ తెలిపెను జరిగిన దారుణము విని రాజు భయకంపితుడై ఋషి వద్దకు వచ్చెను అనాలోచితముగా తన కుమార్తె చేసిన పాప కార్యమునకు తనను, తన కుమార్తెను క్షమించమని రాజు ఋషిని ప్రార్థించెను తన కుమార్తెను మహర్షికిచ్చి వివాహము చేసెదనని పలికి, ఋషిని సమాధానపరచెను

సుకన్యా చ్యవనుల వివాహము జరిగిన తర్వాత, ఆమె ఋషి ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. ఆమె అనాలోచితముగా చేసిన చర్యకు రాజు సేనా పరివారము స్తంభించిన ఆ క్షణములో ఆమెలో పసితనము పోయి ప్రౌఢత్వము ప్రవేశించెను. దేవహూతి కర్దముని సేవించినట్లు, ఆమె చ్యవన మహర్షిని సేవించుచుండెను

ఒకసారి అశ్వినీ దేవతలు చ్యవనుని ఆశ్రమమునకు వచ్చిరి సుకన్య సేవలకు ఋషి సంతోషించి, ఆమెను సంతోషపరుప తలచెను అందుచే ఋషి అశ్వినీ కుమారులకు గౌరవ మర్యాదలు చేసి, వారి నొక వరము కోరెను వారితో ఋషి యిట్లు పలికెను ''మీరు దివ్య భిషక్కులు మీరు వైద్యులగుటచే, దేవతలు మీకు

యజ్ఞములలో సోమభాగమును యిచ్చుటలేదు. మిమ్ము తక్కువ జాతి దేవతలుగా పరిగణించుచున్నారు. మీరు నన్ను అందమైన, ఆకర్షణీయమైన యువకునిగా జేసినచో, అందుకు ప్రతి ఫలముగా మీకు సోమములో భాగము వచ్చునట్లు చేసెదను''.

అశ్వినీ కుమారులు, తమ ప్రతిష్ఠ పెరుగునని తలంచి, సంతోషించి, ఋషికి యౌవనము ప్రసాదించుట కంగీకరించిరి. మంత్రముల నుచ్చరించిన తర్వాత, తాము ఔషధములను ప్రయోగించిన ఒక చెరువులో ప్రవేశించమని అశ్వినీ కుమారులు ఋషిని ఆదేశించిరి. ఆ ప్రకారము ఋషి ప్రవేశించెను. ఒక క్షణము తర్వాత, ఆ చెరువు నుండి ముగ్గురు యువకులు బయటికి వచ్చిరి. వారు ముగ్గురు పద్మములతో కట్టిన హారములు ధరించి యుండిరి. వారి చెవులకు మణులతో పొదిగిన కుండలములు కలవు. అందమైన పట్టు వస్త్రములను వారు ధరించి యుండిరి. సతీమణియైన సుకన్య వారు ముగ్గురనూ చూచి, వారిలో తన భర్త యెవరో తెలుసుకొనలేకపోయెను. ఆమె అశ్వినీ కుమారులకు ప్రణమిల్లి యిట్లనెను ''నా పాతివ్రత్యమును నేను కాపాడుకొనునట్లు చేసి నన్ను కరుణింపుడు. ముగ్గురు యెడముగా నిలుచుండుడు. నా భర్తను నేను కనుగొనెదను!''. వారు ఆమెను కరుణించి చ్యవనుని ఆమె గుర్తించునట్లు చేసి, ఋషికి దూరముగా నిలుచుండిరి. అశ్వినీ కుమారులు ఋషి దంపతుల వద్ద సెలవు తీసుకుని తిరిగి స్వర్గము చేరిరి.

ఇంతలో సుకన్య తండ్రి శర్యాతి, యజ్ఞము చేయ సంకల్పించి చ్యవనునితో సంప్రదించుటకై ఆశ్రమమునకు వచ్చెను. ఆశ్రమములో ప్రవేశించిన శర్యాతి, తన కుమార్తె దేవతలను పోలిన అందమైన యువకునితో నుండుట జూచెను. ఇది చూచి రాజు దిగ్భ్రాంతుడయ్యెను. సుకన్య పట్టరాని సంతోషముతో తండ్రిని సమీపించి అతని పాదములకు ప్రణమిల్లెను. కాని అతడామెను ఆశీర్వదించక ముఖము త్రిప్పుకొనెను. తండ్రి ముభావముగా నుండుటకు కారణము ఆమె ఊహించలేకపోయెను. క్రోధముతో నున్న తండ్రిని చూచి, ఆమె అమాయికముగా యిట్లడిగెను. ''తండ్రీ! నీవెందుకు కోపముగా నున్నావు? నన్ను చూచి నీవు అసంతృప్తి చెందుటకు కారణమేమి? చాల దినముల తర్వాత నిన్ను నేను చూడగల్గుచున్నాను. కాని, నీవు నాయందు సుముఖత చూపకుండుటచే నాకు బాధగా నున్నది. ఒకప్పుడు నాపై నీ కమితమైన ప్రేమ యుండెను. కాని యిప్పుడు అట్లు కాదు. నీకు నేనేమి అపచారము చేసితిని? దయచేసి నాకు చెప్పవలెను!'' శర్యాతి ఆమెను చూచి యిట్లనెను. ''నాయెదుట నిలుచుని యీ ప్రశ్న అడుగుటకు నీకెంత ధైర్యము? నీవు నాకు పుత్రికగా నుండు అర్హతలేదు. గొప్ప మన వంశములో జన్మించిన నీవు 'అసతి'గా యెట్లు మారితివి? చ్యవన మహర్షి నీచేత మోసగింపబడినాడు. అతడు నిన్ను శపించకుండుట నాకు ఆశ్చర్యముగా నున్నది. నీవెట్లు సిగ్గులేక యుంటున్నావు? ఈ యువకునితో వ్యభిచరించుచూ, నన్ను ఆశీర్వదించమని యెట్లు అడుగుచున్నావు. ఇక నుండి నీవు నా కుమార్తెవు కావు. నీ ముఖమును చూడదలచుకోలేదు''. అతడు తిరిగి వెళ్ళిపోవనుండెను.

ఇంతలో వెనుక నుండి నవ్వులు వెండి గంటలు మ్రోగినట్లు వినిపించగా, వెళ్ళిపోనున్న ఆమె తండ్రి ఒక క్షణమాగెను. వెనుకకు తిరిగి కుమార్తెను జూచి ఆశ్చర్యపోయెను. యువకుడైన ఆమె భర్త చ్యవనుడు కూడ ఆమెతో కలిసి నవ్వుచుండెను. ఆ దంపతు లిరువురూ శర్యాతి కడకు వచ్చిరి. అతనితో సుకన్య యిట్లనెను ''తండ్రీ! నేనెట్టి పాపము చేయలేదు. ఈ యువకుడు నీ అల్లుడు, చ్యవన మహర్షి తప్ప వేరొకరెవరూ కాదు''

వారు జరిగిన దంతయు వివరించి, తమ అదృష్ట భాగ్యమునకు అశ్వినీ దేవతలు యెట్లు కారకులైరో

ఆ వృత్తాంతమంతయూ తెలిపిరి.

చ్యవనుడు శర్యాతికి సోమ యజ్ఞము జరిపి, యజ్ఞము జరుగుచుండగా సోమమును అశ్వినీ దేవతలకు సమర్పించెను. ఇది చూసిన దేవతలు అసంతృప్తులు కాగా, ఇంద్రుడు అచటకు వచ్చెను. ఇంద్రుడు మండిపడి చ్యవనుని నాశనము చేయుటకు తన వజ్రాయుధమును ప్రయోగింపబూనెను. అయితే చ్యవనుని తపశ్శక్తి ఇంద్రుని భుజమును స్తంభింపజేసెను. స్వర్గాధిపతియైన ఇంద్రుడు తన భుజమును కదల్చలేకపోయెను; అతని చేతిలో నున్న వజ్రాయుధము జడముగా మారెను. అనవసరముగా స్వార్థముతో వ్యవహరించుచున్నానని ఇంద్రుడు గ్రహించి, దేవతలతో బాటు అశ్వినీ కుమారులు కూడ సోమములో భాగము తీసుకొనుటకు అంగీకరించెను. అప్పటి నుండి అశ్వినీ దేవతలకు సోమము లభించుచుండెను.

105 నాభాగుడు

ఇక్ష్వాకు వంశములో నభగుడు గొప్ప మహారాజు. అతని పుత్రుడు నాభాగుడు. యువకుడైన నాభాగునకు చదువుయందు మిక్కిలి ఆసక్తి యుండుటచేత కాలమంతయూ గురువు వద్దనే గడపుచుండెను. కొంత కాలమునకు నభగుని ఆస్తి విభాగము జరిగినపుడు, నాభాగుని పూర్తిగా విస్మరించి అతని సోదరులు తండ్రి ఆస్తిని తమలో తాము పంచుకొనిరి. గురువు యింటి నుండి తిరిగి వచ్చిన నాభాగుడు తన సోదరుల కడకేగి యిట్లడిగెను. ''మన తండ్రి ఆస్తిలో నా భాగమేది?'' అతని సోదరులు, ''నీవు చాల కాలము గురువు యింట నుండుటచేత, నీ విషయము పూర్తిగా మరిచినాము. తిరిగి అంతయూ విభజించుటకు సమయము మించిపోయినది. కాని మన తండ్రిగారిని యింతవరకూ పంచుకొనలేదు. అందుచేత తండ్రిని నీ భాగముగా తీసుకు వెళ్ళవచ్చును. నీతో తీసుకువెళ్ళి అతడిని సంరక్షింపుము'' అని జవాబిచ్చిరి.

నాభాగుడు తండ్రి వద్దకు వెళ్ళి తన సోదరులు చెప్పిన దంతయూ వివరించెను. తండ్రి నాభాగునితో యిట్లనెను. ''కుమారా! నీ సోదరులు దురాశాపరులై నిన్ను మోసపుచ్చిరి. నేను ఆస్తివలె నీవు జీవించుటకు వినియోగపడలేను. అయినప్పటికీ, యీ విధముగా జరుగుటచేత, నీకు సహాయము చేయుటకు యేదో నొక మార్గము కనుగొందును''. ముసలి తండ్రి కొంతసేపు యోచించి యిట్లనెను. ''నీవు జీవించుటకు నేను నీకు యే విధముగా సహాయపడగలనో నాకు తెలియును. నీవు ఆస్తి సంపాదించగలుగు మార్గము నాకు తెలుసు. ఇక్కడకు దగ్గరలో అంగిరసులు ''అభిప్లవ'', ''ప్రిష్ఠ్య'' అను యజ్ఞములు జరుపుచున్నారు. ఆ యజ్ఞములను మొదలుపెట్టిన ఆరు దినములలో పూర్తిచేయవలసి యున్నది. అంగిరసులు జ్ఞానవంతులు, అధ్యయనపరులు అయినప్పటికీ, కీలకమైన మంత్రము నొకదానిని వారు జ్ఞప్తియందుంచుకొన లేకున్నారు. ఆ మంత్రము నుచ్చరింపకున్నచో యజ్ఞము సంపూర్ణము కానేరదు. నేను నీకు రెండు మంత్రములు బోధించెదను. నీవు యజ్ఞశాలకు వెళ్ళి అక్కడ ఉండి యీ రెండు మంత్రములను పఠింపుము. యజ్ఞము పూర్తియై సఫలమగుటచేత వారు స్వర్గమున కేగుదురు. అందుకు కృతజ్ఞతగా, యజ్ఞశాలలోని విలువైన వస్తువులను నీకు ప్రసాదించెదరు. ఆ విధముగా లభించిన సంపదతో నీవు సుఖముగా జీవించగలవు''.

నాభాగుడు తండ్రి చెప్పినట్లు చేసెను. ముసలి తండ్రి ఆశించినట్లుగా అంగిరసులు యజ్ఞశాలలోని సంపదను

నాభాగునికిచ్చి వేసిరి. యజ్ఞశాలలోని ద్రవ్య పదార్థములను ప్రోగుచేయుచుండగా, ఉత్తర దిక్కునుండి తనవైపుగా ఒక నల్లని మనిషి వచ్చుచుండుట నాభాగుడు గమనించెను. అతడు దగ్గరకు వచ్చి, ''ఈ సంపద అంతయూ నాది. ఇందులో నీకు హక్కులేదు'' అనెను.

నాభాగుడు, అంగిరసులు తనను మెచ్చుకుని కృతజ్ఞతతో యీ సంపదను తనకు ఒసగిరని విన్నవించెను. కాని ప్రయోజనము లేకపోయెను. చివరకు నాభాగుడిట్లనెను. ''ఈ సమస్యను మూడవ వ్యక్తి పరిష్కరించ వలెను''. ''అటులనే జరుగనిమ్ము'' అని నల్లని మనిషి రూపములో నున్న రుద్రుడనెను. ''నీ తండ్రి వద్దకు వెళ్ళి జరిగినదంతయు చెప్పుము. అతని నిర్ణయమునకు నేను కట్టుబడి యుందును''.

నభగుడు, తన పుత్రుడు చెప్పినదంతయూ విని, ''కుమారా! చాల కాలము క్రిందట దక్షుడు యజ్ఞము జరిపినపుడు, యజ్ఞశాలలోని సంపద అంతయూ రుద్రునకు చెందునని ఋషులు పలికిరి. ఇప్పుడు వచ్చి యీ సంపదను కోరుచున్నవాడు తప్పక రుద్రుడే కాగలడు. అతనికి అన్ని హక్కులు ఉన్నవి. అతడు దైవము కూడ. అతని హక్కును కాదనుటకు వీలులేదు''. నాభాగుడు తిరిగి యజ్ఞశాలకు వెళ్ళి రుద్రునితో యిట్లనెను. ''ఈ సంపద అంతయు నీదేనని, నాకు హక్కులేదని నా తండ్రి తెలిపెను. నా అజ్ఞానమునకు క్షమించి నన్ను ఆశీర్వదింపుడు''. నాభాగుడు రుద్రుని పాదములకు ప్రణమిల్లెను. నాభాగుని వినయమును రుద్రుడు మెచ్చుకుని యిట్లనెను. ''నీవు చాల విజాయితీ పరుడవు. పెద్దలయందు నీకున్న గౌరవము మెచ్చుకోదగినది. నీ ప్రవర్తన నాకు చాల ఆనందము కల్గించినది. నీకు నేను బ్రహ్మవిద్యను బోధించెదను. నీ అత్యుత్తమ ధర్మమునకు ప్రతిఫలముగా యీ సంపదనంతయూ బహూకరించుచున్నాను.

ఆ కాలమందు నాభాగుడు ఒక గొప్ప వేదాంతి అయ్యెను.

106 అంబరీషుడు

నాభాగుని కుమారుడు అంబరీషుడు. అతడు యీ భూలోకమున కంతకూ చక్రవర్తియై అమితమైన సంపదతో యుండెను. అంతేకాక అతడు చాల జ్ఞానవంతుడు. ఈ ప్రపంచములోని వస్తువులన్నియు అశాశ్వతమనియు, అవి మానవుల వివేకమును కొల్లగొట్టునవియు అతడెరుగును. అందుచేత అతడు యిదంతయు స్వప్నతుల్యముగా భావించుచుండెను. అతడు మహారాజుగా సకల రాజభోగములు అనుభవిం చుచూ జీవించుచుండెను. కాని యిదంతయూ అశాశ్వతమని, చిరకాలము ఉండదని యెరిగి యుండెను. ప్రాపంచిక విషయములలో చిక్కుకొనక జీవించుచుండెను. నాభాగునికి తగిన పుత్రుడు అంబరీషుడు; ఎల్లప్పుడూ అతని మనస్సు బ్రహ్మవిద్యయందు లగ్నమై యుండెడిది. అతనికి నారాయణునిపై విశేషమైన భక్తియుండుటచేత, యీ భౌతిక ప్రపంచమును దాని ఆకర్షణలను ఒక మట్టిముద్ద మాత్రమేయని గుర్తించుట తేలికయ్యెను. అతడు పరమ భాగవతుడు. నారాయణుని పాదపద్మములే అతని మనసున యెప్పుడూ మెలగుచుండెను. అతని నోటినుండి నారాయణ కీర్తనలే వినవచ్చుచుండెను. భగవంతుని మందిరములో సేవలు చేయుటయందు తన చేతులను వినియోగించుచుండెను. భగవత్కథలను వినుటకు అతని చెవులు ఆత్రముగా యెదురు చూచుచుండెడివి. అతని కన్నులు దేవాలయములో భగవంతుని ప్రతిమలను గాంచి ఆనందించుచుం

డెడివి. అతని పాదములు పవిత్రస్థలములకు వెళ్ళుటకు ఉత్సాహపడుచుండెడివి.

నారాయణ భక్తుడైన అంబరీష మహారాజు యీ భూమిని కడు సమర్థముగా పరిపాలించుచుండెను. వసిష్ఠుడు, అసితుడు, గౌతముడు తోడుపడగా సరస్వతీ నదీ తీరమున అశ్వమేధయాగము చేసెను ఎటువంటి బంధములకు, అనురాగములకు కట్టుబడక యీలోకములో జీవించుచుండెను. నారాయణుడు మెచ్చుకుని, తన సుదర్శన చక్రమును అంబరీషునకు ప్రసాదించెను. ఆ చక్రము అంబరీషుని, అతని రాజ్యమును రక్షించుచుండెను. ఇట్లు కాలము గడచుచుండెను

ఒకనాడు ద్వాదశీవ్రత మహాత్మ్యమును గురించి అంబరీషుడు వినియుండెను. అతడు భార్యా సమేతుడై ఒక సంవత్సరకాలము యీ వ్రతము నాచరించెను. వ్రతము ముగిసే ముందు కార్తీకమాసమున చివరి మూడురోజులు ఉపవాసము చేసెను. తర్వాత నదిలో పవిత్రస్నానము చేసెను పిమ్మట మధువనమునకేగి అచట నారాయణుని పూజించెను బ్రాహ్మణులకు గోసువర్ణ దానములు చేసి, తన గృహమునకు వచ్చి భార్యప్రక్కన కూర్చుని ఉపవాస విరమణకు సిద్ధపడెను

ఆ సమయములో దుర్వాస మహర్షి అక్కడకు వచ్చెను అంబరీషుడు లేచి వచ్చి, దుర్వాస మహర్షికి తగిన ఆసనమేర్పరచి, అర్ఘ్యపాద్య ఆచమనములతో గౌరవించెను దుర్వాసునకు సాష్టాంగ ప్రణామముచేసి, తన ఆతిథ్యము స్వీకరించి, భోజనము చేయవలసినదని ప్రార్థించెను. రాజు వినయమునకు దుర్వాస మహర్షి సంతసించి యిట్లనెను ''నీ ఆతిథ్యము తప్పక స్వీకరించెదను ముందుగా నదికి వెళ్ళి ఉదయ సంధ్య పూర్తిగావించుకుని వచ్చెదను''.

దుర్వాసుడు నదిలో స్నానమాచరించునపుడు అఘమర్షణ సూత్రమను మంత్రమును పఠించుచుండెను ఇట్లుండగా ద్వాదశి ఘడియలు పూర్తికావచ్చుటచేత రాజు చిక్కు పరిస్థితిలో పడెను. అతని ద్వాదశి వ్రతము సఫలమగుటకు ద్వాదశి ఘడియలు అంతమగులోపుగ 'పారణ' (అనగా ద్వాదశి భోజనము) చేయవలసియున్నది ద్వాదశి భోజనము తప్పనిసరి మాత్రమే కాదు, అట్లు చేయకున్నచో మిక్కిలి పాపము రాజు బ్రాహ్మణుల సలహా కోరగా, వారు తులసి తీర్థము పుచ్చుకున్నచో పాపము అంటదని సలహా యిచ్చిరి వారు చెప్పినట్లు తులసి తీర్థము తీసుకుని, దుర్వాస మహర్షి రాకకై యెదురు చూచుచుండెను

తిరిగి వచ్చిన దుర్వాసుని రాజు సాదరముగ ఆహ్వానించెను దుర్వాసుడు తన మనోనేత్రముతో జరిగిన విషయము కనుగొనెను రాజు, అతిథి వచ్చువరకు వేచియుండక 'పారణ' పూర్తిచేసి అతిథి నవమానించెనని దుర్వాసుడు ఆగ్రహావిష్టుడయ్యెను క్రోధముతో దుర్వాసుని శరీరమంతయూ కంపించెను కన్నులు యెర్రన య్యెను రాజుతో యిట్లనెను ''నీవు అధికార సంపదలతో మదించి యున్నావు నీకు అతిథిని గౌరవించుట తెలియదు అహంభావముతో మిడిసి పడుచున్నావు అతిథి నవమానించినందుకు యిప్పుడే నీకు గుణపాఠము చెప్పి శిక్షించెదను'' జడలుకట్టిన తల నుండి ఒక వెంట్రుక లాగి దానికి జీవముపోసి, అతనికి 'కృత్యు'డని పేరిడెను కృత్యుడు కత్తిని ధరించి అంబరీషుని వడివడిగా సమీపించెను. అంబరీషుడు చెక్కుచెదరక నిలిచి యుండెను

ఇంతలో సుదర్శన చక్రము ప్రత్యక్షమై దుర్వాసుడు సృష్టించిన కృత్యుని దగ్ధము చేసెను ఇది చూచి దుర్వాసు డచ్చెరువొందెను సుదర్శన చక్రము అంతటితో ఆగలేదు దుర్వాసుని వెంటాడెను. దాని నుండి

తప్పించుకొనుటకు దుర్వాసుడు పరుగిడెను. సుదర్శన చక్రము దుర్వాసుని వెంటాడుచునే యుండెను. అడవికి పరుగెత్తగా, అరణ్యములోని అగ్నివలె సుదర్శన చక్రము దుర్వాసుని వెంబడించెను. మేరు పర్వతమున ఒక గుహలోనికి దుర్వాసుడు ప్రవేశించెను. తిరిగి చక్రము అచట యెదురయ్యెను. తర్వాత స్వర్గమున యింద్రుని వద్దకేగెను. సుదర్శన చక్రము దుర్వాసుని తరుముకొని వచ్చుచుండెను. ఆ తర్వాత సృష్టికర్త బ్రహ్మకడకేగి యిట్లనెను. ''రక్షించు! రక్షించు! నారాయణుని ఆయుధమైన యీ సుదర్శన చక్రము నుండి నన్ను రక్షించి కాపాడుము''. బ్రహ్మ యిట్లనెను. ''నేను భగవంతుని సేవకుడను. నిస్సహాయుడను. నీకు, నారాయణుని ఆయుధమునకు మధ్య జోక్యము చేసుకొనలేను''. ఆ తర్వాత మహాదేవుని వద్దకు వెళ్ళి రక్షింపుమని దుర్వాసుడు వేడగా, నారాయణుని వద్దకు వెళ్ళి అతని పాదములపై బడి ప్రార్థించుమని మహాదేవుడు చెప్పెను. అక్కడ నుండి దుర్వాసుడు వైకుంఠమున కేగెను. అచట నారాయణుడు లక్ష్మీ సమేతుడై యుండుట దుర్వాసుడు జూచెను. వారి పాదములపైబడి యిట్లనెను. ''దయచేసి నన్ను రక్షింపుము. నీ సుదర్శన చక్రము నుండి నన్ను విడిపింపుము. ఆ చక్రము నుండి వెలువడే వేడి తీవ్రతకు నేను తట్టుకొనలేకున్నాను. నేను దగ్ధము కాబోవుచున్నాను, నీవు మాత్రమే నన్ను రక్షింపగలవు''. ''ఇదెట్లు జరిగెను?'' అని నారాయణు డడిగెను. ''ఈ విధముగా నా సుదర్శన చక్రము నిన్నెందులకు వెంబడించుచున్నది? అంతయు వివరముగా చెప్పుము''. సిగ్గుతో కుంచించుకు పోయిన ముఖముతో మాటలు తడబడుచుండగా, జరిగినదంతయూ దుర్వాసుడు వివరించి యిట్లనెను. ''నీ భక్తుని నేను బాధించితిని. అందుకు శిక్షగా యీ సుదర్శన చక్రము నన్ను వెంటాడుచున్నది. దయచేసి నన్ను రక్షింపుము. దేవాదిదేవుడవైన నీకు అసాధ్యమేదియు లేదు. నా ప్రవర్తనకు నేను పశ్చాత్తాపడుచున్నాను. నన్ను రక్షింపుము''.

నారాయణుడు చిరునవ్వుతో యిట్లనెను. ''ఓ దుర్వాసా! బ్రహ్మరుద్రులవలె నేను కూడ నిస్సహాయుడనని నీవు తెలుసుకొనలేవా? నీకు నాగురించి పూర్తిగా తెలియదు. నాకు పూర్తి స్వేచ్ఛ లేదు. నా యిష్టము వచ్చినట్లు చేయుచున్నట్లుగా గోచరించవచ్చును. కాని మొట్టమొదట నేను నా భక్తుల ఆధీనములో నున్నాను. నా సర్వస్వమూ వారిదే. వారు సర్వస్వమూ త్యజించి నాకు శరణాగతులైనారు. వారు అన్నిటినీ — భార్య, పిల్లలు, యిల్లు, బంధువులు — వదలిపెట్టిరి. వారికి యిహలోకముపైగాని పరలోకముపైగాని ఆలోచనలేదు. వారికి స్వర్గము ఆకర్షణీయముకాదు. నా అనుగ్రహమునే వారు కోరుచుందురు. అందుకు ప్రతిఫలముగా యెట్టి పరిస్థితులందు కూడ వారిని వదలివేయనని ప్రతిజ్ఞ తీసుకున్నాను. వారికి నాయందుగల భక్తియే నా మనస్సులో మొట్టమొదట మెదలును. తమ ప్రేమచేత వారు నన్ను జయించిరి, వారి ప్రేమశక్తి ముందు నేను శక్తిహీనుడను. 'నాది' యని ప్రత్యేకముగా నాకేదియులేదు. వారి సంతోషమే నా సంతోషము, వారి దుఃఖమే నా దుఃఖము. నేను 'భక్తపరాధీనుడ'నని ప్రసిద్ధి కెక్కియున్నాను. నాకు భక్తులపై యున్న మక్కువకంటె, నాపై నాకుగాని, నా భార్య లక్ష్మియందుగాని యెక్కువ మక్కువలేదు. అటువంటి పరిస్థితులలో వారితో యధాలాపముగా నేనెట్లు వ్యవహరించగలను? నా భక్తులను అవమానించిన, నన్నవమానించినట్లే యగును. ఉత్తమవనితలు తమ ప్రేమచేత భర్తల నెట్లు బానిసలుగా జేసుకొందురో, అటులనే భక్తులకు నేను బానిసను.

''నీవు కూడ నాకు భక్తుడవే. అయితే యీ చక్రమును నేను ఉపసంహరింపజాలను. నిన్ను నీవు రక్షించుకొనుటకు యేమి చేయవలెనో నీకు చెప్పెదను. నీకు ఒకే ఒక మార్గము గలదు. తిరిగి భూలోకమునకు వెళ్ళి, నీ బాధకు గురియైన నా భక్తుడు అంబరీషుని పాదములపై బడి వేడుకొనుము. బహుశః నాభాగుని

పుత్రుడైన అంబరీషుడు నిన్ను క్షమించినపుడు, యీ సుదర్శన చక్రము వెనుకకు మరల గలదు. నీ కొరకు అతడు యీ చక్రమును ఉపసంహరించగలడు. ఆ విధముగా నీకు రక్షణ కలుగును''. ముఖము వ్రేలవేసుకుని దుర్వాసుడు అంబరీషుని ద్వారము ప్రవేశించెను. అంబరీషుని పాదములను తన రెండు చేతులతో పట్టుకొనెను. పరిణామమునకు అంబరీషుడు తబ్బిబ్బయ్యెను. అతడు భగవంతుని ప్రార్థించి, సుదర్శన చక్రము ఉపసంహారము నొందునట్లు చేసెను. ''ఓ సుదర్శనా! నీకు నా ప్రణామములు. నీవు అగ్ని, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు. నీవు లోకమంతయూ వ్యాపించియున్నావు కరుణాసముద్రుడైన నారాయణునికి యిష్టమైన ఆయుధము నీవు. నీ శక్తివైభవము ముందు, అస్త్రములన్నియు శక్తిహీనములు. నీ పాదములకు నమస్కరించుచున్నాను ఈ దుర్వాసుని క్షమించమని కోరుచున్నాను. నీవు దుష్టులను, దుష్టశక్తులను నిర్మూలించెదవు నీ క్రోధమును యీ పేద బ్రాహ్మణునిపై ప్రసరింపజేయకుము''

అంబరీషుని ప్రార్థనలకు సంతుష్టుడై సుదర్శనుడు శాంతించెను దుర్వాసుని వెంటాడుట మానెను. మనస్సు మారిన దుర్వాసుడు రాజుతో యిట్లనెను. ''నీవు చాల ఉదారపురుషుడవు. అకారణముగా నిన్ను బాధించిన నాతో సరళముగా ప్రవర్తించుట చాల గొప్ప విషయము. నారాయణ భక్తుల గొప్పదనము గ్రహించినాను. తమ భక్తితో నారాయణుని ఆకట్టుకున్న భక్తులకు అసాధ్యమేదియు లేదు మనసులో యెల్లప్పుడూ భగవంతుని రూపమును చింతించు నీ వంటి భక్తులు గంగానదివలె పవిత్రులు, పరిశుద్ధులు. నీవు నన్ను చాల దయతో జూచినావు నేను పలికిన పరుష వాక్యములను విస్మరించి నన్ను రక్షించినావు''.

దుర్వాసుని వంటి మహర్షి అంబరీషుని పాదములపై బడగా, ఆ ఇరకాటపు పరిస్థితి నుండి దుర్వాసుని తప్పించుటకు రాజు ప్రయత్నించెను తనకు తగిన గౌరవము చూపలేదని అంబరీషునిపై కోపగించిన దుర్వాసుడు చివరకు తనను తాను రక్షించుకొనుటకు అంబరీషుని పాదములపై పడవలసి వచ్చెను. సన్నివేశము యిరువురకు యిబ్బందిగా నుండెను, యెట్లో ఆ క్షణము గడచిపోయెను.

దుర్వాసుడు ముల్లోకములు తిరిగి అంబరీషుని వద్దకు వచ్చునరికి ఒక సంవత్సరకాలము గడచెను ఆ సంవత్సర కాలమంతయు రాజు ఒక మెతుకైననూ భుజింపలేదు. తన దుడుకు ప్రవర్తనకు పరిణామములు యెంత తీవ్రముగా నుండునోయని యూహించి, దుర్వాసుడు రాజును భోజనము చేయవలసినదని పదేపదే కోరెను. అయితే అతిథిని మొదట గౌరవింపవలెనని రాజు ఉద్దేశ్యము. అది గ్రహించి సంతుష్ట మనస్కుడై హృదయములో ఆనందముప్పొంగగా, అంబరీషుని ఆతిథ్యము స్వీకరించుటకు దుర్వాస మహర్షి అంగీకరించెను. దుర్వాస మహర్షి భుజించి సంతుష్టుడైన పిదప అంబరీష మహారాజు భుజించెను.

దుర్వాసుడిట్లనెను ''నారాయణ భక్తుడవైన నీతో పరిచయము గలిగి నేను అనుగ్రహము పొందినాను. ఈ సంఘటన మన యిద్దరి చరిత్రలు చిరకాలము యీ లోకములో నిలిచిపోవునట్లు జేయగలదు'' అతడు రాజు వద్ద సెలవు తీసుకుని వెడలిపోయెను అంబరీషునకు జరిగిన దంతయూ ఒక స్వప్నము వలె తోచెను. దుర్వాసుని రాక, అతని ఆగ్రహము, సుదర్శన చక్రము అతనిని వెంబడించుట, చివరకు పశ్చాత్తాపపడుట — యీ విచిత్రములన్నియు అంబరీషుడు తలచుకొని, తనలో నిట్లనుకొనెను ''ఇదంతయు భగవంతుని లీల. దీని వెనుక నున్న ప్రయోజనము యెవరూ యెరుగలేరు కదా?''

107 కాకుత్థ్సులు

ఇక్ష్వాకు వంశీయులలో ఒకడైన పురంజయుడు, ఇంద్రవాహనుడుగా పేరుపొందెను దేవతలకు అసురులకు యుద్ధము సంభవించినపుడు, యెప్పటివలెనే ఇంద్రుడు భూలోకమును పాలించు రాజులలో నొకని సహాయము కోరెను సూర్య (ఇక్ష్వాకు) వంశములో జన్మించిన పురంజయుని సహాయ మర్థింపగా అతడిట్లనెను ''నేనొక నియతిపై నీ తరపున యుద్ధము చేసెదను యుద్ధము చేయునపుడు నీవు నాకు వాహనముగా నుండవలెను. ఇంద్రునికిది నచ్చలేదు. స్వర్గాధిపతి ఒక మానవునికి వాహనముగా నుండుట అవమానకరమని తలచెను. ఇంద్రుని ఆలోచనలు కనిపెట్టిన నారాయణుడు, పురంజయుని సహాయముతో యుద్ధములో నెగ్గు అవకాశము ఉండుటచేత, యీ నియమమున కంగీకరించమని ఇంద్రునికి నచ్చజెప్పెను భగవంతుని సలహాపై పురంజయునికి వాహనముగా నుండుటకు ఇంద్రుడు అంగీకరించెను ఇంద్రుడు ఎద్దు రూపము ధరించగా, ఈ యెద్దు మూపుపై పురంజయుడు కూర్చుండెను అతడు గొప్పవీరుడు పైగా నారాయణుని
వాడి బాణములతో అసురులను హతమార్చి వారిని నరకమునకు పంపెను అతి వైభవముగా అసురులతో పోరాడగా, వారు నగరము విడిచిపెట్టి పారిపోయిరి రాజు వారి సంపదనంతయూ తీసుకుని ఇంద్రుని కిచ్చెను ఆ విధముగా అతనికి ఇంద్రవాహనుడనే పేరు కలిగెను కాని ఆ తర్వాత కాకుత్థ్సుడను పేరుతో ప్రసిద్ధి పొందెను అతని వంశములోని తరవాతి రాజులందరూ కాకుత్థ్సులని పేరుపొందిరి దశరథ తనయుడైన శ్రీరాముడు కూడ యీ పేరుతోనే ప్రసిద్ధుడు

★ ★ ★

ఇక్ష్వాకు వంశములో యువనాశ్వుడను రాజు జన్మించెను అతనికి సంతానము లేకుండెను జీవితముపై రోతపుట్టి, తన నూర్గురు భార్యలతో అరణ్యమున కేగెను అరణ్యములో నివసించుచున్న మహర్షులు అతనియందు దయతలచి, ఇంద్రుని అనుగ్రహమును పొందుటకై యజ్ఞము చేయ సంకల్పించిరి

యజ్ఞము సమాప్తికాగా, ఒక కుండను నీటితో నింపి ఆ జలమును పవిత్రము గావించమని దేవతల నావాహన చేసిరి. యజ్ఞశాలలో ఒక పవిత్ర స్థలమున ఆ జలము నుంచిరి ఆ జలము రాజు భార్యల కుద్దేశించినది

అర్ధరాత్రి యువనాశ్వునకు తెలివి వచ్చి లేచెను అతనికి అమితముగా దాహము వేసెను అతడు యజ్ఞశాలలో అందరూ నిద్రించుచుండుట జూచెను అతని యెదుటనే యున్న కుండలోని నీటి ప్రత్యేక గుణములు యేమిటో అతడు యెరుగడు. ఆ కుండలోని నీరు త్రాగి, తిరిగి నిద్రకుపక్రమించెను మరునాటి ఉదయము లేచి ఋషులు ఆ కుండ శూన్యముగా నుండుట జూచి, ప్రతి ఒక్కరినీ, ''ఈ కుండలోని నీరు యెవరు త్రాగిరి?'' అని అడిగిరి రాత్రి విపరీతముగా దాహము వేయుటచే ఆ నీరును త్రాగితినని రాజు చెప్పెను ఏమి చేయవలెనో యెవరికినీ తెలియకుండెను. ఏమి జరుగునో కూడ వారికి తెలియకుండెను

కొన్ని నెలలు గడచెను యువనాశ్వుని కడుపు కుడిభాగము శిశువుతో పెద్దగా నయ్యెను అతని కడుపు ఛేదించగా ఒక కుమారుడు పుట్టెను. పుట్టిన వెంటనే ఆ శిశువు ఆకలితో గట్టిగా యేడ్చుచుండెను యువనాశ్వునికి సంతానము కొరకై ఇంద్రుని అనుగ్రహము పొందుటకు యజ్ఞము చేయుటచేత, ఇంద్రుడు అక్కడకు వచ్చెను ఇంద్రుడు తన కుడిచేతి చూపుడువ్రేలును శిశువు నోటిలో పెట్టెను ఇంద్రుని చేతి నుండి స్రవించిన అమృతమును ఆ శిశువు గ్రోలెను

ఋషులు తపః ప్రభావమువలన యువనాశ్వునకు మరణము కలుగలేదు ఆ తర్వాత అతడు తపస్సు చేసి ముక్తిపొందెను.

ఆ శిశువుకు మాంధాత యని పేరు పెట్టిరి అతడు గొప్ప చక్రవర్తియై యీ భూమిపై పరిపాలించెను కృతయుగమున అతడు గొప్ప ఆభరమణమని ప్రజలు కొనియాడిరి

★ ★ ★

ఆ వంశములో తరువాత సత్యవ్రతుడు రాజయ్యెను. అతని కుమారుడు త్రిశంకుడు త్రిశంకు మహారాజు మానవ శరీరముతో స్వర్గము వెళ్ళగోరెను అతని యీ విచిత్రమైన కోరికను అంగీకరించక, వసిష్ఠుడు అతని పుత్రులు యజ్ఞము చేయుటకు నిరాకరించి, అతనిని చండాలుడగునట్లు శపించిరి విశ్వామిత్రుడు, అతనిని స్వర్గమునకు పంపుటకు యజ్ఞము చేయ నంగీకరించెను. విశ్వామిత్రుడు యజ్ఞము చేయగా, త్రిశంకు స్వర్గమునకు అధిరోహించెను. చండాలుని దృక్కులు కలిగి మానవ రూపములో నున్న త్రిశంకుడు స్వర్గమునకు వచ్చుట దేవతలకు, ఇంద్రునకు యిష్టము లేకుండెను. అందుచే వారు త్రిశంకుని క్రిందకు త్రోసివేసిరి. త్రిశంకుని ఆవేదనను వినిన విశ్వామిత్రుడు కోపగించి, త్రిశంకుని ఆకాశము మధ్యలో ఆపివేసి, ప్రత్యేకమైన త్రిశంకు స్వర్గమును సృష్టించెను అతడు నూతనముగా మరొక బ్రహ్మను సృష్టించునంతలో దేవతలు వచ్చి విశ్వామిత్రుని సముదాయించిరి తనకు విశ్వామిత్రుడు ప్రత్యేకముగా సృష్టించిన స్వర్గములో త్రిశంకుడు జీవించుచుండెను

★ ★ ★

త్రిశంకుని కుమారుడు హరిశ్చంద్రుడు అతనికి పుత్రులు లేరు అతడు సముద్రమున కధిపతియైన వరుణుని ప్రార్థించి యిట్లనెను. ''నేను కోరునది ఒక పుత్రుడు పున్నామ నరకము నుండి రక్షించుటకు నాకు పుత్రుడు కావలెను. నాకు పుత్రుడు కలుగగానే, యజ్ఞము జేసి నా పుత్రుని నీకు సమర్పించెదను'' కొంత కాలమునకు ఒక పుత్రుడు కలిగెను అతని పేరు రోహితుడు వరుణుడు హరిశ్చంద్రుని సమీపించి యిట్లనెను ''పుత్రుడు కలుగగానే యజ్ఞము జేసి పుత్రుని సమర్పించెదనని మాట యిచ్చినావు'' హరిశ్చంద్రు డిట్లు జవాబిచ్చెను ''కొత్తగా పుట్టిన శిశువు శుద్ధిగా నుండదు పది రోజుల తర్వాత శిశువునకు శుద్ధి కలుగును ఆ తర్వాత నీకు సమర్పించెదను''

పదిరోజుల తర్వాత వరుణుడు తిరిగి వచ్చి హరిశ్చంద్రుని శిశువు నిమ్మని కోరెను అంత రాజు యిట్లనెను ''యజ్ఞ పశువుకు పళ్లు ఉండవలెను అందుచేత యీ శిశువుకు పళ్ళు వచ్చునంతవరకు వేచి యుండుము'' పళ్ళు వచ్చిన తర్వాత వరుణుడు రాగా, రాజు బాలునికి పాల పళ్లు రాలవలెనని, ఆ తర్వాత అవి తిరిగి వచ్చిన తర్వాత యిచ్చెదనని యేదో ఒక మిష పెట్టి వరుణుని పంపుచుండెను ఇట్లు కొంతకాలము జరిగెను రాజునకు పుత్రునిపై గారాబము పెంపొందగా, యేదో ఒక మిషతో వరుణుని పంపించి వేయుచుండెను. ఒకసారి, ''నా కుమారుడు కవచము ధరించనీ, కవచము ధరించిన క్షత్రియుడే శుద్ధమైనవాడు'' అని వరుణునితో పలికెను

ఈ లోపుగా పెరిగి పెద్దవాడగుచున్న రోహితుడు తనకు జరుగబోవు ముప్పును తెలుసుకొనెను ఈ ముప్పు నుండి తప్పించుకొనుటకు ధనువు తీసుకుని అరణ్యమునకు పారిపోవలెనని తలంచెను అసత్యవాది యైన రాజును వరుణుడు శిక్షింపనెంచి, అతడు జలోదర వ్యాధితో బాధపడునట్లు చేసెను ఆ విషయము వినిన రోహితుడు, తన తండ్రిని రక్షించుటకై యింటికి వెళ్ళుటకు నిశ్చయించెను ఇంద్రుడతనిని ఆపి,

పుణ్య నదులను సందర్శించమని చెప్పెను. అయిదేండ్లు గడచిన తర్వాత రోహితుడు తన తండ్రి వద్దకు రాజ్యమునకు వెళ్ళుటకు నిశ్చయించెను.

మార్గము నందు రోహితుడు ఒక బ్రాహ్మణుని కలుసుకొనెను. ఆ బ్రాహ్మణుని ముగ్గురు కుమారులలో ఒకనిని వరుణునకు సమర్పించుటకు రోహితుడు కొనెను. అతని పేరు శునశ్శేపుడు. జలోదర రోగముతో బాధపడుచున్న హరిశ్చంద్రుడు నరమేధ యాగము జరిపెను. ఈ యాగమందు పశుబలికి బదులుగా నరబలి యివ్వవలసి యుండెను. హోతయైన విశ్వామిత్రుడు వరుణ జప మంత్రములను శునశ్శేపునకు బోధించెను. దీనికి వరుణుడు చాల సంతోషించి మెచ్చుకొనెను. యాగము సంతృప్తికరముగా సమాప్తియైనందుకు ఇంద్రుడు మెచ్చి, హరిశ్చంద్రునకు బంగారు రథమును ప్రసాదించెను. వరుణుడు శునశ్శేపుని మెచ్చుకుని, అతడు చిరకాలము జీవించునట్లు ఆశీర్వదించెను. విశ్వామిత్రుడు శునశ్శేపుని దత్త పుత్రునిగా స్వీకరించెను. యాగము సంతృప్తికరముగా ముగిసెను. దేవతలు హరిశ్చంద్రుని యాగమును మెచ్చి ఆశీర్వదించిరి. హరిశ్చంద్రుడు తన పుత్రుని కోల్పోవలేదు. అనేక సంవత్సరములుగా హరిశ్చంద్రుని బాధించుచున్న రోగము కూడ శాంతించెను.

త్రిశంకుని యెడల విశేషమైన అభిమానముగల విశ్వామిత్రుడు హరిశ్చంద్రునకు బ్రహ్మవిద్య బోధించు బాధ్యత స్వీకరించెను.

★ ★ ★

ఆ వంశమునందే జన్మించిన మరియొక రాజు ఖట్వాంగుడు. అతడు గొప్ప వీరుడు. ఒక పర్యాయము దేవతలను అసురులు వేధించుచున్నపుడు, దేవతలు ఖట్వాంగ మహారాజు సహాయము కోరిరి. ఖట్వాంగుడు ఇంద్రునికి సహాయముగా వెళ్ళి అసురులను అణచి వేసెను. అతడు చేసిన సహాయమునకు దేవతలు మెచ్చుకుని, వర మడుగవలసినదని కోరిరి. ఖట్వాంగు డిట్లు పలికెను. ''నా జీవితములో యింకెన్ని సంవత్సరములు మిగిలి యున్నవో దయచేసి చెప్పవలెను''. దేవతలు ఒకరినొకరు పరికించి సంకోచముతో నిట్లనిరి. ''ఇది దేవ రహస్యము. నీవు అడిగిన వరము ప్రసాదించెదమని మాట యిచ్చి యుండుటచేత నీకు మేము చెప్పెదము. ఇంకా ఒక ముహూర్త కాలము మిగిలియున్నది''. (ముహూర్త కాలము సుమారు యిరువది నిమిషములకు సమానము).

ఖట్వాంగునకు విచారము కలుగలేదు. త్వరలో భూలోకమునకు వచ్చి, ధ్యానమునకు కూర్చుండెను. అతడు భగవంతుని ధ్యానించుచుండెను. భగవంతుని ప్రార్థించు మాటలు అతడు పలుకుచుండెను. అతడిట్లనెను. ''ఈ లోకములో నాకేదియు ప్రియము కాదు. నా జీవితములో యెన్నడూ అధర్మముగా వర్తించలేదు. నేను యెల్లపుడూ నిన్ను తప్ప అన్యుల నెవరినీ తలంచలేదు. దేవతలు స్వర్గమును ప్రసాదింతుమని ప్రలోభపెట్టిరి. కాని నాకు స్వర్గముపైగాని, స్వర్గ సౌఖ్యములపైగాని మక్కువ లేదు. నీ స్వరూపమును, మాయలో చిక్కుకున్న దేవతలు యెరుగరు. మనస్సు, ఇంద్రియములు సృష్టించే యీ మాయా లోకమును వదిలి, నీ పాదపద్మముల యందు ఆశ్రయము పొందగోరుచున్నాను''. ఆ విధముగా ప్రార్థించుచున్న ఖట్వాంగుడు యీ భౌతిక కాయమును వీడి నారాయణునిలో లీనమయ్యెను.

నవమ స్కంధము

108 సగరుని కుమారులు

ఇక్ష్వాకు వంశములో బాహుకుడను రాజు జన్మించెను శత్రువులు అతని రాజ్యమును బలవంతముగా తీసుకొనగా, అతడు భార్యలతో అరణ్యము కేగెను అరణ్యములో ఆ రాజా మరణించెను దుఃఖములో మునిగిన భార్య శోకము పట్టలేక భర్త చితిపై ప్రవేశించుటకు సిద్ధపడెను ఆమె గర్భవతిగా నుండుటచే, ఆశ్రమములోని ఋషులు ఆమెను నివారించిరి

ఆ రాజు యితర భార్యలకు యీ వార్త కంటగింపుగా నుండెను వారు మొదటి నుండి ఆమె అదృష్టమునకు అసూయ చెందుచుండిరి కాబోవు మహారాజుకు ఆమె తల్లియగుట వారి కిష్టము లేకుండెను అందుచే వారు ఆహారములో విషము కలిపి, ఆమెకు యెంతో ప్రేమతో పెట్టిరి కాని వారు ఊహించినట్లు ఆమెకుగాని, గర్భములోని శిశువుకు గాని యెట్టి కీడును జరుగలేదు పుట్టిన తర్వాత శిశువును తల్లి సేవించిన విషము (గరము) కప్పి యుండెను అందుచే ఆ శిశువుకు 'సగరు'డని పేరు పెట్టిరి

సగరుడు చాల ప్రఖ్యాతి పొంది, తర్వాత చక్రవర్తి అయ్యెను అతడు అశ్వమేథ యాగము చేయ సంకల్పించెను యాగమందు బలి యిచ్చు అశ్వమును బయటకు విడిచిపెట్టిరి
ఇంద్రుడు అశ్వమును దొంగిలించెను రాజు తన అరువది వేలమంది పుత్రులను అశ్వమును వెదకి తీసుకు రమ్మని పంపెను అతని పుత్రులందరూ మహా శూరులు వారికి అహంభావము కూడ యెక్కువ అశ్వమును వెదకుటకై వారు బయలుదేరిరి

వారు లోకమంతయు వెదకిరి అశ్వము వారికి దొరకలేదు శక్తిమంతమైన భుజములతో వారు భూమిని త్రవ్వి పాతాళ లోకము ప్రవేశించిరి ఈశాన్య దిక్కున ప్రయాణించుచుండగా వారు ఒక గుహ చూచిరి ఆ గుహ యందు ఒక ఋషి సమాధి యందు ఉండెను ఆ ప్రక్కనే గుఱ్ఱము నిర్విచారముగా గడ్డి మేయుచుండెను

''ఆ దొంగను చూడు!'' అని గర్వోన్నతులైన రాకుమారులనిరి గుఱ్ఱము దొంగిలించి, యేమియు తెలియని నంగనాచి వలె కనులు మూసుకుని కూర్చునియున్నాడు ఇతనిని చంపి వేయుదము'' అని తలపోసి అరువది వేలమంది రాకుమారులు ఆయుధములు ధరించి సమాధిలో నున్న ఋషిని సమీపించిరి

ఆ ఋషి కపిలుడు అతడు కనులు తెరచెను అతని ఆగ్రహ దృష్టి వారిపై పడగా వారందరూ భస్మమై బూడిదగా మారిరి

సత్త్వ గుణము మూర్తీభవించిన వాడు కపిలుడు అతనిలో తమోగుణమునకు తావులేదు అందుచే, కపిలుని ఆగ్రహమునకు వారు భస్మమైనారనుట బహుశః సరికాకపోవచ్చును తమోగుణము అధమమైనది ఋషులు సహజముగా అధ్యాత్మిక శక్తిసంపన్నులు అంతేకాక, సంసారమను ఊబిలో చిక్కుకున్న మానవులకు, దీనినెట్లు సులభముగా దాటవచ్చునో బోధించినవాడు కపిలుడు ఇది నావగా చేసుకున్నచో భయంకరమైన యీ సంసారమనే సముద్రమును దాట వీలగును. అట్టి మహాత్మునకు శత్రువు గాని, స్నేహితుడు గాని ఉండడు మరి సగరుని పుత్రులు ఆ విధముగా యెందుకు భస్మము గావింపబడినారు? ఒక మహాత్ముని కించపరుచుటచేత వారు మృతి చెందిరి వారి వివేక శక్తిని ఇంద్రుడు హరించి వేసెను

సగరునికి యిద్దరు భార్యలు. మరణించిన అరువది వేలమంది పుత్రుల తల్లి సుమతి. రెండవ భార్య పేరు కేశిని. ఆమె కుమారుడు అసమంజసుడు. అసమంజసుని కుమారుడు అంశుమంతుడు. ఇతనికి పితామహుడైన సగరునిపై అమితమైన భక్తి గౌరవములు కలవు.

అసమంజసుడు ఒక విచిత్రమైన వ్యక్తి. పూర్వ జన్మలో అతడొక యోగి. దురదృష్టవశాత్తు అతడు అనురాగము పెంచుకొని సంగుడయ్యెను. దాని ఫలితముగా అతడు మహారాజునకు పుత్రుడుగా జన్మించెను. అతనికి పూర్వ జన్మ స్మృతి యుండెను. ఈ జన్మలో అతడు క్రూరుడుగా నటించి, బంధముల నుండి తనను తాను రక్షించుకొనుచుండెను. చిన్నతనము నందే అతని చర్యలు అమానుషముగా గోచరించుచుండెను. అందరినీ అసంతృప్తులను గావించుచూ, రాగబంధము నుండి తప్పించుకొనుచుండెను. చిన్న పిల్లలను పట్టుకుని సరయూ నదిలో వారిని త్రోసివేయుచూ నవ్వుచు చప్పట్లు చరుచుచుండుట జూచి, నగర పౌరులు భయభ్రాంతులైరి. అతని అమానుష చర్యలు భరింప శక్యము కాకుండెను.

అతని అమానుష చర్యలకు అంతులేకుండుటచేత, అతనిని శిక్షించవలసినదని రాజుకు పౌరులు మొరపెట్టుకొనిరి. చట్టము ననుసరించి, అసమంజసుని, రాజు దేశము నుండి బహిష్కరించెను. అరణ్యమునకు పోవుటకు ముందు, అంతకు ముందు సరయూ నదిలోనికి విసిరివేసిన పిల్లలను తిరిగి పునరుజ్జీవింప జేసెను. ఇది చూచి అచ్చెరువందిన ప్రజలు మాట్లాడునంత లోపలనే, అతడు అడవికి వెళ్ళిపోయెను. అచ్చట తపస్సు చేసి మోక్షము పొందెను. సత్పురుషుడైన కుమారుని పోగొట్టుకున్నందుకు సగర మహారాజు మిక్కిలి విచారించెను. ఆ కారణము చేత సగరుడు, ఇక్ష్వాకు వంశములో మిగిలిన అంశుమంతునిపై విశేషమైన ప్రేమను వర్షించుచుండెను.

109 అంశుమంతుడు

అశ్వమేధ యాగము పూర్తికావలసి యున్నందున, సగర చక్రవర్తి మనుమడైన అంశుమంతుని తన అరువది వేల మంది పుత్రులను, అశ్వమును వెదకుటకై పంపించెను. అశ్వమును పట్టి తెచ్చుటకు సగర పుత్రులు వెళ్ళి చాల సంవత్సరములయ్యెను. వారు తిరిగి రాకుండుటచేత సగర చక్రవర్తికి ఆందోళన యెక్కువయ్యెను. అంశుమంతుడు తన పెదతండ్రులను వెదకుటకు బయలుదేరెను. వారు వెళ్ళిన మార్గముననే పాదముల గుర్తులను బట్టి అంశుమంతుడు కూడ వెళ్ళెను. వారు భూమిని త్రవ్వి వెళ్ళిన బిలములో ప్రవేశించి, అంశుమంతుడు ప్రయాణము చేయగా చేయగా చివరకు గుహను చేరెను. అక్కడ గుర్రము కట్టివేయబడి యుండుట అతడు చూచెను. తన పెదతండ్రులు చూచినట్లుగనే కపిలుడు సమాధిలో నుండుట కనుగొనెను. కపిల మహర్షి ప్రక్కగా బూడిద రాసిగా పడియుండుట జూచి యిది యేమైయుండునా యని అంశుమంతుడు తలపోసెను.

కపిల వాసుదేవుని సమీపించి, అంశుమంతుడు నమస్కరించెను. వినయము, భక్తిప్రపత్తులతో అంశుమంతుడిట్లనెను. ''ప్రభూ! సృష్టికర్తయైన బ్రహ్మ కూడను నిన్ను సంపూర్ణముగా తెలిసికొనలేరు. అటువంటప్పుడు సాధారణ మానవులమైన మేము త్రిగుణములు, మనస్సు, బుద్ధితో కూడిన మాయలో చిక్కుకుని యుండగా

నిన్ను తెలుసుకొనుట యెట్లు సాధ్యము? మేము ఆవరణచే (మాయ) కప్పబడి యుండుటచేత నీ వంటి దివ్య పురుషుల నుండి వెలువడే వెలుగును చూడలేని అంధులుగా నుంటున్నాము వస్తు చూడగలుగుచున్నాము ఇంద్రియములు గ్రహించు వస్తువులనే చూచుచున్నాము మాలో నిబిడీకృతమై యున్న ఆత్మ వైభవమును తెలియలేకున్నాము. అవస్థాత్రయము - జాగ్రత్, స్వప్న, సుషుప్తి - నెరుగుదుము కాని యీ మూడింటిని దాటి వెళ్ళలేకున్నాము. అజ్ఞానినైన నా వంటి మానవుడు నీ వైభవమును యెట్లు తెలుసుకొనగలడు? కాని నాకు తెలిసినది యింత మాత్రమే. ఈ లోకమున కాశ్రయుడవు, త్రిగుణాతీతుడవు, కార్య కారణముల కతీతుడవు, నిత్య సత్యమైన పరమాత్మ తత్త్వమును మానవులకు బోధించుట కవతరించిన వాడవు. నీకు నా నమస్కారము నీవు సనాతనుడవు, యెట్టి మార్పును పొందని వాడవు; దేవాదిదేవుడవు నిన్ను దర్శించు మహద్భాగ్యము లభించినది నీ దర్శనముచేత సంకల్పములచే ప్రేరణ నొ చేయు కర్మ బంధములనే మాయ నుండి విముక్తి లభించినది నీకు నా ప్రణామములు ''

కనుల నుండి అశ్రువులు స్రవించుచుండగా, అంశుమంతుడు కపిలుని పాదములపై బడెను రాకుమారుని వినయమునకు భక్తికి సంతోషించి, కపిలు డిట్లనెను. ''కుమారా! నీ పితామహుడైన సగరునికి చెందిన యీ అశ్వమును తీసుకువెళ్ళుము నేను యోగ నిద్రలో నున్నపుడు, ఇంద్రుడు యీ అశ్వమును యిచ్చట వదలి వెళ్ళెను నీ పెద తండ్రులు అహంభావముచేత దగ్ధమైనారు వారి ఆత్మలు పవిత్ర మందాకినీ (గంగ) జలముతో శుద్ధియై పితృలోకము చేరగలవు

అంశుమంతుడు కపిలునికి ప్రదక్షిణము గావించి, సాష్టాంగ నమస్కారము చేసెను అశ్వమును తీసుకుని నగరమున కేగెను. సగరుడు యాగము పూర్తిగావించెను తన అరువదివేల పుత్రుల దురదృష్టమునకు విచారించి, సగర చక్రవర్తి అంశుమంతునికి పట్టము గట్టెను తరువాత అరణ్యమునకేగి శాంతి మోక్షములకై తపస్సు చేయ నారంభించెను.

అంశుమంతుడు గంగను మెప్పించి, ఆమె భూమికి వచ్చునట్లు చేయుటకు తపస్సు చేసెను. కాని అతడు కోరిన దానిని సాధించలేకపోయెను వృద్ధాప్యము సమీపించగా కొంత కాలమునకు మరణించెను అతని కుమారుడు దిలీప మహారాజు కూడ గంగను మెప్పించలేకపోయెను ఆ పని అసంపూర్తిగా నిలిచిపోయెను తరువాత అతడు కూడ మరణించెను

110 గంగా – భాగీరథి

దిలీపుని కుమారుడు భగీరథుడు రాజ్యమును మంత్రులకు వదలిపెట్టి, భూమికి గంగను తెచ్చి తన పూర్వులకు పితృలోక ప్రాప్తి కలిగించుటకు దృఢనిశ్చయుడయ్యెను. అతడు చాల కాలము మిక్కిలి శ్రద్ధాభక్తులతో తపస్సు చేయగా, గంగాదేవి అతని తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమయ్యెను చేతులు జోడించి నమస్కరించి ఆమెతో యిట్లనెను ''దేవీ! గంగా! మందాకినీ! నీవు భగవంతుని పాదముల నుండి జన్మించినావు వామనుడు మూడడుగుల భూమి బలి చక్రవర్తిని కోరినపుడు బలి ప్రసాదించగా వామనుడు విశ్వరూపము ధరించెను ఒక పాదము స్వర్గ లోకమును వ్యాపించగా, సత్య లోకములోని బ్రహ్మ ఋషి సమేతంగా, తన

కమండలములోని జలముతో ఆ పాదము నభిషేకించెను. అట్లు నభిషేకించిన జలము మందాకినిగా రూపొంది నది నీకు 'విష్ణుపది' అను పేరు గూడ గలదు. నన్ను, నా కుటుంబమును కరుణించుము''.

మందాకిని చిరునవ్వు నవ్వి, వరము కోరుకొమ్మనెను. కపిలుడు చెప్పిన మాటలు పలికి యిట్లనెను. ''తల్లీ! నా పూర్వులకు పితృలోకమును ప్రసాదింపుము. మూడు తరములుగా వారికి పితృలోక ప్రాప్తి కలుగకుండెను''

గంగ (మందాకిని) యిట్లనెను. ''భగీరథా! నేను స్వర్గము నుండి వచ్చి భూమిపై ప్రవహించునపుడు నా వేగమెట్లుండునో నీవు గ్రహించలేకున్నావు. నా వేగము నరికట్టు శక్తిమంతు లెవరున్నారు? నా వేగము నరికట్టకున్నచో, ప్రవాహ తీవ్రతకు పాతాళము, వరకు పోయెదను. నీ తపస్సంతయూ వ్యర్థమగును. అదియుగాక, యీ స్వర్గమును వదలిపెట్టి, పాపభూయిష్ఠమైన భూమికి నేను యేల రావలయునో తెలియకు న్నది. ప్రజలు ఆ జలములో స్నానమాచరించగా, వారి పాపములచేత నేను కలుషితము కాగలను. నేను వారి పాపములను గ్రహించవలసి యుండును నేనెట్లు శుద్ధియగుదును? నన్నెవరు శుద్ధిచేయగలరు?''

భగీరథుడు వినయముతో నిట్లనెను. ''నీవు భయపడుచున్న పాపము పెద్ద సమస్య కాదు. కర్మ బంధముల నుండి ముక్తిపొందిన మహాపురుషులు, భగవచ్చింతన తప్ప అన్య చింత నెరుగని మహాత్ములు, తమ మనస్సులో నారాయణుని ప్రతిష్ఠించుకున్న పుణ్యాత్ములు, నీలో స్నానము చేసినపుడు నీవు శుద్ధికాగలవని జ్ఞానవంతులు చెప్పగా వినియున్నాను. అవి తీర్థ రూపములుగా యేర్పడి నిన్ను శుద్ధి గావించగలవు. ఆ పుణ్య పురుషులు పాపము హరించు శక్తి గలవారగుటచే వారిని పాపము అంటదు. ఇక రెండవది, నీ వేగము నరికట్టు సమస్య యున్నది. మహాదేవుని అనుగ్రహము చేతనే యిది సాధ్యము కాగలదు. నేను మహాదేవుని ప్రార్థించెదను. తల్లీ! మహాదేవుడు తన శిరస్సుపై నిన్ను పెట్టుకుని నీ వేగము నరికట్టుట కంగీకరించినచో, నా పూర్వులను శుద్ధిచేసి పితృలోక ప్రాప్తి లభ్యమగునట్లు చేయగలవా?''

''తప్పక చేసెదను. నా మాట నమ్ము'' అని గంగ పలికెను

భగీరథుడు తిరిగి మహాదేవుని మెప్పించుటకు తపస్సు ప్రారంభించెను భక్తులకు తొందరగా ప్రసన్నుడై వారు కోరిన వరములను ప్రసాదించునని పేరు వడసిన మహాదేవుడు, భగీరథుని తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై యేమి కావలెనని యడిగెను మహాదేవుని కీర్తించి భగీరథుడు యిట్లు విన్నవించుకొనెను. ''మహాదేవా! కపిలుని ఆగ్రహమునకు గురియైన నా పూర్వులు యెట్లు భస్మమైతిరో నీవు యెరుగుదువు. కపిల మహర్షి నా పితామహునితో మందాకినీ జలముతో వారు. శుద్ధి కాగలరని చెప్పెను అనేక సంవత్సరములు ఆమెను ప్రార్థించగా, ఆమె భూమికి వచ్చుట కంగీకరించెను. కాని ఆమె అతి వేగముగ యీ భూమికి వచ్చునపుడు ఆ వేగమును భరించు శక్తి యీ భూమికి లేకుండుట ఆటంకముగా నున్నది అందుకే నేను మిమ్ములను ప్రార్థించుచున్నాను. ఆమె యీ భూమికి దిగి వచ్చునపుడు, ఆమెను మీ శిరస్సున ధరించి ఆమె వేగము నరికట్టవలెను మహాదేవుడు సంతోషముతో 'సరే' అనెను.

మందాకిని స్వర్గము నుండి అతి వేగముతో క్రిందికి వచ్చుచుండెను. ఈ దృశ్యమును స్వర్గవాసులు ఆశ్చర్యముతో తిలకించుచుండిరి. మహాదేవుడు త్రిశూలమును రెండు చేతులతో వెనుక పట్టుకుని, తల కొద్దిగా పైకెత్తి నిలుచుండెను అతని వక్షము ముందుకు యెగసెను. అతని భుజములపై నున్న సర్పములు అటు

నిటు కదలుచుండెను బంగారు వన్నెతో మెరయుచున్న అతని శరీరమున, అతని కంఠమున నీల వర్ణపు మచ్చ ప్రకాశించుచుండెను అతని పెదవులపై చిరునవ్వు కదలాడగా, లోకమంతయూ గంగానది దిగి వచ్చుట అత్యంతాశ్చర్యముతో తిలకించెను కన్నులు వెడల్పు చేసుకుని, చేతులు జోడించి భగీరథుడు చూచుచుండెను. అతని గుండె వేగముగా కొట్టుకొనుచుండెను. తన పూర్వులకు పితృలోకప్రాప్తి కలుగబోవుచున్నందుకు సంతోషించెను

తన శక్తిని గ్రహించిన గంగ కొద్దిగా గర్వము చెందెను ఆమె అతి వేగముగా దిగుచుండెను. మహాదేవుడు, జడలు కట్టియున్న తన శిరస్సుపై ఆమెను స్వీకరించెను. ఇంతలో ఒక విచిత్రము జరిగెను! అతి వేగముగా హోరు మను శబ్దముతో దిగి వచ్చుచున్న గంగ కన్పించకుండెను మహాదేవుని జడలలో చిక్కుకుపోయెను మహాదేవుని జడలలో చిక్కుకున్న గంగి బయట పడుటకు ప్రయత్నించి విఫలురాయ్యెను.

భగీరథుడు చూచి వాపోవుచూ యిట్లనెను ''ఓ భగవంతుడా! ఇంతలో యేమి జరిగెను? నా తపస్సు అంతా వృధాయేనా? నన్ను కరుణించి, గంగామాతను విడువుము'' అదే చిరునవ్వు పెదవులపై కదలాడగా, మహాదేవుడు తన శిరస్సుపై నున్న ఒక వెంట్రుక ద్వారా గంగ కొద్ది కొద్దిగా జారిపడునట్లు చేసెను. మందాకిని గర్వము భంగము కాగా, జరిగిన దానికి విచారించి సరిదిద్దుకొనెను ఒకొక్క బొట్టుగా మందాకిని భూమిపై పడెను అట్లు పడిన గంగా బిందువులు సరస్సుగా యేర్పడి, 'బిందు సరస్సు' అనియు, 'సప్తస్రోతస్స'నియు పేరొందెను

గంగి యేడు పాయలుగా చీలిపోయెను మూడు తూర్పు దిక్కువైపు, మూడు పశ్చిమ దిక్కువైపు ప్రవహించెను ఏడవ పాయ భగీరథుని రథము ననుసరించి కపిలుని గుహవైపుగా ప్రవహించెను.

భూమిని గంగ స్పృశించిన ప్రదేశములన్నియు పునీతమయ్యెను భగీరథుని రథము వెండి వలె మెరయుచు కొద్ది కొద్దిగా పడుచున్న గంగా బిందువులు, తండ్రిని పుత్రిక అనుసరించునట్లు, అనుసరించెను. త్వరలోనే కపిలుని గుహ సమీపించెను సగరుని అరువదివేల పుత్రులు భస్మముగా మారిన ఆ భస్మరాశిని గంగ తాకి వారిని పునీతులను జేసెను అంతట వారు పితృలోకము చేరిరి.

స్వర్గమందు మందాకినిగా పేరొందియున్న ఆ నది, భూలోకమున గంగ యను పేరుతో ప్రసిద్ధి చెందెను. ఈ లోకమునకు భగీరథుడు గంగను తెచ్చుటచే, గంగను భగీరథుని పుత్రికగా పరిగణించి భాగీరథి యను పేరుతో వ్యవహరించుచున్నారు

111 సౌదాస మహారాజు

భగీరథుని వంశములో జన్మించినవాడు సౌదాసుడు అతడు సుదాసుని పుత్రుడు సూర్యవంశపు రాజులంద రివలె సౌదాసుడు ధర్మపరాయణుడు మరియు దైవభక్తి కలవాడు. ఒకసారి అతడు వేటకు వెళ్ళెను వేటాడుచుండగా అతనికొక రాక్షసు డెదురయ్యెను. ఆ రాక్షసుని సంహరించి, తిరిగి నగరమునకు వచ్చెను ఆ రాక్షసునకొక సోదరుడు కలడని, రాక్షసుని సంహరించి నందుకు అతని సోదరుడు తనపై పగబట్టెనని

రాజునకు తెలియదు రాక్షసుని వచ్చి, కపట మార్గమున రాజ సౌధములో ప్రవేశించెను వంటవాని వేషము ధరించి వంట గదిలో నుండెను.

ఒకసారి రాజు తన కుల గురువైన వసిష్ఠునికి విందు చేయదలచి ఆహ్వానించెను. వంటవాడుగా నున్న రాక్షసుని సోదరుడు నరమాంసమును వండి వసిష్ఠునకు వడ్డించెను తనకు వడ్డించిన పదార్థము భుజింప యోగ్యము కానిదని వసిష్ఠుడు గ్రహించెను వసిష్ఠుడు రాజుపై ఆగ్రహము చెంది యిట్లు శపించెను ''నీవు రాక్షసుడవై నాకు వడ్డించిన యీ ఆహారమును భుజించగలవు''

ముక్కోపులైన అందరి బ్రాహ్మణులవలె, వసిష్ఠుడు జరిగిన విషయమును నిదానముగా యోచించిన మీదట, రాజు అమాయకుడనియు, అది ఒక రాక్షసుని పన్నాగమనియు తెలుసుకొనెను వసిష్ఠుడు శాపమును మార్చుటకు అంగీకరించెను రాజు రాక్షసుడుగా పన్నెండు సంవత్సరములు మాత్రమే యుండునట్లు శాపమును మార్చెను కాని రాజు తనకు అకారణముగా శాపమిచ్చినందుకు వసిష్ఠునిపై ఆగ్రహము కలిగెను అతడు ధర్మపరాయణుడు తిరిగి వసిష్ఠ మహర్షిని శపించు నుద్దేశముతో చేతిలో జలము తీసుకొనెను ఇంతలో దైవభీతి, సద్గుణములు కలిగిన రాజు భార్య మదయంతి తన భర్త చేయునది అనుచితమని గ్రహించెను ఆమె భర్తను త్వరగా సమీపించి, ''ఇట్లు చేయవలదు. బ్రాహ్మణులను, ఋషులను గౌరవించ వలసియున్నది అతడు అన్యాయముగా శాపము నిచ్చినప్పటికీ, కులగురువుపై ఆగ్రహించుట పాడికాదు. ఇది నీకు, నీ వారసులకు శ్రేయస్కరము కాదు'' భార్య మాటల యందు రాజుకు నమ్మకము కుదిరెను కోపమునకు తావు నివ్వకుండ యుండవలసినదని గ్రహించెను చేతిలోని నీటిని తన కాళ్ళపై వేసుకొనెను అతని పాదములు చీకటి రాత్రివలె నల్లగా మారెను. దాని కారణంగా అతనికి 'కల్మాషపాదు'డను పేరు కలిగెను

రాజు రాక్షసుడై అరణ్యములో కాలము గడుపుచుండెను ఒకసారి అరణ్యములో బ్రాహ్మణ దంపతులను అతడు చూచెను. సహజమైన రాక్షస ప్రవృత్తిచేత ఆ బ్రాహ్మణుని పట్టుకుని తినుటకు సిద్ధపడెను అతని భార్య తన భర్తను వదలివేయమని రాక్షస రూపములో నున్న రాజును వేడుకొనెను ఆమె యిట్లనెను ''నీవు గొప్ప వీరుడవు, క్షత్రియుడవు, ధర్మపరాయణుడవు నిజముగా నీవు రాక్షసుడవు కావు. ఇక్ష్వాకు వంశములో మణి వంటి వాడవు. నీవు మహారథుడవు నీ భార్య మదయంతి మహాసాధ్వి దయచేసి నీ నిజస్వభావమును జ్ఞప్తికి తెచ్చుకుని నా భర్తను వదలిపెట్టి నన్ను చంపుము''

కాని రాక్షసుడుగా మారిన రాజు వినకుండెను. శాపగ్రస్తుడైన సౌదాసుని మనస్సు అసుర భావములతో నిండియుండుటచేత, అతడా బ్రాహ్మణుని చంపి తినివేసెను ఆ బ్రాహ్మణుని భార్య ఆవేదనతో ఆగ్రహము చెంది యిట్లనెను భార్యాభర్తలను విడదీసిన నిన్ను శపించుచున్నాను ''నీ భార్యను పొందు సమయములో నీవు మరణించగలవు'' ఆమె భర్తను దహనము చేసి, ఆ చితిలో తాను కూడ ప్రవేశించెను

పండ్రెండు సంవత్సరములు పూర్తి అయిన తర్వాత రాక్షస రూపము పోయి, స్వస్వరూపము కలిగెను అతడు రాజ్యమునకు తిరిగి వచ్చెను అతడు అత్యంత ప్రేమతో భార్యను సమీపించగా, బ్రాహ్మణుని భార్య యిచ్చిన శాపమును ఆమె భర్తకు గుర్తు చేసెను అందుచే అతడామెకు దూరముగా నుండవలసి వచ్చెను ఆ కాలము నాటి సంప్రదాయము ననుసరించి కుల గురువైన వసిష్ఠుడు మదయంతిని స్వీకరించి రాజునకు పుత్రుని ప్రసాదించెను మదయంతి గర్భమున శిశువు యేడు సంవత్సరము లుండెను చివరకు ఒక రాతితో వసిష్ఠుడు మదయంతి గర్భము నుండి ఆ శిశువును బయటకు లాగెను అందుచేత ఆ శిశువుకు 'అస్మకు'డని

పేరిడిరి. అతడు చక్కగా పరిపాలించుచు తన పూర్వుల యశస్సును యినుమడింపజేసెను. సూర్య వంశపు రాజులలో ఒకడైన ఖట్వాంగుడు, సౌదాసుని తరువాతి తరములోని వాడు. అతని మరియొక పేరు విశ్వసహుడు.

112 శ్రీరాముడు

ఖట్వాంగుని కుమారుడు దీర్ఘబాహుడు. రఘు మహారాజు యితనికుమారుడు. రఘు మహారాజు కుమారుడు అజుడు. అజుని కుమారుడు దశరథుడు. రావణుని దుశ్చర్యల నుండి దేవతలను రక్షించుటకు, భగవంతుడు యీ భూమిపై అవతరించుట కంగీకరించెను. దశరథునికి పుత్రుడుగా జన్మించెను. ఈ లోకమును పాపముల నుండి విముక్తిగావించుటకు, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులుగా నాలుగు రూపములు ధరించి భగవంతుడు అవతరించెను. రాముని కథను పెక్కుమారులు వినియుందువు. భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో కలిసి రాముడు దండకారణ్యములో సంచరించెను. తండ్రి పనుపున వారు అరణ్యవాసము చేసిరి. రాముని అతి సుకుమారముగా తండ్రి దశరథుడు పెంచెను. భార్య సీత అతని మెత్తని పాదములు స్పృశించగా అవి యెరుపెక్కి వాడిన పద్మమువలె నుండెడివి. అటువంటి రాముని సుకుమార కోమల పాదములు అరణ్యమున, తండ్రి ప్రతిష్ఠకు భంగము కలుగకుండుటకై తిరుగజొచ్చెను.

శ్రీరాముడు పదునారు సంవత్సరముల వయస్సులో నున్నపుడు, విశ్వామిత్రుడు దశరథుని వద్దకు వచ్చి యిట్లనెను. ''సిద్ధాశ్రమమున నేనొక గొప్ప యజ్ఞము చేయబోవుచున్నాను. మారీచ సుబాహులను రాక్షసులు ఆ ప్రదేశమును కలుషి మొనర్చి యజ్ఞమునకు భంగము గావించుచున్నారు. నీ కుమారుడైన శ్రీరాముని నాతో తీసుకువెళ్ళుటకు వచ్చినాను. అతడు రాక్షసులను హతమార్చును. శ్రీరాముని నాతో పంపుము''.

పుత్ర వాత్సల్యముచేత దశరథుడు శ్రీరాముని పంపుటకు యిష్టపడకుండెను. వసిష్ఠుడు దశరథునకు పుత్రవ్యామోహము తగదనియూ, విశ్వామిత్రునికి ఆగ్రహము కలుగనీయ వలదనియూ నచ్చచెప్పెను. రామలక్ష్మణులు విశ్వామిత్రునితో అరణ్యమున కేగిరి. వారు సిద్ధాశ్రమమును చేరిరి. యజ్ఞము జరుగుచున్నపుడు రాక్షసులు ఆకాశములో కనుపించిరి. శ్రీరాముడు సుబాహుని సంహరించి, మారీచుని సముద్ర తీరమునకు త్రోసివైచెను. యజ్ఞము సంపూర్తి అయ్యెను. విశ్వామిత్రుడు రామ లక్ష్మణులను మిథిలా నగరమునకు తీసుకువెళ్ళెను. జనకుడు విదేహ రాజ్యమును పాలించుచుండెను. మిథిల విదేహ రాజ్యమునకు ప్రధాన నగరము. అతని వద్ద శివ ధనుస్సు గలదు. స్వయంవరమున, శ్రీరాముడు శివ ధనస్సును విరిచి, జనకుని కుమార్తె సీతను పరిణయమాడెను. సీత శ్రీరామునికి అన్ని విధములను - అందము, వయస్సు, ఉత్తమ గుణములు, పాతివ్రత్యము - తగియున్నది.

సీతను తీసుకుని అయోధ్యకు వెళ్ళుచుండగా, మార్గమందు పరశురాము డెదురయ్యెను. ఈ భూమిపై యిరువది యొక్క పర్యాయములు అతి ఘోరముగా క్షత్రియుల నందరినీ నిర్మూలించెను. రాముడు పరశురాముని ధాటికి తట్టుకుని, అతనికి గర్వ భంగము జేసెను.

దశరథుడు కైకేయి కిచ్చిన వరముల కారణముగా, పదునాలుగేండ్లు దండకారణ్యములో వనవాసము

చేయవలసినదని శ్రీరాము నాజ్ఞాపించెను. పెద్దల యెడ విధేయత కలిగిన శ్రీరాముడు, యెట్టి విచారము లేక, పరమ యోగులు శరీరము త్యజించునట్లు, రాజ్యమును, సంపదను, బంధువులను, అత్యంత ప్రియమైన అయోధ్యా నగరమును విడిచిపెట్టి అరణ్యమున కేగెను. సీత, లక్ష్మణుడు శ్రీరాముని అనుసరించిరి.

అరణ్యములో నుండగా, రావణాసురుని సోదరి శూర్పణఖ శ్రీరాముని జూచి అతనిపై మోహము పెంచుకొనెను. ఆమెకు కలిగిన పాప చింతలకు కురూపిని జేసి శిక్షించెను. ఆమె ఖర, దూషణ, త్రిశిరులను పిలిచి రాముని శిక్షింపమని కోరెను. రావణుడు జన స్థానములో వీరిని తనకు ప్రతినిధులుగా నుంచెను. అరణ్యములో నున్న ఋషుల యెడ వీరు క్రూరముగా ప్రవర్తించుచుండిరి. ఈ ముగ్గురు రాక్షసులను, వారి సేనను యెదుర్కొని శ్రీరాముడు తన కోదండముతో వారి నందరినీ సంహరించెను.

రావణుడు సీత సౌందర్యము గూర్చి వినియుండెను. జన స్థానములోని తన ప్రతినిధులు సైన్య సమేతముగా రామునిచే గూలిరని తెలుసుకొనెను. తన సోదరి శూర్పణఖను కురూపి గావించినందుకు, రాక్షసులను హతమార్చినందుకు ప్రతీకారము చేయ నిశ్చయించెను. రావణుడు సీతా వ్యామోహములో పడి ఆమెను తీసుకుపోవ నెంచెను. మారీచుని ప్రోత్సహించి బంగారు లేడి రూపము ధరించునట్లు చేసెను. ఆశ్రమము ముందర విహరించుచున్న బంగారు లేడి అందమును చూచి, సీత ఆ లేడిని పట్టి తెమ్మని భర్తను కోరెను. ఎన్నడూ యేమియు కోరని సీతకు, ఆ బంగారు లేడిని తెచ్చి బహూకరించవలెనని సంకల్పించి శ్రీరాముడు ఆ లేడిని వెంబడించెను. కొంత దూరము వెంబడించిన తర్వాత, ఒక రాక్షసుడు లేడి రూపము ధరించినట్లు శ్రీరాముడు గ్రహించెను. వెంటనే ఆ లేడిపై బాణము ప్రయోగించెను. దక్షునిపై రుద్రునికి కల్గిన ఆగ్రహమువలె 'హిస్స'ను శబ్దము చేయుచు, లేడి రూపములో నున్న మారీచుని వధించెను. ఆశ్రమములో శ్రీరాముడు లేని సమయము చూచి, రావణుడు ప్రవేశించి సీత నెత్తుకుని పోయెను.

రామలక్ష్మణులు సీతను వెదకుటకై అరణ్యమంతయు సంచరించిరి. దారిలో వారికి దశరథుని స్నేహితుడైన జటాయువు యెదురయ్యెను. రావణునితో పోరి జటాయువు మరణించుటకు సిద్ధముగా నుండెను. శ్రీరాముడు జటాయువుకు అంత్యక్రియలు సలిపి, తిరిగి సీత నన్వేషించుచూ లక్ష్మణునితో అరణ్యమంతయూ వెదకెను. దుఃఖములో నున్న శ్రీరాముని కొంతవరకు లక్ష్మణుడు సముదాయించెను. సీతా వియోగ దుఃఖము శ్రీరాముడు భరించలేకుండెను. విచారములో నున్న శ్రీరాముడు లక్ష్మణునితో యిట్లు పలికెను. ''లక్ష్మణా! స్త్రీపై అనురాగము పెంచుకున్న పురుషుని స్థితి యీ విధముగా నుండును. సీత లేని వెలితి దుర్భరముగా నున్నది''.

రామలక్ష్మణులు సీతకై అన్వేషించుచుండిరి. ఇంతలో కబంధుడనే రాక్షసుడు, తన విశాలమైన బాహువులతో వారిని పట్టుకొన జూచెను. కాని చివరకు వారిచేత మరణించెను. ఆ తర్వాత వారు ఋష్యమూక పర్వతము చేరి, అచ్చట వానరరాజు సుగ్రీవునితో చెలిమి చేసుకొనిరి. సుగ్రీవుని సోదరుడైన వాలిని జంపి సుగ్రీవుని పట్టాభిషిక్తుని జేసిన తర్వాత, సుగ్రీవుడు అతని వానర సైన్యమును తోడ్కొని, రామలక్ష్మణులు దక్షిణ సముద్రతీరము చేరిరి. సాగర రాజు తనకు త్రోవను యివ్వగలడని మూడు రాత్రులు శ్రీరాముడు వేచి చూచెను. సముద్రము దాటి లంకలో ప్రవేశించుటకు సాగరరాజు వీలు కల్పించకుండుటచే, శ్రీరాముడు ఆగ్రహము చెందెను. సముద్రమును దగ్ధము గావించెదనని రాముడు బెదరించెను. అప్పుడు సాగరరాజు వచ్చి క్షమించమని ప్రార్థించెను. శ్రీరామునితో అతడిట్లనెను. ''ఉత్తమ దైవమైన నీవు నాపై ఆగ్రహించితివి. నా అజ్ఞానమునకు క్షమించి మన్నించవలెను. నాపై యీ వానరులచేత సేతువును నిర్మించుము. అది తేలునట్లు చేయగలనని

మాట యిచ్చుచున్నాను''. వానరులు సేతువు నిర్మించగా, వారితో కలిసి రామలక్ష్మణులు లంకలో ప్రవేశించిరి. ఇంతకు పూర్వము సీతను వెదకుటకై వచ్చిన హనుమంతుడు లంకను దగ్ధము గావించెను. ఏనుగుల గుంపు పద్మములతో నిండిన సరస్సును చెల్లాచెదరు గావించునట్లు, వానర సైన్యము అందమైన లంకలోని అసంఖ్యాకమైన పూల తోటలను, భవనములను, కోశములను, పక్షుల గూళ్ళను, ఆటస్థలములను చిందర వందర జేయుచుండెను.

తన నగరములో వానర సైన్యము ప్రవేశించి భీభత్సము కల్గించినందుకు శ్రీరామునిపై రావణుడు మండిపడెను. శత్రువులతో పోరుటకు కుంభ, నికుంభ, ధూమ్రాక్ష, దుర్ముఖ, సురాంతక, నరాంతకులను రావణుడు పంపెను. ఆ తర్వాత రావణుని కుమారుడు సర్వసేనాని యైన ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, అతికాయుడు, అకంపనుడు, సోదరుడు కుంభకర్ణుడు, వారిపై యుద్ధమునకు వచ్చిరి. వారందరూ రామలక్ష్మణులచే హతులైరి. సుగ్రీవుడు, హనుమంతుడు, నీలుడు, అంగదుడు, జాంబవంతుడు, యితర వానర ప్రముఖులు రామలక్ష్మణులకు సహాయపడిరి. చివరకు శ్రీరాముని చంపుటకు రావణుడు రణరంగములో ప్రవేశించెను. రామరావణ యుద్ధమును స్వర్గవాసులు తిలకించుచుండిరి. రావణుడు తన రథము నెక్కి రణరంగమున ప్రవేశించినపుడు స్వర్గాధిపతి ఇంద్రుడు తన రథమును మాతాలి సారధ్యములో శ్రీరామునకు పంపెను.

మరపురాని రామరావణ యుద్ధములో చివరకు శ్రీరాముడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచేత రావణుడు హతుడయ్యెను.

విభీషణుడు, సోదరుడైన రావణునకు, మరణించిన యితర బంధువులకు అంత్యక్రియలు జరిపెను. శ్రీరాముడు విభీషణునకు పట్టము గట్టి, కల్పాంతము వరకు సుఖముగా జీవించునట్లు వరము ప్రసాదించెను. ఆ తర్వాత శ్రీరాముడు సీతను తీసుకుని, లక్ష్మణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, విభీషణుడు అనుసరించగా లంకా పట్టణము వదలి వెళ్ళెను.

శ్రీరాముడు సీతాసమేతముగా అయోధ్యకు యేతెంచెను. వారి రాకకై భరతుడు వేచి చూచుచుండెను. భరతుడు కూడ, అరణ్యములో శ్రీరాముని వలె, పట్టు వస్త్రములు ధరించక నార వస్త్రములు ధరించి సాధు వేషములో నుండుచు వచ్చెను. అన్నగారివలె తాను కూడ నేలపై పవ్వళించుచుండెను. భరతుని తల జడలు కట్టి యుండెను. అయోధ్యా నగరము పొలిమేరలలో నున్న నంది గ్రామములో నివసించుచు, శ్రీరాముని ప్రతినిధిగా అయోధ్యను పాలించుచుండెను. సింహాసనముపై శ్రీరాముని పాదుకలను అతనికి చిహ్నముగా నుంచెను.

శ్రీరాముడు తిరిగి వచ్చుచున్నాడన్న వార్త విని భరతుడు, పాదుకలను శిరస్సుపై ధరించి, నంది గ్రామము విడిచి త్వరగా వెళ్ళి రామ లక్ష్మణులను కలుసుకొనెను. పాదుకలను క్రిందపెట్టి, అశ్రువులు నిండిన నేత్రములతో రాముని పాదములకు నమస్కరించెను. శ్రీరాముని తిరిగి అయోధ్యకు ఆహ్వానించుచూ వైదిక బ్రాహ్మణులు వేద మంత్రములను పఠించుచుండగా, రాముడు భరతుని కౌగిలించుకొనెను.

శ్రీరాముడు, సోదరులతో, నగర పౌరులు వెంటరాగా అయోధ్యలో ప్రవేశించెను. నగర మంతయు ఆనంద కోలాహలముతో నిండియుండెను. శ్రీరాముడు అభ్యంగనము చేసి, పట్టాభిషిక్తుడయ్యెను.

అనేక యాగములు జరిపి, రాజ్యమును సమర్థముగా పాలించెను.

ఒకసారి ఒక పౌరుడు శ్రీరాముని భార్య గురించి చులకనగా మాట్లాడుట వినియుండెను. ఆ పౌరుడు రాము ననహ్యించుకుని యిట్లనెను. "మరొకరి గృహములో నుండిన భార్యను తన యింటికి తిరిగి రానివ్వరాదు. భార్య యందు మోహము కలిగిన రాముడు సీతను రానిచ్చెను. నేనయితే అట్లు చేసెడి వాడను కాను". ఇది విన్న రాముడు భార్యను వదలివేయుటకు నిశ్చయించుకొనెను. శ్రీరాముడు తన పౌరులకు ప్రీతి గలుగునట్లు వర్తించుటయే మహారాజుగా తన ప్రథమ కర్తవ్యమని యెంచెను. అప్పుడు సీత గర్భవతిగా నుండెను. ఆమె వాల్మీకి ఆశ్రమము చేరి, అచ్చట యిద్దరు పుత్రులను ప్రసవించెను. వారు కుశలవులు.

పుత్రులను వాల్మీకి సంరక్షణలో వదలి, ఆమె భూమి యందు ప్రవేశించెను. ఇది విని శ్రీరాముడు దుఃఖములో మునిగెను. పాలకుడుగా తనవియైన ప్రత్యేక భావములు ఉండకూడదని అతడు నిశ్వసించెను. అతడు పదునొకండు వేల సంవత్సరములు యీ భూమిపై పరిపాలించి, తిరిగి నిజ స్థానమైన వైకుంఠము ప్రవేశించెను.

113 చంద్రవంశము

నారాయణుని నాభి నుండి సృష్టికర్త బ్రహ్మ ఉద్భవించెను. బ్రహ్మ కుమారుడు అత్రి మహర్షి. ఒకసారి అత్రి మహర్షి ఆనంద బాష్పములు రాల్చగా, ఆ బాష్పముల నుండి ఒక పుత్రుడు జన్మించెను. అతని పేరు సోముడు. అతడు అమృత పుత్రుడు. సృష్టికర్త బ్రహ్మ సోముని ఓషధులకు, నక్షత్రములకు అధిపతిగా నియమించెను. ముల్లోకములను జయించి సోముడు రాజసూయ యాగము చేసెను. అతడు అత్యంత సుందరముగను ఆకర్షణీయముగను ఉండుటచే అతనిని చూచిన వారందరూ ప్రేమించుచుండిరి.

కొంత కాలమునకు అతనిలో గర్వము, అహంభావము పెరిగెను. పర్యవసానముగా అతని ధర్మపరాయణత క్షీణించ దొడగెను. దేవతల గురువైన బృహస్పతికి తార యను అందమైన భార్య కలదు. సోముడు ఆమెను బలవంతముగా తీసుకుపోయెను. అతడు అతి సుందరముగా ఆకర్షణీయముగా నుండుటచే తార అతని ప్రేమను వారించకుండెను. బృహస్పతికి భార్యపై విపరీతమైన మక్కువ. తన భార్యను యిచ్చివేయుమని బృహస్పతి పదే పదే అడిగినప్పటికి, సోముడు నిరాకరించెను.

దీని కారణముగా స్వర్గములో యుద్ధము మొదలయ్యెను. మొదటి నుండి బృహస్పతిపై సద్భావము లేని అసుర గురువు శుక్రాచార్యుడు, యిదే అదను అని తలచి సోముని పక్షము వహించెను. అతనితోబాటు అసురులందరూ సోముని పక్షము వహించిరి. మహాదేవుడు, అంగిరసుని పుత్రుడైన బృహస్పతి పక్షము వహించెను. మహాదేవునికి అంగిరసునిపై చాల గౌరవము కలదు. అంగిరసుని తన గురువుగా పరిగణించెడివాడు. దీనికొక కారణము గలదు. దక్షుడు యజ్ఞము చేయుచున్నపుడు, దక్షుని కుమార్తె మహాదేవుని భార్య అయిన సతీదేవి శరీరమును విడనాడినపుడు, మహాదేవుడు తనను తాను మరచేటంత దుఃఖములో మునిగి యుండెను. అప్పుడు నారాయణుడు మహాదేవుని సముదాయించి, అతని సహజ స్వభావము గుర్తుచేయుటకు అంగిరసుని పంపెను. అంగిరసుడు ఆ విధముగా జేసి దుఃఖములో మునిగిన మహాదేవుని రక్షించినందులకు, అతనిపై మహాదేవునకు విశేషమైన గౌరవము కలదు.

ఇంద్రుడు, యితర దేవతలు తమ గురువైన బృహస్పతి పక్షము వహించిరి. యుద్ధము తీవ్రముగా సాగుచుండెను. ఇరుపక్షముల వారు, సోముని అహంభావము కారణముగా, నశింపనున్నట్లు గోచరించెను. ఇది చూసి బ్రహ్మ జోక్యము చేసుకొనుటకు నిశ్చయించెను. మనుమడైన సోముని వద్దకు వెళ్ళి తీవ్రముగా మందలించి, తారను తీసుకువచ్చి బృహస్పతికి అప్పజెప్పెను.

ఆమె గర్భవతిగా నుండుట బృహస్పతి కనుగొనెను. అతని కామెపై విశేషమైన ప్రేమ యుండుటచే, ఆమె తప్పిదమునకు ఆగ్రహించకుండెను. అతడామెతో నిట్లనెను. ''నీ గర్భములో శిశువు పెరుగుచున్నాడు. ఎవరి శిశువో నాకు తెలియదు. నీ గర్భము నుండి శిశువును ప్రసరింపుము. నేను అప్పుడు తండ్రి నగుదును. నీవు స్త్రీ వగుటచేత నిన్ను శపించను. భయపడకుము''. శిశువు జన్మించెను. పుట్టిన మగ శిశువు చాల అందముగా నుండెను. బృహస్పతికి ఆ శిశువుపై అనురాగ మెక్కువయ్యెను. సోమునకు కూడ ఆ శిశువుపై అనురాగ ముండెను. సోముడు, తన శిశువని బృహస్పతితో వాగ్వాదము పెట్టుకొని శిశువును తన కిమ్మని కోరెను. దేవతలు, ఋషులు తారను ప్రశ్నించిరి. కాని సిగ్గు అవమానము ముంచుకురాగా, ఆమె బదులు చెప్పకుండెను. కొత్తగా పుట్టిన శిశువు మాట్లాడ మొదలుపెట్టి యిట్లనెను. ''నీవు యేల బదులు చెప్పవు? నీ భర్త యెడల అవిధేయతతో ప్రవర్తించితివి. నా గురించిన సత్యమును అతడు తెలుసుకొనదలచినపుడు నీవు మాట్లాడకుంటివి. నేనెవరో చెప్పుము''. ఆమెను ప్రక్కకు తీసుకువెళ్ళి రహస్యముగా ఆమె నుండి సత్యము తెలుసుకొనుటకు బ్రహ్మ ప్రయత్నించెను. ఆమెను పదే పదే అడుగగా, చివరకు నెమ్మదిగా తడబడుతూ, సోముడు (చంద్రుడు) శిశువు తండ్రియని చెప్పెను. ఆ శిశువును చంద్రుడు తీసుకువెళ్ళెను. కొత్తగా పుట్టిన శిశువు సత్యమును తెలుసుకొన గోరినందులకు బ్రహ్మ అతని ధర్మ పరత్వమున కచ్చెరువందెను. ఆ శిశువు మహాజ్ఞాని యని యెంచి బ్రహ్మ ఆ శిశువుకు 'బుధు'డని నామకరణము గావించెను. బుధుడనగా తెలుసుకొనువాడు లేక జ్ఞానవంతుడు.

సూర్య వంశమునకు మూలపురుషుడు, వైవస్వతుని పుత్రుడు అయిన శ్రాద్ధదేవునకు చాల కాలము వరకు సంతానము లేకుండెను. అతడు గురువైన వసిష్ఠుని యజ్ఞము చేసి మైత్రావరుణులను ప్రార్థించవలసినదని కోరెను. అతని భార్య పుత్రికను బడయగోరెను. యజ్ఞము గావించుచున్నపుడు, తన కోరిక ఫలించునట్లు చేయమని ఆమె హోతను కోరెను. ఆమె కోరినట్లుగా హోత యజ్ఞము జరిపించెను. ఆమెకు పుత్రిక జన్మించెను. రాజునకు యిది నిరాశ కలిగించెను. అతడు వసిష్ఠుని యిదెట్లు జరిగెనని ప్రశ్నించెను. వసిష్ఠుడు, మహారాణి కోరికపై హోత మంత్రములను మార్చి, ఆమెకు పుత్రిక జన్మించునట్లు చేసెనని చెప్పెను. ఆమెకు పుట్టిన బిడ్డ పేరు 'ఇళ'. పుట్టిన బిడ్డను బిడ్డడుగా తన తపశ్శక్తిచేత మార్చవచ్చునని, వసిష్ఠుడు రాజునకు తెలిపెను. వసిష్ఠుని తపశ్శక్తిచేత ఆ బాలిక బాలుడుగా మారెను. రాకుమారునికి సుద్యుమ్నుడని పేరు పెట్టిరి.

ఒక పర్యాయము రాకుమారుడు వేటకై ఉత్తర దిక్కుగా వెళ్ళెను. మేరు పర్వత పంక్తులందు ఒక వెదురు వృక్షముల పొదలో సుద్యుమ్నుడు తన అనుయాయులతో ప్రవేశించెను. ప్రవేశించిన వెంటనే అతడు స్త్రీగా మారెను. అతని అనుయాయులకు, గుర్రమునకు కూడ యిట్లే జరిగెను. ఇట్లు జరుగుటకు మహాదేవుని శాపమే కారణము.

ఒకప్పుడు మహాదేవుని పూజించుటకు ఋషులు అరణ్యమునకు వచ్చిరి. మహాదేవుడు ఆ అరణ్యములో వసించుచుండెను. ఎప్పటివలెనే, పార్వతి మహాదేవునితో అరణ్యము నందుండెను. మహాదేవుని చూడవలెనను

ఆశ్రమముతో ముందుగా తెలియబరచకుండ, పార్వతీ పరమేశ్వరులు ఉండు ప్రదేశమున ప్రవేశించిరి. పార్వతి మహాదేవుని ఒడిలో వివస్త్రయై కూర్చుండెను. ఋషులు ప్రవేశించుట చూచి, ఆమె సిగ్గుతో అక్కడ పడియున్న వస్త్రమును కప్పుకుని లేచి వెళ్ళిపోయెను. ఋషులు ఇరకాటపు పరిస్థితిలో పడి, అక్కడ నుండి వారు నర నారాయణుల ఆశ్రమమునకు వెళ్ళిరి.

తన భార్యను సముదాయించుటకు మహాదేవుడు యిట్లు శపించెను. ''ఈ అరణ్యములో ప్రవేశించు వారు స్త్రీలుగా మారెదరు''. ఆ శాపము చేత పురుషులెవరూ ఆ అరణ్యములో ప్రవేశించకుండిరి. వసిష్ఠుడు, రాకుమారునికి సహాయము చేయవలసినదని మహాదేవుని ప్రార్థించెను. అప్పుడు, మహాదేవుడు, ఆ రాకుమారుడు ఒక నెల పురుషుడుగను, తరువాత నెల స్త్రీగను, తిరిగి ఒక నెల పురుషుడుగను యిట్లు తన కుమారునకు రాజ్యము నిచ్చివేసి అడవికి వెళ్ళి తపమాచరించువరకు జీవించగలడని చెప్పెను.

సుద్యుమ్నుడు అరణ్యములో స్త్రీ రూపముతో సంచరించుచున్నపుడు, సోముని పుత్రుడైన బుధుడు ఆమె అందమునకు మెచ్చి ప్రేమలో పడెను. ఆ సమయమున సుద్యుమ్నుడు ఇళగా నుండెను. ఇళా బుధులకు ఒక పుత్రుడు కలిగెను. ఆ కుమారునకు పురూరవుడని పేరు పెట్టిరి. చంద్రవంశములో అతడు మొట్టమొదటి మహారాజు.

114 పురూరవుడు

పురూరవునకు తండ్రి వివేకము, పితామహుడైన సోముని సౌందర్యము సంక్రమించెను. సుద్యుమ్నుడు రాజ్యమును పురూరవునకు అప్పగించి అరణ్యమునకు వెళ్ళగా, పురూరవుడు చక్కగా రాజ్య పరిపాలనము చేయుచుండెను. పురూరవుని కీర్తి నాలుగు దిక్కులను వ్యాపించెను.

ఒకసారి ఇంద్రుని సభలో నారదుడు, పురూరవుని సౌందర్యమును, ఔదార్యమును, ధర్మపరాయణతను కొనియాడెను. రాజులకు ఉండవలసిన గొప్ప సద్గుణము లన్నియూ పురూరవునిలో కలవని పలికెను. నారదుడు పురూరవుని గుణములను శ్లాఘించగా, నాట్యసుందరి ఊర్వశి నారదుని మాటలను విని పురూరవునిపై మమత పెంచుకొనెను. పురూరవునిపై ప్రేమతో భూలోకమునకు వచ్చెను. ఆమె పురూరవుని వద్దకు వెళ్ళి అతని సౌందర్యమునకు దిగ్భ్రాంతి చెందెను. పురూరవుడు ఊర్వశి సౌందర్యమును గ్రోలుచుండెను. అతి సరళముగా అతడామెతో యిట్లనెను. ''దయచేసి కూర్చొని, నీకు సంతోషము చేకూర్చుటకు నేనేమి చేయవలెనో చెప్పుము''. ఆమె మౌనముగా నిలిచి యుండెను. ఆమె నేత్రములు యెన్నో విషయములు తెలుపుచున్నట్లుండెను. ఆమె రాజుపై బరపిన దరహాసముతో కూడిన దృక్కులను చూచి, తనపై ఆమెకు అపేక్ష కలదని పురూరవుడు భావించి యిట్లనెను. ''నీ అందమునకు నేను ముగ్ధుడనైతిని నీవు నా భార్యవు కాగలవా?''

ఊర్వశి యిట్లు జవాబిచ్చెను. ''నీవంటి అపురూప సౌందర్యవంతుడు నా యెదుట నిలిచి నన్ను భార్యగా స్వీకరించ దలచినచో, నేను కాదనగలనా? ఈ భూలోకములోగాని, స్వర్గలోకములోగాని నీ సౌందర్యమునకు ముగ్ధులుగాని స్త్రీలు ఉండరని నా అభిప్రాయము. నా మనస్సు, నేత్రములు నీ పరమైనవి. నా హృదయము ప్రేమతో ఉప్పొంగగా నీకడకు వచ్చితిని. కాని నన్ను భార్యగా పొందుటకు నీవు రెండు షరతులను పాటించవలసి

యున్నది''.

రాజు యిట్లనెను. ''ఆజ్ఞాపించు, ప్రేమ సుందరీ! నీవు యేది చెప్పిననూ చేయుటకు సిద్ధముగా నున్నాను''. ఆమె యిట్లనెను. ''ఇవి నా పెంపుడు మేకలు. వాటిని రక్షింపవలెను. వాటికి యెటువంటి హానియు కలుగదని నీవు మాట యివ్వవలెను. రెండవ నిబంధన: సంగమించునపుడు తప్ప నిన్ను వివస్త్రునిగా నేనెన్నడూ నిన్ను చూడకూడదు. నేను నెయ్యి తప్ప యింకేదియు భుజించను''.

రాజు ఆమె నిబంధలన్నిటినీ అంగీకరించెను. వారు భార్యాభర్తలైరి. చాల కాలము వారు యీ భూలోకము నందు, స్వర్గలోకమునందు, వనములందు సంచరించి ఆనందముగా కాలము గడుపుచుండిరి. కుబేరుని చైత్ర వనములో వారు తరచు కాలము గడపుచుండెడివారు.

ఊర్వశి లేని స్వర్గము నిర్జీవముగా నున్నట్లు ఇంద్రునకు గోచరించెను. ఆమెను తిరిగి స్వర్గమునకు రప్పించుటకు అతడు నిశ్చయించుకొనెను. ఒకరోజు పురూరవుడు ఊర్వశి గాఢముగా నిద్రించు సమయమున, ఇంద్రుడు పంపగా గంధర్వులు వచ్చి మేకలను అపహరించిరి. వాటిని తోలుకుని గంధర్వులు వెళ్ళుచున్నపుడు అవి అరచిన అరుపులకు వారికి తెలివి వచ్చెను. ఊర్వశి మతిచెడిన దానివలె నుండెను. విచారములో నున్న ఊర్వశి పురూరవుని మేల్కొలిపి, అతనిని పరుషముగా నిందించెను. ఆమె అతనితో యిట్లనెను. ''నీవు గొప్ప వీరుడవని తలచి నేను తెలివి తక్కువ దానినైతిని. నా పెంపుడు మేకలను రక్షించగలవని నమ్మినాను. వానిని యిప్పుడు అపహరించినారు. నీలో మగతనమే లేదు. వెలుగు ఉండినప్పుడే నీవు మగతనము ప్రదర్శింతువు. రాత్రి ఆడువారివలె నిద్రపోవుచు బయటకు వెళ్ళుటకు ధైర్యములేని పిరికిపందవు. నా మేకలను రక్షింపలేకపోతివి. నన్ను మోసగించినావు''.

ఆమె పరుష వాక్కులను విన్న రాజు మంచము నుండి ఉరికి, కత్తి తీసుకుని దొంగలను పట్టుకొనుటకు బయటకు వెళ్ళెను. అతని శరీరముపై వస్త్రములు లేవు. అదే సమయములో, ఇంద్రుని మాయోపాయముచేత ఆకాశమున ప్రకాశవంతమైన మెరుపొకటి మెరసెను. గంధర్వులు మేకలను వదలిపెట్టి అదృశ్యమైరి. వివస్త్రుడైన రాజును చూచిన ఊర్వశి కూడా అదృశ్యురాలయ్యెను. తిరిగి వచ్చిన రాజు ఆమె లేకుండుట కనుగొనెను.

ఊర్వశి లేని జీవితము పురూరవునకు దుర్భరముగా నుండెను. భూలోకమంతయు ఆమెను వెదకుచు తిరుగజొచ్చెను. సరస్వతీ నదీ తీరమునకు వెళ్ళగా, అక్కడ ఊర్వశి సఖుల నైదుగురిని అతడు చూచెను. ఆమెకు అతని సందేశ మీ విధముగా నుండెను. ''ప్రియా! నన్ను విడిచి వెళ్ళకుము. నన్ను క్రూరముగా హింసింపకుము. నాతోనే యుండుము. నీ కొరకై యీ విధముగా తిరుగుచుంటిని. ఒకప్పుడు నిన్ను ప్రేమించిన నా యీ శరీరము శిథిలము కానున్నది గ్రద్దలు, తోడేళ్ళు నా శరీరమును తినగలవు''

ఊర్వశి సమాధానము యీ విధముగా నుండెను. ''అబద్ధము లాడకుము. తోడేళ్లు నిన్ను తిని యుండనవసరము లేదు. ఆడువారిని నమ్మరాదని నీవు యింకను గ్రహించలేదా? వారికి దేనిపైననుగాని, యెవరి యందుగాని శాశ్వతమైన ప్రేమ యుండదు. వారి హృదయములు తోడేళ్ళ వంటివి. వారు కరుణారహితులు, క్రూరులు, హృదయము లేని వారు, ఓర్పు లేనివారు, వారి కోర్కెలను తీర్చుకొనుటలో బహు మొండివారు. వారిని నమ్మిన ప్రియుని, భర్తను, సోదరుని, యెవరినైనను, యేదో ఒక నెపము మీద చంపుటకు వెనుకాడరు. అది వేరే విషయము, అదంతయు వదలిపెట్టుము. ఈ సంవత్సరాంతమున నీవు

నన్ను కలుసుకుని ఒక రాత్రి గడపగలవు. అప్పుడు నీకు పుత్రుడు సమకూరును''.

ఆమెను తిరిగి కలుసుకొనబోతున్నానని, ఆమె శిశువుతో నున్నదని, ఆ శిశువు తన సింహాసనమునకు వారసుడగునని తెలుసుకుని ఉత్సాహముతో గంతులు వేసెను. ఆమె చెప్పినట్లుగనే, ఒకరోజు రాత్రి ఆమె పురూరవునితో గడిపెను. ఆమె వెళ్ళిపోవు సమయము రాగానే, అతనికి విచారముగ నుండెను. ఊర్వశి యిట్లు చెప్పెను. ''గంధర్వులను ప్రార్థింపుము. వారు మనలను యేకము గావింతురు''.

పురూరవుడు గంధర్వులను ప్రార్థించెను. అతనికి ఒక అగ్ని పాత్రను యిచ్చి యిట్లు పలికిరి. ''ఈ అగ్ని పాత్రతో మేము చెప్పినట్లు మంత్ర విధులను గావింపుము. నీవు తిరిగి ఊర్వశిని చేరగలవు''.

అతడు చెట్టుక్రింద ఆ పాత్రను పూడ్చి, ఆ రాత్రి అంతయు ఆమెను గురించి ఆలోచించుచుండెను. ఆ రాత్రి స్వప్నములో మూడు వేదములను గాంచెను. ఉదయమున తాను పాత్రను పూడ్చి పెట్టియున్న ప్రదేశమునకు వెళ్ళెను. గంధర్వులు చెప్పినట్లుగా అతడు అరణులను తీసుకుని ఒక దానితో నొకటి రాపిడి చేసెను. అట్లు రాపిడి చేయగా అగ్ని ఉద్భవించెను. అగ్ని మూడు రూపములు ధరించెను. ఈ మూడును మూడు వేదములకు ప్రతినిధులు. అవి: గార్హపత్యము, ఆహవనీయము, దక్షిణాగ్ని.

అగ్ని సాక్షిగా అతడు నారాయణుని పూజించి, తన కోరికను ప్రసాదింపుమని ప్రార్థించెను.

పురూరవుని కోరిక సిద్ధించెను. అతడు గంధర్వుల నివాస స్థలము చేరి ఊర్వశిని తిరిగి పొందెను.

115 పరశురాముడు

పురూరవుని కుటుంబములో గాధియను మహారాజు జన్మించెను. అతని పుత్రిక సత్యవతి. రుచీకుడను బ్రాహ్మణుడు గాధి మహారాజు వద్దకు వచ్చి, సత్యవతిని తనకిచ్చి వివాహము చేయమని కోరెను. రాజు రుచీకునితో నిట్లనెను. ''నీవు నా కుమార్తెను వివాహమాడవలెనన్న, ఒక వెయ్యి అశ్వములను నాకు కానుకగా నియ్యవలెను; ఆ అశ్వములు చంద్రునివలె పాలతెలుపు శరీరము, నల్లని చెవులను కలిగి యుండవలెను. నా కుమార్తెపై నీకు యెనలేని ప్రేమ యున్నచో యీ కన్యాశుల్కమును నీవు యివ్వగలవు. ఈ విధముగా శుల్కము తీసుకొనుట మాకు ఆచారము కాదు. కాని నా పుత్రికపై నీకు యెంతవరకు ప్రేమ ఉన్నదో తెలుసుకొనగోరి యీ శుల్కము నడుగుచున్నాను''. రుచీకుడు సాగరరాజైన వరుణుని కడకేగి తనకు సహాయము చేయవలసినదని ప్రార్థించెను. రుచీకుడు వేయి అశ్వములతో తిరిగి వచ్చి వాటిని గాధిరాజు కొసగి, సత్యవతిని తనకిచ్చి వివాహము చేయుమనెను. గాధిరాజు సంతుష్టుడై, తన కుమార్తెకు తగిన వరుడు లభించెనని తలచి ఆమెను రుచీకునికిచ్చి వివాహము చేసెను.

గాధి రాజునకు పుత్రులు లేకుండిరి. రుచీకునకు కూడ పుత్రుడు కలుగలేదు. గాధి భార్య, సత్యవతి యిద్దరూ తమకు సంతానము కలుగునట్లు సహాయపడవలెనని రుచీకుని కోరగా, అతడందుల కంగీకరించెను.

వారికొరకు, మంత్రములచే పునీతమైన జలమును రెండు మట్టి పాత్రలలో నుంచెను. ఒకటి రాజు భార్య

కొరకు. ఆ పాత్రలోని జలము త్రాగిన స్త్రీకి క్షత్రియ గుణములు కలిగిన పుత్రుడు కలుగునట్లు రుచీకుడు మంత్రించెను. తన భార్య కొరకు రెండవ పాత్రలోని జలమును బ్రాహ్మణ గుణములు కలిగిన పుత్రుడు జన్మించునట్లు మంత్రించెను ఆ రెండు పాత్రలను ఆశ్రమములో నుంచి, రుచీకుడు ప్రాతః స్సంధ్యావందన విధులు నెరవేర్చుటకు నదీ తీరమునకు వెళ్ళెను

ఆ ఇరువురు స్త్రీలు ఆశ్రమములో తన కొరకై యుంచిన రెండు పాత్రలను చూచిరి. గాధి రాజ భార్య, రుచీకుడు తన భార్య యెడల సహజముగా పక్షపాతముతో నుండగలడని అనుమానించెను. సత్యవతి కుద్దేశించిన పాత్ర జలము, తన కుద్దేశించిన దానికన్న మెరుగుగా నుండగలదని తలపోసెను. తన పుత్రుడు, మనుమని కన్న ఉత్తముడుగా నుండవలెనని తలంచెను. అందుచేత ఆమె కుమార్తెతో యీ పాత్రలను తారుమారు చేసినను యెటువంటి హాని జరుగబోదని, రెండును కూడ పుత్రులను ప్రసాదించుటకేయని చెప్పెను. సరళ స్వభావురాలైన సత్యవతి అట్లే కానిమ్మని పలికెను రుచీకుడు తిరిగి వచ్చేలోపల వారా పాత్రలలోని జలమును త్రాగిరి ఆ తర్వాత సత్యవతి తన భర్తతో తల్లి సలహాపై ఆ పాత్రలను తారుమారు చేసినట్లు చెప్పెను తల్లీ కుమార్తెల తెలివితక్కువ తనమునకు అతడు కోపగించెను

''నాతో చెప్పకుండ మీరిద్దరూ యీ విధముగా యెందుకు చేసిరి?'' అని రుచీకుడు పలికెను. ''మీరిద్దరూ పుత్రులు కావలెనని కోరగా ఆమెకు క్షత్రియ గుణములుకల బాలుడు జన్మించునట్లును, నీకు బ్రాహ్మణ గుణములుకల పుత్రుడు జన్మించునట్లును నేను ఆ రెండు పాత్రలలోని జలమును మంత్రించినాను అది యిప్పుడు తారుమారైనది నీకు కలుగబోయే తమ్ముడు సాధు పురుషుడుగను, నీ కుమారుడు వీరుడైన క్షత్రియుడుగను ఉందురు'' ఈ విషయము సత్యవతిని కలవరపరచెను ఆమె భర్త పాదములపైబడి యేదో ఒక విధముగా తిరిగి మార్చుమని కోరెను. రుచీకు డిట్లనెను. ''నేను ఒటి మాత్రము చేయగలను ఒక తరము తర్వాత జరుగునట్లు చేయగలను నీ పుత్రుడు సరళ స్వభావము కలిగియుండును, కాని నీ మనుమడు క్షత్రియ గుణములు కలవాడై యుండును''

సత్యవతికి కుమారుడు పుట్టెను అతని పేరు జమదగ్ని అతడు సాధుత్వము మూర్తీభవించినట్లుండెను తల్లివలె అతి సరళముగా, ఆప్యాయముగా నుండెను సత్యవతి మరణించినపుడు, ఆమె కౌశికి నదిగా రూపొందెను ఆ నది లోకమునంతను పునీతము గావించునదిగా ప్రసిద్ధికెక్కెను

జమదగ్ని రేణుకను వివాహమాడెను వారికి అయిదుగురు పుత్రులు కలిగిరి. వారు — వసుమనుడు, వసువు, వసుషేణుడు, రుమణ్వంతుడు, రాముడు చివరివాడైన రాముడు క్షత్రియ గుణములు కలిగి యుండెను కాని అతడు తరువాత కాలములో క్షత్రియ ద్వేషిగా పేరుగాంచెను అతడు, పాపపూరితమైన హైహయ రాజుల నుండి యీ లోకమును రక్షించుటకు, భగవంతుని అవతారముగా వెలసెనని చెప్పుచుందురు భార్గవ రామునిలో రాజస తామస గుణము లధికముగా నుండెను తనకు గౌరవము చూపక అవమానించిన వారిని, అదెంత స్వల్పమైనను, తీవ్రముగా శిక్షించుచుండెను సహజముగా అతడు క్షత్రియుడు కాని పుట్టుకచే బ్రాహ్మణుడగుటచేత, బ్రాహ్మణులను గౌరవించని క్షత్రియులను శిక్షించుచుండెను

116 కార్తవీర్యుడు

హైహయ దేశము రాజు కార్తవీర్యార్జునుడు. అతడు నారాయణుని అంశమైన దత్తాత్రేయుని కొలిచెను. అతనికి వేయి బాహువులు. అతని నెవరూ జయింపలేకుండిరి. అతడు చాల శక్తిమంతుడు. లోకములో మిక్కిలి బలపరాక్రమములు కలవాడని ప్రసిద్ధిగాంచెను. ఈ గుణములు అతనిలో అహంభావమును పెంచెను. ఒకసారి అతడు నర్మదా నదిలో భార్యలతోగూడి స్నానము చేయుచుండెను. అతడు తన వేయి బాహువుల శక్తితో నదీ ప్రవాహము నరికట్టి స్తంభింపజేసెను. నదికి అవతలిగట్టున రావణుడు గుడారములో నుండగా నదీజలము చేత ఆ గుడారము తడిసెను. దీనికి కారణభూతుడు హైహయ రాజైన కార్తవీర్యార్జునుడని తెలుసుకొని, రావణుడు సహింపలేకపోయెను. రావణుడు కార్తవీర్యార్జుని సమీపించి అతడి నవమానించుటకు ప్రయత్నించెను. కాని కార్తవీర్యార్జునుడు రావణుని తన భార్యల సమక్షములో పట్టుకుని నవ్వులపాలు జేసెను. రావణుని బందీగా చేసి మాహిష్మతీ నగరములో కొంతకాలముంచి, తీవ్రముగా అవమానించిన పిదప విడిచిపుచ్చెను.

ఒకసారి కార్తవీర్యుడు అరణ్యములో వేటాడుచు సంచరించుచుండెను. అట్లు సంచరించుచున్న కార్తవీర్యుడు కాకతాళీయముగా జమదగ్ని ఆశ్రమము ప్రవేశించెను. తన ఆశ్రమమందున్న గోవు కామధేనువు సహాయముతో కార్తవీర్యార్జునుని అతని పరివారమును జమదగ్ని ఆదరించి వారిని సంతుష్టిపరచెను. కామధేనువు శక్తిసంపదలకు కార్తవీర్యుడు ముగ్ధుడయ్యెను. అటువంటి కామధేనువును పొందిన జమదగ్నిపై అసూయ కలిగెను. అతడు ఆశ్రమము విడిచి వెళ్ళునపుడు తన పరిచారకులను కామధేనువును దొంగిలించి నగరమునకు తరలించుకు రమ్మని చెప్పెను. అతని ఆజ్ఞను శిరసావహించి, దీనముగా అంబాయని అరచుచున్న కామధేనువును మాహిష్మతి నగరమునకు తరలించుకు పోయిరి. ఇంతలో ఆశ్రమమునకు తిరిగి వచ్చిన భార్గవరాముడు కామధేనువును అపహరించిన విషయము తెలుసుకొనెను. కర్ర దెబ్బతిన్న త్రాచుప్రాము వలె బుస్సుమని యెగసెను. అతడు తన గండ్రగొడ్డలిని, విల్లు, అమ్ములను తీసుకుని మాహిష్మతి నగరమువైపు వెళ్ళెను.

నగరము సమీపించుచున్న కార్తవీర్యుడు, భార్గవరాముడు తనను వెంబడించుట జూచెను. ఇదివరలో అతడు భార్గవరాముని చూచియుండలేదు. లేడి చర్మము ధరించిన బ్రాహ్మణునివలె భార్గవరాముడు ప్రకాశించుచుండెను. అంతవరకు మాత్రమే బ్రాహ్మణుని పోలికలు. కాని యీ బ్రాహ్మణుడు విల్లు, అమ్ములు ధరించి యుండెను. పైగా భుజముపై గండ్రగొడ్డలి కలదు. ప్రళయకాలమందు ప్రకాశించు తీక్షణమైన సూర్యునివలె నుండెను. తనతో యుద్ధము చేయుటకు భార్గవరాముడు వచ్చెనని కార్తవీర్యుడు తలచి, పదిహేడు అక్షౌహిణుల సైన్యమును పంపెను.

ఏకాకిగా కార్తవీర్యార్జుని సైన్యమును భార్గవరాముడు హతము గావించెను. సైన్యమంతయు నాశనమగుట జూచి, కార్తవీర్యుడు రణరంగములో ప్రవేశించెను. అతని అయిదువందల బాహువులలో అయిదువందల ధనుస్సులుండెను. మిగిలిన అయిదువందల బాహువులు అమ్ములను ధనుస్సుల నుండి విడిచి పెట్టుచుండెను. కాని భార్గవరాముడు ఆ బాణములను త్రుంచివేసెను. అంతట కార్తవీర్యుడు రాళ్ళను వృక్షములను విసరగా, అతని బాహువులను తన గండ్రగొడ్డలితో నరికివేసెను. ఒక క్షణము తర్వాత కార్తవీర్యుని శిరస్సును నరికివేసెను. కార్తవీర్యుని పదివేలమంది పుత్రులు తమ తండ్రి మరణమునకు దిగ్భ్రాంతులై భయముతో ఆ ప్రదేశము విడిచి పారిపోయిరి.

భార్గవరాముడు కామధేనువును దూడను తీసుకుని ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. జమదగ్ని యుద్ధ విశేషములను, కార్తవీర్యుని మరణమును విని యుండెను. కొంతసేపు మౌనము వహించి తర్వాత యిట్లనెను. వత్సా, రామా! క్షత్రియుని చంపుట మహాపాపము. నీ కోపమే నీ లోపము. క్షమ వహించి యుండవలెను. ఈ క్షమాగుణము వలననే బ్రాహ్మణులను యితరులు గౌరవింతురు. క్షమాగుణము వలన వారి ముఖములు తేజోవంతములై యుంటున్నవి. బ్రాహ్మణులు భగవంతునికి ప్రీతిపాత్రులగుటకు వారి ఓర్పు కారణము. కార్తవీర్యుడు ఉత్తమ క్షత్రియుడు. అతడు నీచే హతుడైనాడు. ఈ పాపము బ్రహ్మ హత్యా పాపముకన్న గొప్పది. పుణ్యనదీ తీరములను సందర్శించుటవలన యీ పాపము పరిహారము కాగలదు. ఒక సంవత్సర కాలము తీర్థములన్నిటినీ సందర్శించి తిరిగి రమ్ము''. ''అట్లే చేయుదును'' అని భార్గవరాముడు పలికి పుణ్య నదీ తీర్థములను సందర్శించుటకు వెడలెను.

సంవత్సరము తర్వాత భార్గవరాముడు పుణ్య తీర్థయాత్రలు ముగించుకుని తిరిగి వచ్చెను. అతని రాకకు తల్లిదండ్రులెంతో సంతోషించిరి. ఒకసారి జమదగ్ని భార్య రేణుక, మంచినీరు కొనితెచ్చుటకు ప్రతిదినము వలె ఆ దినము కూడ నదీతీరమునకు వెళ్ళెను. అచట చిత్రసేనుడను గంధర్వుడు అప్సరసలతో కూడి జలక్రీడ సల్పుచుండెను. రేణుక ఆ గంధర్వుని చూచి తనలో యిట్లు తలపోసెను. ''ఆహా! ఎంతటి సౌందర్యవంతు డితడు''. ఆరోజు ఆమె ప్రతిదినముకన్న మరికొంతకాలము నది ఒడ్డున గడపెను. ఆమె తిరిగి ఆశ్రమమునకు వచ్చుసరికి హోమమొనర్చు సమయము దాటెను. ఆలస్యముగా వచ్చినందుకు తన భర్త ఆగ్రహించగలడని, సంకోచముతో ఆమె ఆశ్రమములో ప్రవేశించెను. మంచినీటి పాత్రను అతని పాదముల వద్ద నుంచి ఆమె చేతులు జోడించి నిలుచుండెను. జమదగ్ని మహర్షి తన జ్ఞాన నేత్రముతో ఆమె ఆలస్యమునకు కారణము గ్రహించెను. కొద్ది నిముషములే అయినప్పటికీ, ఆమెకు మానసికముగా పాపపు తలంపులు కల్గినందుకు జమదగ్ని ఆగ్రహించెను. ఒక పరపురుషుడు తన భర్తకన్న సౌందర్యవంతుడనే ఆలోచన కలుగుట పాపము. అతడు తన పుత్రులను పిలిచి వారితో యిట్లనెను. ''ఈమె పాపము చేసినది. తక్షణమే ఆమెను సంహరింపుడు''. పుత్రులు సంకోచించిరి. ఆగ్రహముతో ఆజ్ఞాపించిన తండ్రి మాటలను విని, తమ తల్లిని సంహరించుటకు వారు సంకోచించిరి. అపుడు జమదగ్ని తన కనిష్ఠ పుత్రుడైన భార్గవరాముని పిలిచి, ''నీ తల్లిని, సోదరులను సంహరింపుము. ఇది నా ఆజ్ఞ'' అని పలికెను. అతడు ఒక క్షణమైనను సంకోచింపక, తండ్రి ఆజ్ఞ మేరకు తల్లిని సోదరులను సంహరించెను. జమదగ్ని సంతోషించి భార్గవరాముని మెచ్చుకొని యిట్లనెను. ''కుమారా! నా ఆజ్ఞను నీవు తక్షణమే నెరవేర్చినందుకు నిన్ను మెచ్చుకొనుచున్నాను. నీవు యేదైన వరము నడుగుము. నేను నీకు ప్రసాదించెదను''.

భార్గవ (పరశు) రాముడు తండ్రి పాదములపైబడి యిట్లనెను. ''తండ్రీ! నా తల్లి సోదరులు తిరిగి సజీవులు కావలెనని నా కోరిక. అంతేకాక, వారికి జరిగిన విషయము స్మృతి యందుండ కూడదు''. తండ్రి జమదగ్నికి భార్యపై, యితర పుత్రులపై కలిగిన ఆగ్రహము అదృశ్యమయ్యెను. అతని చివరి కుమారుడు కోరిన వరమును ఆనందముతో ప్రసాదించెను. వారు నిద్ర నుండి లేచినట్లు లేచిరి. జరిగిన దేమియు వారికి తెలియకుండెను.

ఇట్లుండగా, తమ తండ్రిని సంహరించిన పరశురామునిపై కార్తవీర్యార్జునుని పుత్రులు ద్వేషము పెంచుకొను చుండిరి. ఒకసారి పరశురాముడు తన సోదరులతో అడవికి వెళ్ళినపుడు, కార్తవీర్యుని కుమారులు జమదగ్ని ఆశ్రమమునకు వచ్చిరి. ముసలివారైన రేణుకా జమదగ్నులు మాత్రమే యింట నుండుట గమనించి, వారు యిదే తగిన సమయమని తలపోసిరి. జమదగ్ని అగ్నిహోత్రము ముందు కూర్చుని యుండగా, రేణుక

భర్తకు సహాయపడుచుండెను. కార్తవీర్యుని కుమారులు కత్తులు దూసి వేగముగా జమదగ్నిని సమీపించిరి. వారేమి చేయనున్నారో రేణుక గ్రహించెను. ఆమె, తన భర్తను సంహారింపవలదని కార్తవీర్యుని కుమారులను వేడుకొనెను. కాని వారు వినకుండిరి. భగవంతుని ధ్యానించుచున్న జమదగ్ని తలను వారు నరికివేసిరి. వారు తలచిన కార్యము సమాప్తి అయిన తక్షణమే అక్కడ నుండి వారు పారిపోయిరి.

రేణుక ''రామా! రామా!'' యని గట్టిగా అరచెను. ఆమె ఆర్తనాదము దూరము నుండి వినిన పరశురాముడు పరుగుపరుగున ఆశ్రమమునకు తిరిగి వచ్చి జరిగిన ఘోరమును కనులార చూచెను. మరణించిన తండ్రినొక సారి వీక్షించెను. సర్వస్వము తన సోదరులకు వదలిపెట్టి, గండ్రగొడ్డలిని చేతబట్టుకుని వడివడిగా ఆశ్రమము నుండి వెళ్ళెను. ఆ క్షణములో అతడు క్షత్రియులనందరినీ సంహరింప నిశ్చయించుకొనెను. అతడు మెరపు వేగముతో మాహిష్మతీ నగరము చేరెను. కార్తవీర్యుని పుత్రుల నందరినీ అతి సులభముగా సంహారించెను. పరశురాముని ప్రతీకార తీక్షణతకు వారేమియు చేయలేక నిస్సహాయులైరి. వారి తలలను నరికివేసి వాటిని గుట్టగా ప్రోగుచేసెను. నగరమంతయు ధ్వంసమై రక్తము కాలువలు కట్టి ప్రవహించెను.

పరశురాముని ఆగ్రహము ఉపశమించలేదు. అతడు లోకమంతయు సంచరించెను. క్షత్రియులను సంహరించుటయే అతని ధ్యేయము. లోకమంతయు యిరువది యొక్క పర్యాయములు సంచరించి, క్షత్రియుల నందరినీ సంహారించి, వారి రక్తముతో అయిదు సరస్సులు నిండునట్లు చేసెను. ఆ అయిదు సరస్సులు శమంత పంచకమను పేరు పొందెను. శమంత పంచకము వద్ద తన తండ్రికి అంత్యక్రియలు జరిపెను. పరశురాముడొక్కడే తన తండ్రికి జలమునకు బదులుగా రక్తముతో తర్పణము వదలి అంత్యక్రియలు జరిపెను.

అనేక క్షత్రియులను సంహరించిన పాపమును కడిగి వేసుకొనుటకు పరశురాముడు యజ్ఞములు జరిపెను. పాపభూయిష్ఠులైన హైహయ రాజుల నుండి లోకమును రక్షించుటకు భగవంతుడు పరశురాముడుగా అవతరించెనని చెప్పుదురు. తరువాత మన్వంతరములో సప్తర్షులలో పరశురాము డొకడని చెప్పుదురు.

117 కౌశికునకు వసిష్ఠుని ఆతిథ్యము

పురూరవునకు ఆరుగురు పుత్రులు, వారిలో జ్యేష్ఠుడు ఆయువు. అతని వారసులలో నహుషుడు, అతని పుత్రుడు యయాతి, తర్వాత పూరు చక్రవర్తి. ఈ వంశము వారందరు పౌరవులుగా ప్రసిద్ధికెక్కిరి.

పురూరవుని కనిష్ఠపుత్రుడు విజయుడు. విజయుని కుమారుడు భీముడు. కాంచనుడు భీముని కుమారుడు. కాంచనుని కుమారుడు జహ్నువు. గంగానది భగీరథుని వెంట వెళ్ళుచున్నపుడు, జహ్నువు గంగానదిని త్రాగివేసెను. జహ్నువు కుమారుడు పురు. బలుకుడు పురుని పుత్రుడు. బలకుని పుత్రుడు అజకుడు. కుశుడు అజకుని కుమారుడు. కుశునకు నలుగురు కుమారులు, వీరిలో కనిష్ఠుడు కుశనాభుడు. సత్యవతి తండ్రియైన గాధి, కుశనాభుని పుత్రుడు. గాధి కుమారుడు కౌశికుడు, అతడే విశ్వామిత్రుడుగా ప్రసిద్ధికెక్కెను.

కౌశికుడు పేరుపొందిన మహారాజు. అతడు చక్కగా పరిపాలించెను. అందుచే ఉత్తముడైన రాజుగా ప్రసిద్ధిగాంచెను.

ఒక పర్యాయము పెద్ద బలగముతో అతడు అరణ్యమున కేగెను. అతడు అనేక ప్రదేశములకు వెళ్ళుచుండెను. తన రాజ్యములోని అనేక నగరములను సందర్శించెను. ప్రయాణము చేయునపుడు, అందమైన నదులను, కొండలను, ఆశ్రమములను తిలకించుచుండెను. అట్టి ఆశ్రమములలో బ్రహ్మ పుత్రుడైన వసిష్ఠుని ఆశ్రమ మొకటి గలదు. దూరము నుండి కౌశికుడు ఆశ్రమములోని అందమైన పుష్ప వృక్షములను, పొదలను, లతలను గాంచెను. ఆశ్రమము ప్రక్క నుండి పారుచున్న సెలయేటిని కూడ అతడు చూచెను. లేళ్లు, యితర సాధు జంతువులు సంచరించుట రాజు గమనించెను. అచ్చట సిద్ధులు, చారణులు, గంధర్వులు, కిన్నరులు కూడ సంచరించుట చూచి కౌశికు డాశ్చర్యము చెందెను. అచ్చటి వృక్షములందున్న పక్షుల గూళ్ళ నుండి వచ్చు మధుర సంగీత నినాదములతో ఆశ్రమము ప్రతిధ్వనించుచుండెను. ఆ ఆశ్రమునందే కాక, దాని పరిసరములలో కూడ ప్రశాంతత కానవచ్చుచుండెను. ఆశ్రమము దగ్గరకు సమీపించగా, రాజు అనేకులు ఋషులు తపస్సు చేయుచుండుట జూచెను. ధ్యానములో నున్న ఋషులకు బాహ్య ప్రపంచ జ్ఞానము లేకుండెను. అతడు వినియున్న బ్రహ్మ లోకము స్వర్గమునందుకాక, యీ వసిష్ఠుని ఆశ్రమమునందే యున్నట్లు గోచరించెను.

ఆశ్రమములోని ఋషులను సందర్శించి వారికి నమస్కరించుట ఆనాటి మహారాజుల సంప్రదాయము. ఋషులు కూడ రాజులకు ఆశ్రమములో స్వాగత సత్కారములు జరుపుట ఆచారము. రాజులు నారాయణుని ప్రతినిధులని ఆనాడు భావించెడివారు. కౌశికుడు వసిష్ఠుని ఆశ్రమములో ప్రవేశించి, వసిష్ఠ మహర్షికి సాష్టాంగ ప్రణామములు జేసెను. వసిష్ఠుడు చాల సంతోషించి, ఆనందోత్సాహములతో రాజు నాహ్వానించెను. మహారాజున కుచితమైన ఆసనము దెప్పించి దానిపై అతనిని గూర్చుండబెట్టెను. తర్వాత రాజునకు ఫలములు, మంచినీరు సమర్పించెను. రాజు అత్యంత వినయముతో వాటిని స్వీకరించగా కొద్దిసేపు వారిద్దరు సంభాషించిరి. లోకరీతిలో వసిష్ఠుడు అడుగవలసిన విషయముల నడిగి తెలిసికొనెను. వసిష్ఠు డిట్లనెను. ''మీరు క్షేమమని తలచెదను. మీ ధర్మ పరిపాలనలో పౌరులందరూ సుఖశాంతులతో జీవించుచున్నారని భావించెదను. సేవక పరివారము విధేయులై తమ సేవలను జరుపుచున్నారని తలంతును. శత్రువులందరూ అణగిమణగి యున్నారు కదా? సేనలు బలపరాక్రమ సహితములై యున్నవా? కోశాగారమునకు ధన లోపము లేదుగదా? కుటుంబ ములో అందరూ కుశలమేనా?'' కౌశికుడు అన్ని ప్రశ్నలకు సరియైన సమాధానములు తెలిపి, ఋషిని కుశల ప్రశ్నలు వేసెను. క్రూరమృగముల వలన యెట్టి హాని కలుగకుండ, ఋషుల తపస్సు నిర్విఘ్నముగా సాగుచున్నదా యని యడిగి తెలుసుకొనెను.

వసిష్ఠుడు, కౌశికుడు పరస్పర గౌరవ భావముతో చాలసేపు అనేక విషయములపై ముచ్చటించిరి. అట్లు చాలసేపు వారు యిరువురు సంభాషించిన తర్వాత వసిష్ఠు డిట్లనెను. ''నా ఆతిథ్యము స్వీకరించవలసినదని కోరుతున్నాను. నా ఆశ్రమమునకు సేనా సమేతముగా వచ్చి పావనము గావించుట చాల అరుదు. నీకు విందుచేసి ఆనందము చేకూర్చవలెనని నా అభీష్టము. నీవు సత్పురుషుడవు, ధర్మప్రభుడవు. నిన్ను సత్కరించుట నాకు సంతోషము''.

వసిష్ఠుని ఆదరాభిమానములకు కౌశికుడు మిక్కిలి సంతోషించెను. అత్యంత వినయముతో కౌశికుడిట్లనెను. ''ఆదరపూర్వకమైన పలుకులే నాకు విందు. పాలు ఫలములు యిది వరకే యిచ్చి యున్నావు. నీ దర్శనము చేత యీ జన్మ పరిశుద్ధమైనది. ఇంతకన్నను సంతృప్తి కలిగించున దింకేమి గలదు? నిన్ను దైవముగా మేము గౌరవించవలసియున్నది, నీవు నన్ను గౌరవించి సత్కరించవలెననుట ఉచితముగా లేదు. నేను సెలవు తీసుకుని ప్రయాణము కొనసాగించెదను''. తన బలగమున కంతకూ విందు చేయుట వసిష్ఠునకు యిబ్బంది కల్గించునని

భావించి, నేర్పుగా వెళ్ళవలెనని లేచెను. కాని వసిష్ఠుడు యిందు కంగీకరించకుండెను. తన విందు గౌరవమర్యాదలను కౌశికుడు అతని బలగము స్వీకరించవలసినదని వసిష్ఠుడు పదేపదే కోరెను చివరకు కౌశికుడు వసిష్ఠుని ఆతిధ్యము నంగీకరించి యిట్లనెను. ''ఋషివర్యా! అటులనే కానిండు, మాకు ఆతిధ్య మొసగుటకు మీరు చూపు ఆసక్తి మేము తప్పించుకొనలేని పరిస్థితిని కల్పించినది. ఇది మీ సద్గుణమునకు నిదర్శనము''. వారిరువురూ నవ్వుచు ఆశ్రమము బయటకు వెళ్ళిరి వసిష్ఠుడు, ''సురభీ! శబళీ! వెంటనే ఇక్కడకు రమ్మ'' అని కేకవేసెను.

వసిష్ఠుడు యెవరిని పిలుచుచుండెనా యని కౌశికుడు ఆశ్చర్యముతో చూచుచుండెను. అతడిట్లు ఆలోచించుచుండగనే, అందమైన ఆవు వచ్చి వసిష్ఠుని ముందు నిలబడి యిట్లనెను. ''తండ్రీ! నన్ను పిలిచితిరా?'' అందమైన ఆ ఆవును కౌశికుడు చూచెను ఆ ధేనువు అందమైన ఆకారము, నలుపు తెలుపు కలిసిన మూపు కలిగి యుండెను. ఆ గోవు నేత్రములందు సాధుత్వము ఉట్టిపడుచుండెను. వసిష్ఠుడు గోవుతో యిట్లనెను. ''శబళీ! నా మాటలు వినుము. ఇతడీ దేశమునకు రాజు పేరు కౌశికుడు.
యిక్కడకు విచ్చేసెను. అతనికి అతని బలగమునకు విందుచేసి ఆనందము కల్గించవలెనని తలచితిని. సమస్త పదార్థములతో ఘనముగా విందు యేర్పాటు చేయవలెను. ఎటువంటి లోపము ఉండరాదు. వారు సంతుష్టులై వెళ్ళవలెను. తొందరగా అన్నియు సిద్ధము గావింపుము''.

శబళ కామధేనువు. క్షీరసాగరమును దేవదానవులు అమృతము కొరకు మథించినపుడు ఉద్భవించిన దివ్యధేనువు అది వసిష్ఠునకు లభించెను.

కామధేనువు రాజునకు అతని బలగమునకు పదార్థములను సృష్టించి గొప్ప విందుకు కావలసిన యేర్పాటులు గావించెను అన్ని రకములైన భోజ్యపదార్థములను, పానీయములను అందరకు ప్రీతి కలిగించునట్లుగా సమకూర్చెను. అన్ని పదార్థములు సమృద్ధిగా నుండెను వాటిని అందరకూ ఆదరాభిమానములతో వడ్డించగా, వారందరూ కడుపునిండుగా భుజించి సంతుష్టులైరి. కౌశికుడు అమందానంద భరితుడై, తన మంత్రులు, సేనాపతులతో వసిష్ఠునకు కృతజ్ఞతా పూర్వక నమస్కారము చేసెను తర్వాత కౌశికు డిట్లనెను ''ఋషివర్యా! నా జీవితములో యింతవరకు యిటువంటి రుచికరమైన పదార్థములను భుజింపలేదు. నిన్నొక కోరిక కోరుచున్నాను ఈ కామధేనువు శబళ యొక్క విశేషమైన శక్తిసామర్థ్యములకు నేను ముగ్ధుడనైనాను. ఇటువంటి ధేనువు దేశమును పాలించు రాజు అధీనములో నుండవలెను. ఆమె వలన అందరకూ లాభము చేకూరును ఆ గోవును నాకిమ్ము. అందుకు ప్రతిఫలముగా నీకు నూరువేల గోవుల నిచ్చెదను. ఈ గోవు ఒక మణి వంటిది. విలువైన మణులు రాజునకు చెందినవి. నాకు ఆ గోవు కావలెను. దయచేసి దానిని నాకిమ్ము''.

కౌశికుని మాటలకు వసిష్ఠుడు నిశ్చేష్టుడయ్యెను. తనను తాను సముదాయించుకుని, అతి సరళముగా యిట్లు పలికెను. ''ఎవరేది యడిగినను నేను సాధారణముగా నిరాకరించను కాని శబళ విషయము వేరు నూరువేల గోవులే కాదు, ఒక కోటి గోవులిచ్చినను, శబళను నేను విడనాడలేను. నీవు బంగారు వెండి రాసులను యిచ్చెద నననచ్చు కాని వాటివలన నాకు ప్రయోజనము లేదు నేను శబళను యివ్వజాలను. ఇది తిరుగులేనిది''

కౌశికుడు స్తంభించినట్లు నిలుచుండెను. చెమ్మగిల్లిన కండ్లతో వసిష్ఠుడు మరల యిట్లనెను ''ఓరాజా! శబళ నాదేహములో ఒక భాగము దానిని విడిచి యుండలేను కీర్తికెక్కిన మానవుడు కీర్తిని వదలియుండుట

యెంత దుష్కరమో యిదియూ నట్లే. శబళ ప్రసాదించు దానములచేతనే, నేను వైదిక విధులను నిర్వర్తించగలు గుచున్నాను. అందుచే శబళను నీకు యివ్వజాలను''.

కౌశికుడు వదలిపెట్టలేదు. ''బంగారము పట్టు వస్త్రములతో అలంకరించిన వేయి గజములను నీకు యిచ్చెదను. ఎనిమిదివందల అశ్వములను రథములతో నొసంగెదను. నీవు కోరినట్లయిన, అంతకన్న యెక్కువగా నీకు యివ్వగలను. ఒక కోటి కపిల ధేనువులను నీకిచ్చెదను. ఈ కామధేనువును నాకిమ్ము. నీవు కోరినచో, లెక్కకు మించిన బంగారము, వజ్రవైడూర్యములు నీకిత్తును'' అని పలికెను.

అతి విచారముతో వసిష్ఠుడు స్థిరమైన స్వరముతో నిట్లనెను. ''నా సర్వ సంపద యీ కామధేనువు. ఇది నా సర్వస్వము, నా ప్రాణము. నా తపస్సు అంతయు ఆమెతోనే యున్నది. ఇక యీ విషయముపై చర్చించుట యెందులకు? నేను యీ ధేనువును యెన్నటికీ విడిచి యుండలేను. నీవు నాకు విశేషమైన సంపద నొసంగుట అనవసరము. నీవు యిచ్చు వస్తువుల వలన నాకెట్టి ప్రయోజనమును లేదు. నాకు ఉన్న శబళ చాలును. ఆమె నాది. ఎప్పటికీ ఆమె నాది''.

118 కౌశికుని నిరుత్సాహము

కౌశికుడు సహజముగా క్షత్రియుడగుటచే ఆగ్రహము చెందెను. ఇదివరకెన్నడూ తాను కోరినది లభించకుండుట జరుగలేదు. అతని మనస్సు యిప్పుడు కామధేనువుపై నున్నది. అతడు ఆగ్రహముతో ఆశ్రమము నుండి వెళ్ళెను. అతడు తన సేవకులను బలవంతముగా ఆ గోవును తీసుకువెళ్ళమని ఆజ్ఞాపించెను. గోశాలనుండి కౌశికుని సేవకులు కామధేనువును తరలించుకొని వెళ్ళిరి. కామధేనువు తనలో తానిట్లు తలపోసెను. ''ఉదారుడైన వసిష్ఠుడు నన్నేల వదలివేసెను? నేనేమి తప్పుచేసితినని నాకీ శిక్ష విధించెను? రాజు సేవకులు నన్ను తీసుకుపోవుచుండగా తండ్రి వసిష్ఠుడు యేమియు చేయక ఊరకుండెను''. ఆమె విచారించుచుండగా కనుల నుండి యేకధారగా అశ్రువులు వర్షించుచుండెను. ఆమె నిట్టూర్పులు వినిపించుచుండెను. తిరిగి తనలో నిట్లనుకొనెను. ''నేను తండ్రివద్దకు వెళ్ళి, రాజు సేవకులు నన్నిట్లు యెందు కవమానించునట్లు చేసితివని అడిగెదను''. అకస్మాత్తుగా రాజు సేవకుల నుండి తప్పించుకుని వాయువేగముతో పరుగెత్తెను. వసిష్ఠుని సమీపించి, అతని పాదములపైబడి యిట్లనెను. ''తండ్రీ! నన్నేల నీవు వదలిపెట్టితివి? నీవు చూచుచుండగనే, రాజు సేవకులు నన్ను యీడ్చుకొని వెళ్ళిరి. దీనికి నీవు యేల అంగీకరించితివి?'' వసిష్ఠుడిట్లనెను. ''పుత్రీ! నీ వేమియు తప్పుచేయలేదు. నిన్ను నేను శిక్షించుటలేదు. నేను నిన్నెపుడూ విడిచి పెట్టను. ఈ రాజు అతి శక్తిమంతుడు. బలవంతముగా నిన్ను తీసుకువెళ్ళెను. ఈ అక్షౌహిణీ సైన్యము రాజుకు చెందినది, అందుచే అతని నెవరూ జయింపలేరని తలచుచున్నాడు. అందుచేతనే బలవంతముగా నిన్ను తీసుకురమ్మని తన సేవకుల నాజ్ఞాపించెను''

శబళ యిట్లనెను. ''కాని, ఓ మహర్షీ! ఒక బ్రాహ్మణుని ముందు రాజు శక్తియేపాటిది? క్షత్రియబలముకన్న బ్రహ్మబలము గొప్పది. అన్ని లోకములలో నీ గొప్పదనము సాటిలేనిది. కౌశికుడు గొప్ప క్షత్రియుడు, అతి శక్తిమంతుడు. సందేహములేదు. తండ్రీ! నీ అనుగ్రహ బలము చేత అబలనైన నేను కూడ అతని కన్న

శక్తిమంతురాలనని నిరూపించెదను. అందుల కంగీకరింపుము అతని అహంభావమును, గర్వమును అణచి శిక్షించెదను''. కామధేనువు వగర్చుచూ శ్వాసను విడుచుచుండుట వసిష్ఠుడు గమనించి, చాల కోపముతో నున్నదని గ్రహించెను. శబళ నేత్రములు యెరుపెక్కెను, కోపమును సూచించుచు తోకనెత్తెను వసిష్ఠుడు చిరునవ్వుతో వీపు నిమిరి యిట్లనెను. ''సరే, నీకు నా అంగీకారము తెలుపుచున్నాను. ఒక క్షణములో, రాజు సైన్యము నెదుర్కొనగల్గిన సైన్యము సృష్టింపుము''

శబళ తన శరీరమును కుదిపెను వెంటనే పెద్ద సేనా నివహము ప్రత్యక్షమయ్యెను. వందలకొలది వీరులు ప్రత్యక్షమై కౌశికుని సైన్యముతో పోరాడుటకు సన్నద్ధులైరి. ఒక ధేనువు సృష్టించిన సేన చేతులలో తన సైన్యము ఓడిపోవుట చూచి, కౌశికుడు ఆగ్రహావిష్టుడయ్యెను. అతని నేత్రములు యెరుపెక్కెను అతడు యుద్ధమందు ప్రవేశించి శబళ సృష్టించిన సైన్యముతో పోరాడెను. రాజు ధైర్యసాహసములను, అతడు తాను సృష్టించిన సైన్యమును నాశనము చేయుటను చూచి, శబళ తిరిగి సైన్యమును, సేనాధిపతులను సృష్టించెను సైన్యము తరిగినపుడు, తిరిగి సైన్యమును శబళ సృష్టించుచుండెను కౌశికుని పుత్రులు యుద్ధమందు ప్రవేశించి కౌశికునితోబాటు పోరాటము సలిపి, చివరకు వారు వసిష్ఠుని కూడ యెదుర్కొనిరి వసిష్ఠమహర్షి, తన హుంకారముతో కౌశికుని పుత్రుల నందరినీ దగ్ధము గావించెను కౌశికుని పుత్రులందరూ బూడిదగా మారి గుట్టగా ప్రోగుపడి యుండిరి

రాజు హృదయము బ్రద్దలయ్యెను అతని సేనయంతయూ నాశనమయ్యెను. పుత్రులందరూ మరణించిరి. కోరలు తీసివేసిన సర్పమువలె, రెక్కలు తెగిన పక్షివలె అతడుండెను అతని గర్వము అణగిపోయెను. అస్తమించు సూర్యుని వలె కౌశికుని వదనము వివర్ణమై యుండెను

తలదించుకుని, మౌనముగా కౌశికుడు వసిష్ఠుని ఆశ్రమమువీడి, తన రాజ్యమునకు వెడలెను

119 కౌశికుని తపస్సు

కౌశికుని ఆగ్రహము సమసిపోలేదు వసిష్ఠ ఆశ్రమములో 'కామధేనువు శబళ సృష్టించిన సేనాబలము' చేతిలో తాను, తన కుమారులు, సైన్యము చిత్తుగా ఓడిపోవుట వలన కలిగిన అవమానము కౌశికుని మనస్సును వేధించుచుండెను. అతనికి జీవితముపై విసుగు విరక్తి కలుగగా, మిగిలిన ఒకే ఒక్క కుమారునకు రాజ్యభారము అప్పగించి చూచుకొమ్మనెను. కౌశికుడు అడవికేగి కిన్నరులు వసించు హిమవత్పర్వత పంక్తులలో అనేక సంవత్సరములు గొప్ప తపస్సు చేసెను అతని తపస్సునకు మహాదేవుడు మెచ్చి, ప్రత్యక్షమై యిట్లడిగెను. ''నీవెందుకీ తపస్సు నాచరించుచున్నావు? నీకేమి కావలెను? నీవు కోరిన దానిని నేను ప్రసాదించెదను''

కౌశికుడు మహాదేవునకు సాష్టాంగ ప్రణామము జేసి కీర్తించి, యిట్లుపలికెను. ''ప్రభూ! మీరు నా తపస్సును మెచ్చుకున్నచో నేను విలువిద్యలో ప్రవీణుడనగునట్లు వరమొసంగుడు దివ్యాస్త్రములను ప్రయోగించుటలో ప్రావీణ్యము కలుగునట్లు వరము ప్రసాదింపుడు దయచేసి వీనిని నాకు ప్రసాదించవలెను'' శంకరుడిట్లనెను ''వీనిని నీకు ప్రసాదించుచున్నాను ఇక శాంతముగా జీవింపుము'' కౌశికుడు తిరిగి తన రాజ్యమునకేగెను తన స్వాభిమానము, ఆత్మగౌరవము పునరుద్ధృతమైనట్లు అతడు భావించెను దానితోబాటు మరల గర్వము

అతనిలో చోటు చేసుకొనెను. ఇప్పుడది పదింతలు పెరిగెను. కౌశికుడు తనలో తానిట్లు తలచెను. ''వసిష్ఠుడిక చనిపోయినట్లే! దివ్యాస్త్రముల ధాటికి అతడెట్లు తట్టుకొనగలడు? వసిష్ఠుని నాశనము చేసి కామధేనువును నా రాజ్యమునకు తీసుకు వచ్చెదను''.

కౌశికుడు వసిష్ఠుని ఆశ్రమమునకు వెళ్ళి, ముందుగా హెచ్చరించకుండగనే, దివ్యాస్త్రములను ఒకదాని వెనుక నొకటి ప్రయోగించు చుండెను. ఆశ్రమములోని పక్షులు, పెంపుడు జంతువులు మిక్కిలి భయముతో పరుగెత్తసాగెను. ఆశ్రమములో నివసించుచున్న వసిష్ఠుని శిష్యులు, అకస్మాత్తుగా వచ్చుచున్న అస్త్రముల ధాటికి తట్టుకొనలేక మిక్కిలి భయముతో ఆశ్రమము విడిచి పారిపోయిరి. ఆశ్రమము దాని పరిసరములు నిర్జీవముగా బోసిపోయినట్లుండెను. ఆ ప్రదేశమందలి మట్టి లవణ మిళితమై యెందుకును పనికిరానిదిగా మారెను. ఆశ్రమమునందు నిశ్శబ్దము తాండవించుచుండెను. వసిష్ఠుని ఆగ్రహము ప్రకోపించెను. వసిష్ఠుడు తనలో నిట్లు తలపోసెను. ''నిష్కారణముగా యీ రాజు మరల మరల నన్ను వేధించుచున్నాడు. సూర్యుడు మంచును కరగించునట్లు, నేనీ రాజును సర్వనాశనము గావించెదను''.

వసిష్ఠుడు బయటకువచ్చి కౌశికునితో యిట్లనెను. ''ప్రశాంతమైన యీ ఆశ్రమమును నీవు నాశనము జేసితివి. నీపై నాకు ఆగ్రహము కలుగుచున్నది. నీకు ఉచితానుచితములు కూడ తెలియనట్లు గోచరించుచున్నది. చూడగా, నీవొక మూర్ఖునివలె నున్నావు. నిన్ను సంహరించెదను''.

వసిష్ఠుడు దండమును పైకెత్తెను. అది అగ్నివలె ప్రకాశించుచున్నది. పొగలేకనే, యుగాంతమున దహించునట్లుండెను. మృత్యుదేవత యముని దండమువలె నుండెను.

తనకు దివ్యాస్త్రములు గలవన్న ధైర్యముతో కౌశికుడు వసిష్ఠుని మాటలకు భయపడక లెక్కచేయకుండెను. అతడు అగ్ని అధిదేవతయైన ఆగ్నేయాస్త్రమును ప్రయోగించెను. వసిష్ఠుడు తన దండమును కౌశికునిపై విసరి యిట్లనెను. ''నీ దివ్యాస్త్రములతో నన్నెదిరించుటకు వచ్చినావన్నమాట. నీ శక్తి యెంతటిదో చూచెదను. నీ యెదుటనే నేను నిలుచుందును. నీవేమి చేయగలవో నిరూపింపుము. నీ క్షత్రియబలము గొప్పదో, లేక నా బ్రహ్మబలము గొప్పదో చూచెదముగాక! మూర్ఖుడా! నీవు క్షత్రియులకే కళంకము. బ్రాహ్మణుని దివ్యశక్తులు యెంతటి గొప్పవో నీవు యిప్పుడు చూడగలవు''.

కౌశికుడు ప్రయోగించిన ఆగ్నేయాస్త్రము వడివడిగా వసిష్ఠునివైపు వచ్చుచుండెను. వసిష్ఠుని ముందున్న బ్రహ్మదండమును స్పృశించగనే, నీటిచే అగ్ని ఆరిపోయినట్లు, ఆ అస్త్రము ఆరిపోయెను. ఆ తరువాత కౌశికుడు వరుసగా వరుణ, రుద్ర, ఇంద్ర, పాశుపత, ఐషీకాస్త్రములను ప్రయోగించెను. అవి అన్నియు బ్రహ్మదండము ముందు నిష్ప్రయోజనమయ్యెను. అవి నిష్ప్రయోజనమగుట జూచిన కౌశికుని కనుబొమ్మలందు కోపము, నిస్పృహ స్పష్టముగా గోచరించుచుండెను. అయినప్పటికీ కౌశికుడు వదలిపెట్టక, గాంధర్వ, జృంభణ, స్వపనాస్త్రములను ప్రయోగించెను. అవియూ నిష్ప్రయోజనము లయ్యెను. చివరకు వృత్రుని చంపిన ఇంద్రుని వజ్రాస్త్రము ప్రయోగింపగా అదియు నిష్ఫలమయ్యెను. తరువాత కౌశికుడు, కాలపాశము, బలిని బంధించిన వరుణపాశము, బ్రహ్మపాశములను విడిచెను. అటు పిమ్మట చక్రములను, అనేక దారుణాస్త్రములను ప్రయోగించెను. కాని వీనిలో యే ఒక్కటియూ బ్రహ్మదండమును దాటి వసిష్ఠునికి హాని కలిగింపలేకుండెను.

స్వర్గములో దేవతలందరూ సమావేశమై యీ దృశ్యమును గాంచుచుండిరి. ముల్లోకములందు బ్రహ్మ బలము మిగిలిన శక్తులకన్న మిన్నగా నుండుట వారు తిలకించుచుండిరి. మిక్కిలి నిరుత్సాహపడిన రాజు, చివరకు బ్రహ్మాస్త్రమును ప్రయోగించగా, అందరూ ఆత్రములో యేమగునోయని చూచుచుండిరి. కాని అంతకుముందు ప్రయోగించిన అస్త్రములు, పాశములు, చక్రములవలె యిది కూడ బ్రహ్మదండము ముందు నిష్ఫలమయ్యెను. వసిష్ఠుడు అగ్నివలె అత్యంత తేజస్సుతో ప్రకాశించుచుండెను. అతని శరీరములో ప్రతి అణువు వేడిసెగలు గ్రక్కుచున్నట్లుండెను. పొగలేని నిప్పువలె బ్రహ్మదండము ప్రకాశించుచుండెను. స్వర్గము లోని ఋషులు, యితరులు, యేకగ్రీవముగా నిట్లు ప్రకటించిరి. "నీశక్తి మహాగొప్పది. నీ వైభవము యీ అస్త్రముల ధాటిని తట్టుకొనగలిగెను. గొప్ప మహారాజైన కౌశికుడు పరాజితుడయ్యెను. నీ ఆగ్రహము నుపశమింపజేసి, యీ లోకమును శాంతింపజేయుము".

వసిష్ఠుడు శాంతించెను. బ్రహ్మదండము కూడను చల్లబడెను.

కౌశికుడు తన విల్లు అమ్ములను క్రిందపెట్టి దీర్ఘ నిశ్వాసముతో యిట్లు తలచెను. "ఆహా! ఎందులకీ క్షత్రియ బలము! బ్రహ్మబలమే బలము, యెంచతగినది. కేవలము ఒక బ్రహ్మదండముచేత యీ వసిష్ఠుడు నాకు మహాదేవుడు ప్రసాదించిన యస్త్రములన్నియు నిరుపయోగమగునట్లు గావించినాడు. నేను కూడ అట్టి బలము సంపాదించుటకు తపస్సు చేసెదను. తపస్సు చేసి బ్రహ్మత్వమును పొందెదను".

కౌశికుని హృదయములో అనేక భావములు చెలరేగెను. వసిష్ఠుని చేతిలో పొందిన అపజయమునకు హృదయములో కసిగా నుండెను. అతని వేడినిట్టూర్పులు కర్రదెబ్బతినిన పాము బుసవలె నుండెను. వసిష్ఠునిపై అతని ద్వేషము తీవ్రముగా పెరిగెను. ఈ భావములన్నియు, హృదయములో చెలరేగుచుండగా, దక్షిణదిక్కుగా కౌశికుడు ప్రయాణము చేసి, తీవ్రముగా తపస్సు చేయమొదలుపెట్టెను. బ్రహ్మర్షి కావలెనని అతని కోరిక. అనేక సంవత్సరములు గడిచెను అతడింకనూ తపస్సు చేయుచుండెను.

వేయి సంవత్సరములు గడచిన తర్వాత బ్రహ్మ ప్రత్యక్షమై యిట్లనెను. "కౌశికా! నీ తీవ్ర తపస్సుకు, యేకాగ్రతకు స్వర్గములో అందరూ మెచ్చుకొనిరి. అసాధ్యమైన దానిని నీవు సాధించితివి. ఇక నుంచి నీవు రాజర్షి కౌశికుడవు". ఇట్లు పలికి బ్రహ్మ తిరిగి సత్యలోకమున కేగెను.

కౌశికునకు తగినంతగా సంతోషము కలుగలేదు. పైగా అతడు చాల విచారముగా నుండెను. నిస్పృహ నిరాశ తీవ్రమయ్యెను. అతడు లోకమును కోరగా పిడికెడు యినుక లభ్యమైనట్లుగా, తలపోసెను. "ఇన్నివేల సంవత్సరముల తపస్సు చేయగా, రాజర్షిగా మాత్రమే అర్హత సంపాదించ గలిగినాను. బహుశః తగినంత తీవ్రముగా తపస్సు చేసి యుండకపోవచ్చును. నేను మరల ప్రయత్నించెదను".

తిరిగి కౌశికుడు భయంకరమైన తపస్సు చేయమొదలిడెను.

నవమ స్కంధము

120 త్రిశంకు మహారాజు

సూర్యవంశములోని రాజులలో త్రిశంకు మహారాజు గొప్పవాడు, ధర్మపరాయణుడు, సద్గుణవంతుడు. అకస్మాత్తుగా రాజునకు ఒక విచిత్రమైన కోరిక కలిగెను. మానవ శరీరముతో స్వర్గమునకు వెళ్ళవలెనని అతని కోరిక. తన కోరిక నేరవేరుటకు యజ్ఞము జరుపమని గురువైన వసిష్ఠుని త్రిశంకు మహారాజు ప్రార్థించెను. వసిష్ఠుడు యిందు కంగీకరింపక యిట్లు పలికెను. ''నీవు కోరునది అపవిత్రమైనది, అస్వాభావికమైనది. నీవు యీ మానవ శరీరముతో స్వర్గమునకు వెళ్ళుటకు నేనెట్టి సహాయము చేయలేను''.

త్రిశంకుడు పూర్తిగా నిరాశ చెందెను. అతడు సింహాసనము త్యజించి, దక్షిణ దిక్కుగా ప్రయాణించెను. అతడు వసిష్ఠుని కుమారులను కలుసుకుని, తన కోరికను వారికి దెలిపి, అది నెరవేరునట్లు చేయమని కోరెను. వారు నూర్గురు అనేక సంవత్సరములు తపస్సు చేసియుండిరి.

వసిష్ఠుని పుత్రుల తపశ్శక్తి చాల గొప్పది. త్రిశంకు మహారాజు వారిని సమీపించి గౌరవ పురస్సరముగా నమస్కారము చేసి చేతులు జోడించి యిట్లనెను. ''నేను మిమ్ము శరణు వేడుచున్నాను. నేను మహారాజును. మీ తండ్రి వసిష్ఠుడు నాకు గురువు. ఈ శరీరముతో నేను స్వర్గమున కేగునట్లు మీరు యాగము చేయవలసినదని ప్రార్థించుచున్నాను. వసిష్ఠుడు యిట్లు చేయుటకు నిరాకరించి, యింకెవరి సహాయమునైన పొందమని చెప్పెను. గురుపుత్రులైన మీరు తప్ప నాకింకెవరును లేరు. అందుచే మీ సహాయము నర్థించుచున్నాను. మీరు తపశ్శక్తి సంపన్నులు. నాకు సహాయము చేయవలసినదని ప్రార్థించుచున్నాను. మీ పూర్వులందరూ ఇక్ష్వాకువంశములోని వారికి గురువులు. మీరు మాకు దైవ సమానులు. నా ప్రార్థన మన్నించి సహాయము చేయవలెను.

వసిష్ఠుని పుత్రులు రాజుపై ఆగ్రహము చెంది యిట్లనిరి. ''నీవు మూర్ఖుడవు, పాపాత్ముడవు. ఇట్లు చేయుట అధర్మమని మా తండ్రి నిరాకరించగా, మమ్ములను యాగము జరిపి, నీ కోరిక నెరవేరునట్లు చేయుమని అడుగుట కెంత ధైర్యము?

''వసిష్ఠుడు నీకు కులగురువు. ఇక్ష్వాకుల పాలన ప్రారంభమైనప్పటి నుండి ఆ వంశములోని రాజులందరకూ మా తండ్రి హిత ముపదేశించు చున్నాడు. అతడు నీ కోరికను మన్నించకుండెను. మా తండ్రికి అనంగీకారమైన దానిని మమ్ములను చేయమని నీవెట్లు అడుగుచుంటివి? నీ యీ కోరిక చాల కుత్రతనపు చేష్టగా నున్నది. నీ నగరమునకు తిరిగివెళ్ళి రాజ్యపాలనము కొనసాగించుము. నీ కోరికను తీర్చుటకై మా తండ్రి కవమానము కలిగించలేము''. వారి సమాధానము రాజునకు నిరాశ కలిగించెను. అతడు వారితో యిట్లనెను. ''గురువైన వసిష్ఠుడు, అతని కుమారులైన మీరు నా కోరిక నెరవేర్చకుండిన నేనేమి చేయగలను? ఒకే ఒక మార్గము గోచరించుచున్నది. నా కోరిక తీర్చగలుగు మరొక గురువు కొరకు అన్వేషించెదను''. వసిష్ఠుని పుత్రులు ఆగ్రహావిష్టులైరి. వారికి, వారి తండ్రికి జరిగిన అవమానము సహింపలేకుండిరి. వారు త్రిశంకుని ఇట్లు శపించిరి. ''నీవు గురుద్రోహివి. ఈక్షణము నుండి నీవు ఛండాలుడ వగుదువు''. వారట్లు శపించి, తమ ఆశ్రమమునకు వెళ్ళిపోయిరి.

రాజు విచారముతో తిరిగి తన నగరమునకు వచ్చెను. అతని హృదయములో తీరని బాధ, నిరాశ చోటు చేసుకొనెను. ఆ రాత్రి గడచిన తర్వాత అతడు ఛండాలుడైనట్లు కనుగొనెను. మంచి బంగారు వన్నెతో

నున్న అతని శరీరము నల్లగా మారెను. బట్టలన్నియూ నల్లబడెను అతని మెడలో నున్న అడవి పువ్వులు, ధరించిన బంగారు ఆభరణములు మొరటు యినుప వస్తువులుగా మారెను నగరములో అతనిని చూచి గుర్తు పట్టలేక, ప్రజలు అసహ్యించుకొనిరి. తానెవరో వివరించి నప్పటికీ అతని మంత్రులు కూడ అతనిని నమ్మలేకపోయిరి. అతని ఆకారము చూచి అవహేళన చేసి, ప్రజలు అతనిని నగరమునుండి బహిష్కరించిరి త్రిశంకు డొక క్షణమాలోచించి తనకు తప్పక సహాయపడువ్యక్తి ఒకరు గలరని నిశ్చయించుకొనెను కౌశికుని తీవ్ర తపస్సు గురించి త్రిశంకుడు విని యుండెను. అతడు తన తపశ్శక్తిచే రాజర్షి అయ్యెనని కూడ తెలుసుకొనెను కౌశికుడు తపస్సు చేయుచున్న ప్రదేశమునకు త్రిశంకుడు వడివడిగా చేరుకొనెను

121 త్రిశంకు స్వర్గము

కౌశికుడు ధ్యానములో నిమగ్నుడై యుండెను. అతని ధ్యానమునకు అంతరాయము కలిగింపక త్రిశంకుడు ప్రక్కనే నిలుచుని యుండెను. చేరువలో యెవరో నిలుచున్నట్లు గ్రహించి, కౌశికుడు కనులు తెరచి చూచెను దూరముగా అనాకారిగా నల్లగా నున్న ఛండాలుడొకడు నిలుచుని యుండుట గాంచెను ఆ ఛండాలుని నేత్రములు, వదనము అతి దీనముగా నుండుట జూచి, అతడు తీవ్రముగా యేదో బాధపడుచున్నాడని గ్రహించెను కౌశికుని హృదయము సానుభూతితో నిండెను ఛండాలుని దగ్గరకు పిలిచి యిట్లడిగెను. ''అయోధ్య రాజైన త్రిశంకువని యెరుగుదును నీకేమి సహాయము కావలెను. నీవు వీరుడవు గొప్పరాజువు. నేనేమి చేయవలెనో చెప్పుము? ఈ చండాల రూపము యేదో శాపఫలితమని తలచెదను నీ బాధ నివారించుటకు నేనేమి చేయవలెనో చెప్పుము''

ఆదరపూర్వకముగా పలికిన కౌశికుని పలుకులు వినిన రాజు హృదయము కృతజ్ఞతతో నిండి, కనులు చెమర్చెను చేతులు జోడించి త్రిశంకు డిట్లనెను ''నా గురువైన వసిష్ఠుడు, అతని పుత్రులు నా కోరికను నిరాకరించిరి. ఈ శరీరముతో స్వర్గమునకు వెళ్ళవలెనను నా కోరికను వారు తిరస్కరించిరి నేను నూరు యజ్ఞములు జరిపితిని నా యీ ప్రత్యేకమైన కోరిక నెరవేరుటకు అవి చాలవని తలంతును. నేనెన్నడును అబద్ధము లాడలేదు. ఇక ముందు కూడ అబద్ధము లాడను నేను ప్రజలను మిక్కిలి అభిమానముతో చూచుకొని, పాలించితిని. క్షత్రియ ధర్మములను విడనాడి నేనెన్నడును చరించలేదు పెద్దలందరకు నేను ప్రీతి కల్గించెడివాడను నేను ధర్మబద్ధముగా యెల్లపుడును వ్యవహరించితిని. ఇవి యేవియూ నా చిన్నకోరికను తీర్చలేకుండుటచే, అవియన్నియు నిరర్థకమనియూ, విధి ఒక్కటే అత్యంత శక్తిమంతమైనదనియు, మానవ ప్రయత్నములు వ్యర్థమనియూ భావించుచుంటిని. సమస్తమును విధి వశమునందే యున్నది అందరు చివరకు విధినే ఆశ్రయించవలసి యున్నది ఈ మానవ శరీరముతో స్వర్గమునకు వెళ్ళవలెనను నా కోరికను నెరవేర్చ సహాయ పడగలరేమోయని అర్థించుటకు వచ్చినాను. నా కోరికను తెలిపి సహాయ మర్థించుటకు నాకు యింకెవ్వరును లేరు నాకు సహాయము చేసి, మానవ ప్రయత్నములు విధి వశమున కతీతమైనవని, అవి అతిశక్తిమంతమైనవని లోకమునకు నిరూపింపవలసిన నిర్ణయమును మీకు వదలివేయుచున్నాను''

రాజు దుర్గతికి కౌశికుని హృదయము ద్రవించి, అభిమాన ముప్పొంగెను అతడు సరళ స్వరముతో నిట్లనెను

''ఓరాజా! నీవు నా వద్ద యీ ఆశ్రమములో ఉండవచ్చును నీ ధర్మగుణములు యీ లోకమునకు విదితమే నీకు తప్పక సహాయము చేసెదను. నీకేమియు భయము లేదు ఋషులందరను సమావేశపరచి నీ కొరకై యజ్ఞము చేయుటకు నాకు సహాయము చేయవలసినదని కోరెదను. నీ గురుపుత్రుల శాపఫలితముగా ఏర్పడిన యీ చండాల రూపముతో నీవు స్వర్గమునకు వెళ్ళునట్లు చేసెదను. నీవు నావద్దకు వచ్చి ఆశ్రయము కోరినావు నీవు రిక్తహస్తములతో వెళ్ళరాదు నీవు కోరినది నేను చేసెదను''

యజ్ఞము జరుపుట కవసరమైన వస్తువులను సమకూర్చుటకు కౌశికుడు తన పుత్రులను నియోగించెను. తన శిష్యులను పిలిచి వారితో నిట్లనెను ''మీరు వెళ్ళి ఋషులందరను ఆహ్వానింపుడు. ఇది నా ప్రార్థనయని విన్నవింపుడు వారు ఆశ్రమములతో తరలి రానిండు''. ఋషులను ఆహ్వానించుటకు నలుదిక్కులకూ వెళ్ళిరి ఋషులందరును కౌశికుని ఆశ్రమమునకు వచ్చిరి వసిష్ఠుడు, అతని పుత్రులు తప్ప అందరును విచ్చేసిరి. వసిష్ఠుని పుత్రులాడిన మాటలను కౌశికునకు శిష్యులు నివేదించిరి వసిష్ఠుని పుత్రులిట్లనిరి ''ఈ యజ్ఞము హాస్యాస్పదముగా నున్నది ఒక చండాలుని కొరకు, ఒక క్షత్రియుడు యజ్ఞము జరుపుట చాల చిత్రాతి చిత్రము ఈ యజ్ఞములో భాగము పంచుకొనేవారి తీరు యెట్లుండునో గమనించవలసి యున్నది! దేవతల నర్చించునపుడు వారు యెట్లు క్షత్రియుని (బ్రాహ్మణేతరుని) చేతినుండి హవిస్సును గ్రహించగలరు! ఒక చండాలుడు స్పృశింపగా, క్షత్రియుడు సమర్పించిన దానిని వారెట్లు భుజింతురు?'' వారి మాటలకు కౌశికుడు మండిపడి, వారు, నిషాదులగునట్లు శపించెను

తన కోరికపై వచ్చిన ఋషులతో కౌశికు డిట్లనెను ''ఈ త్రిశంకు మహారాజా ఇక్ష్వాకు వంశమునకు చెందినవాడు అత్యుత్తమ ప్రభువు ముల్లోకములందు ధర్మ ప్రభువుగా ప్రసిద్ధికెక్కెను ఈ శరీరముతో స్వర్గమునకు వెళ్ళవలెనని అతని కోరిక అతని కోరిక నెరవేరుటకు సహాయము చేసెదనని మాట యిచ్చినాను ఈ ప్రయత్నములో మీరందరు నాకు సహాయము చేయవలెనని కోరుచున్నాను''

కౌశికుని అభ్యర్థన వినిన ఋషులు తమలో తాము యిట్లను కొనసాగిరి ''ఈ కౌశికునకు ముక్కుపై కోపము. అతని ఆగ్రహము ప్రమాదకరము మనమతనికి సహాయపడకుండిన అతడు మనపై ఆగ్రహించుట తథ్యము ఆగ్రహములో అతడేమి చేయునో మనము ఊహించలేము. వసిష్ఠుని పుత్రులు అతని ఆగ్రహమునకు యెట్లు గురియైరో మనము కనులార గాంచినాము అందుచే అతడు చేయు యజ్ఞమునకు సహాయపడుటయే శ్రేయస్కరము''

కౌశికుడు యజ్ఞమునకు యాజకుడుగా నుండెను ఋషులందరూ తగిన సహాయము చేయుటకు నిశ్చయించుకొనిరి యజ్ఞము యథావిధిగా కొనసాగెను. చివరలో హవిస్సులో భాగము స్వీకరించుటకు దేవతలను ఒకొక్కరినే కౌశికుడు ఆహ్వానించెను కాని యే ఒక్కరునూ రాకుండిరి. దేవతలు యజ్ఞమును బహిష్కరించుట స్పష్టమయ్యెను ఈ అవమానమునకు కౌశికుడు ఆగ్రహము చెందెను. కాని తనను తాను శమింపజేసుకుని, క్రోధమును వెళ్ళగ్రక్కు నేత్రములతో శరీరమంతయు కంపించుచుండగా, అగ్నిలో ఘృతమును వేయు గరిటెను పైకెత్తి పట్టుకుని ఉచ్చైస్వరముతో నిట్లనెను. ''నా తపశ్శక్తిని చూడుడు ఈ రాజును యిదే శరీరముతో స్వర్గముపైకి లేవనెత్తెదను'' కౌశికుడు త్రిశంకు వైపు తిరిగి, ''ఓ రాజా! నిన్ను నేను ఆజ్ఞాపించుచున్నాను నీవు గాలిలో పైకి లేచి సశరీరముగా స్వర్గమును చేరెదవు. నేను చేసిన తపస్సుకు ఫలితి మేదైన నుండిన, అది నిన్ను స్వర్గమునకు లేవనెత్తి తీసుకుపోవలెను. త్రిశంకూ! లెమ్ము పైకి లేచి

స్వర్గమును చేరుము''.

ప్రతి ఒక్కరూ ఊపిరి బిగబట్టి యేమి జరుగునో యని గమనించుచుండిరి ఒక్కసారిగా త్రిశంకు భూమి నుండి లేచి గాలిలో పైపైకి వెళ్ళుచుండెను. చేతులు జోడించి, కౌశికునకు నమస్కరించి గాలిలో పైకి వెళ్ళెను అందరూ చూచుచుండగనే ఆకాశమున అతడు అదృశ్యుడయ్యెను.

త్రిశంకు డావిధముగా స్వర్గమునకు వచ్చుట ఇంద్రున కిష్టము లేకుండెను ఇంద్రుడిట్లనెను ''త్రిశంకూ! నీవు తిరిగి భూలోకమునకు వెళ్ళుము. గురు పుత్రులచే శపింపబడిన నీవు యీ స్వర్గములో నుండుట కనర్హుడవు నిన్ను మాలో ఒకడుగా స్వీకరించుటకు మేము సంసిద్ధులుగా లేము'' త్రిశంకుని స్వర్గము నుండి త్రోసివేసెను అతడు భూమిపైకి దిగుచూ, యెలుగెత్తి కౌశికుని పిలిచి యిట్లనెను ''ప్రభూ! వారు నన్ను త్రోసివేయగా జారిపడుచున్నాను నన్ను రక్షింపుడు!''

' విచారము కలిగెను దేవతలు అసూయతో, స్వార్థముతో యిట్లు వర్తించగలరన్న ఆలోచనను కౌశికుడు భరించలేకుండెను. అతడు ''నీవు అక్కడే నిలువుము'' అని గట్టిగా అరచెను

క్రిందకు పడబోవుచున్న త్రిశంకు మధ్యలో ఆగిపోయెను. అచట నున్న ఋషులందరి సమక్షములో, సృష్టికర్త బ్రహ్మవలె త్రిశంకు స్వర్గమును సృష్టించెను. దక్షిణ దిక్కున సప్తర్షి మండలమును, నక్షత్రములను సృష్టించెను. తరువాత అతడిట్లనెను ''నేను మరొక ఇంద్రుని సృష్టించెదను ఆ ఇంద్రుని ముందు యిప్పుడున్న ఇంద్రుడు దిగదుడుపుగా నుండును''. కౌశికుడు తన కార్యమును మొదలుబెట్టెను త్రిశంకు స్వర్గములో ప్రత్యేకముగా వేర్వేరు దేవతలను సృష్టించవలెనని అతని అభిమతము

స్వర్గములో పెద్ద కల్లోలము చెలరేగెను. దేవతలు, ఋషులు అత్యంత వినయముతో కౌశికుని సమీపించి యిట్లనిరి ''కౌశికా! మేము చెప్పునది సావధానముగా వినుము గురు శాపము పొందినవారు స్వర్గములో నుండుట కనర్హులని చెప్పుదురు. అందుచే మేము త్రిశంకుని స్వర్గము నుండి త్రోసివేయవలసి వచ్చెను అంతేగాని, నీ గొప్ప తపస్సును కించపరచుటకు గాదు'' వారి పలుకులను విని కౌశికుడిట్లనెను. ''మీరు త్రిశంకునిపై అసూయ చెంది ఆ విధముగా ప్రవర్తించినారు అతనిని తిరిగి భూలోకమునకు రానివ్వను. అతడు చాల ధర్మపరాయణుడు గురు శాపమునకుగాని, మీరు యిప్పుడు అతని యెడల ప్రవర్తించిన తీరునకుగాని అతడు అర్హుడు కాడు''. అంతట దేవతలు యిట్లనిరి ''అట్లయినచో మేము మా మాటలను ఉపసంహరించుకొనుచున్నాము. నీవు చెప్పినది మేము అంగీకరించుచున్నాము''

కౌశికుడిట్లనెను ''నేను త్రిశంకున కిచ్చిన మాటను ఉపసంహరించుకొనను అతనిని సశరీరముగా స్వర్గమునకు పంపెదనని మాట యిచ్చితిని. నేను అతని కొరకు సృష్టించిన స్వర్గము శాశ్వ
నేను సృష్టించిన సప్తర్షి మండలము, నక్షత్రములు మొదలైనవన్నియు శాశ్వతముగా నుండగలవు ఇంద్రుడు రావచ్చు, పోవచ్చు కాని నేను సృష్టించిన త్రిశంకు స్వర్గము చిరకాలము ఉండగలదు''

ఇంద్రాది దేవతలు వినయముగా యిందులకు అంగీకరించిరి ఇంద్రు డిట్లనెను ''అట్లే కానిమ్ము నీవు సృష్టించిన దేవతలు, ఋషులు, నక్షత్రములు, నీ గొప్పదనమును యీ లోకమున చాటుటకు నిదర్శనముగా నుండగలరు త్రిశంకుడు, తన కొరకై నిర్మించిన స్వర్గమును ఇంద్రుని వలె పరిపాలించగలడు నక్షత్రము

లన్నియూ వాని పరిధిలో సంచరించగలవు. అతని పేరు ప్రతిష్ఠలు చిరకాలము నిలిచి యుండగలవు''. దేవతలు పలికిన పలుకులు కౌశికుని సంతోషపరచెను. త్రిశంకుడు సుఖముగా నుండెను. ఋషులందరు వారి వారి ఆశ్రమములకు, దేవతలు తమ నివాసములకు వెళ్ళిరి.

కౌశికుడు యేకాకిగా నుండెను. అతని తపస్సంపద అంతయూ కరగిపోయెను. అతడు సర్వస్వమును త్రిశంకు మహారాజా కొరకు ధారపోసెను. అయినను క్లిష్ట పరిస్థితులలో నున్న త్రిశంకును ఆదుకొని సహాయపడినందుకు సంతోషము కలిగెను.

122 శునశ్శేపుడు

త్రిశంకుని గాధ జరిగిన తర్వాత కౌశికుడు తనలో తానిట్లు భావించెను. ''దక్షిణ దిశలో నేను గావించిన తపస్సునకు అంతరాయము కలిగి అంతయు వ్యయమైపోయెను. పశ్చిమ దిశగా వెళ్ళి మరల తపస్సు ప్రారంభించెదను మానవుల కంట పడని ప్రదేశమందు ఒక సరోవర తీరమున ఆశ్రమము నేర్పరచుకుని అచ్చట తపస్సు చేసెదను''. కౌశికమను సరస్సు ఒడ్డున పుష్కర క్షేత్రమను పుణ్యస్థలములో అతడు తిరిగి తపస్సు ప్రారంభించెను

త్రిశంకునకు హరిశ్చంద్రుడను కుమారుడు గలడని యింతకు ముందు మరొక సందర్భములో తెలియవచ్చినది. వరుణ ప్రసాదముచేత హరిశ్చంద్రునకొక కుమారుడు గలిగెను. పుట్టిన వెంటనే ఆ పుత్రుని వరుణ దేవునకు ప్రసాదించగలనని హరిశ్చంద్రుడు మాట యిచ్చెను. అయితే పుత్రునిపై అభిమానము మెండుగా నుండుటచే యేదో ఒక మిషపై వరుణదేవుని కివ్వకుండెను. వరుసగా ఒకదాని తర్వాత మరొక కారణము చెప్పుచు నరమేధ యాగమును మాట యిచ్చిన ప్రకారము సలుపక యెగవేయుచుండెను. హరిశ్చంద్రుని పుత్రుడు రోహితుడు పెరిగి పెద్దవాడయ్యెను అతడు తన తండ్రి వరుణదేవుని కిచ్చిన వాగ్దానమును తెలుసుకొనెను అతడు అరణ్యమునకు వెళ్ళి తనకు సంభవింప బోవు ఉపద్రవము నుండి తప్పించుకొన జూచెను. అనేక సంవత్సరములు అడవిలో సంచరించెను. హరిశ్చంద్రుడు వరుణున కిచ్చిన వాగ్దానము నిలుపుకొననందుకు, రాజును శిక్షింపనెంచి, అతడు మహోదర వ్యాధితో బాధపడునట్లు చేసెను తన తండ్రి తీవ్రమైన వ్యాధితో బాధపడుచున్నాడని తెలుసుకుని, తండ్రిని రక్షింపనెంచి తిరిగి రాజ్యమునకు బోవ తలపెట్టెను ఇంద్రుడతని నడ్డగించి తీర్థయాత్రలకు బంపెను అతడు తిరిగి వచ్చునపుడెల్లను ఇంద్రుడు అడ్డుపడి మరల తీర్థయాత్రలను కొనసాగించమని పంపుచుండెను. ఇట్లు అయిదు సంవత్సరములు గడచెను చివరకు రాజ్యమునకు బోయి తండ్రిని రక్షించుటకు రోహితుడు నిశ్చయించుకొనెను.

రోహితుడు రాజ్యమునకు తిరిగి వచ్చుచుండగా మార్గమందు అజగర్తుడను బ్రాహ్మణుని కలుసుకొనెను. ఆ బ్రాహ్మణుడు భార్యతో, ముగ్గురు పుత్రులతో ప్రయాణము సలుపుచుండెను. తనకు బదులుగా వేరొకరు నరమేధమునకు లభించినచో, తన తండ్రికి ఆరోగ్యము చేకూరగలదనియు, మృత్యు ముఖము నుండి తాను తప్పించుకొనవచ్చుననియూ రోహితుడు భావించెను బ్రాహ్మణుని, అతని పుత్రులను చూచిన తర్వాత రోహితుని కిట్టి ఆలోచన కలిగెను. మరొక యువకుని వరుణదేవునకు సమర్పించినచో, తన రాజ

కుటుంబమునకు అవాంతర పరిస్థితి తప్పిపోగలదని తలంచెను. రోహితుడు బ్రాహ్మణునకు నమస్కరించెను. రోహితుడు యేదో చెప్ప నున్నాడని గ్రహించి బ్రాహ్మణుడు మౌనముగా నుండెను. రోహితుడిట్లనెను. ''బ్రాహ్మణోత్తమా! నీకు నూరువేల గోవులను యిచ్చెదను. అందుకు ప్రతిఫలముగా నీ కుమారులలో నొకరిని నాకివ్వగలవా?'' బ్రాహ్మణుడు వింతయైన యీ కోరికను విని ఆశ్చర్యము చెంది, వివరము అడిగి తెలుసుకొనెను. రోహితుడు, తన కుటుంబము యెదుర్కొంటున్న క్లిష్ట సమస్యను వివరించెను. రోహితుడు మరల యిట్లనెను. ''నా తండ్రికి నేనొక్కడనే పుత్రుడను. నేను మరణించినచో మా వంశము అంతరించగలదు. నా తండ్రి అనారోగ్యముతో బాధపడుచున్నాడు. నీ పుత్రులలో ఒకరిని యిచ్చినచో యిద్దరి జీవితములు రక్షించినట్లగును. మరియు దేశమునకు సేవచేసిన కీర్తి కూడ నీకు దక్కగలదు. నీ పుత్రులలో నొకని నాకివ్వగలవా?''

అజగర్తు డిట్లనెను. ''నా జ్యేష్ఠ పుత్రుని యీయజాలను. అతనిపై నాకు అత్యంత ప్రీతి. అతడు లేనిదే నేను జీవించలేను''. బ్రాహ్మణుని భార్య యిటులనెను. ''జ్యేష్ఠ పుత్రుడు తన కత్యంత ప్రీతిపాత్రుడగుటచే అతని నివ్వలేనని నా భర్త భార్గవుడు చెప్పెను. ఈ కనిష్ఠ పుత్రునిపై నాకు విపరీతమైన ప్రేమాభిమానములు గలవు. అతని యెడబాటు నేను భరించలేను. జ్యేష్ఠపుత్రునిపై తండ్రికి, కనిష్ఠ పుత్రునిపై తల్లికి ప్రేమ యుండుట లోక సహజము''.

బ్రాహ్మణుని రెండవ పుత్రుని పేరు శునశ్శేఫుడు. అతడు అతి సరళముగా కొద్దిపాటి విచార స్వరముతో యిట్లనెను. ''ఓ రాకుమారుడా! నా మాట వినుము. నా అన్నగారు తండ్రికి, తమ్ముడు తల్లికి ప్రీతిపాత్రులు. కాబట్టి నా తల్లిదండ్రులు నన్ను నీకిచ్చిరని భావించవచ్చును. నన్ను నీతో తీసుకువెళ్ళుము''. రాకుమారుడు మాట ప్రకారము గోవులను బ్రాహ్మణున కిచ్చి, అతని పుత్రుని సంతోషముగా తనతో తీసుకు వెళ్ళెను.

రోహితుడు, శునశ్శేఫుడు పవిత్ర పుష్కర స్థలము చేరుసరికి నడి మధ్యాహ్నము కాజొచ్చెను. అచట బ్రాహ్మణ బాలుడైన శునశ్శేఫుడు కౌశికుడు తపస్సు చేయుచుండుట గమనించెను. ఆ బాలుడు ఆకలిదప్పిక లతో అలమటించుచుండెను. పైగా తనపై తల్లిదండ్రులకు ప్రేమాభిమానములు లేవని తెలుసుకుని నిరుత్సాహ ముతో నుండెను. లేకున్న, గోవులను తీసుకుని తనకు మరణము సంభవించునని తెలిసికూడ, రాకుమారునకు అమ్మజూతురా? కౌశికుడు భార్గవ కుటుంబమునకు దూరపు బంధువని తెలుసుకుని, ఆ బంధుత్వమును వినియోగించుకొనవలెనని భావించెను. వెంటనే ఉన్నపాటున కౌశికుని వద్దకు వెళ్ళి అతని ఒడిలో పడి యేడ్వసాగెను. సమాధిలో నున్న కౌశికుడు తెలివి తెచ్చుకుని ఆగంతకుని చూచెను. ఒక బాలుడు విచార వదనముతో తన హృదయములోని ఆవేదనను తెలుపుచు యేడ్చుచుండెను. ఆ బాలుడిట్లనెను. ''నాకు తల్లియు, తండ్రియు లేరు. నా కెవరు బంధువులు లేరు. నీవు తప్ప నాకింకెవరూ లేరు. నా ప్రాణము కాపాడుము. నీవు చాల శక్తిమంతుడవని, ఉదారుడవని, కరుణామయుడవని, యితరులు విచారముతో నుండుట చూచి సహించలేవని చెప్పగా విన్నాను. నిన్ను నేను చూచి నీ సహాయ మర్థించుటకై వచ్చితిని''. ఆ బాలుని విచారమునకు కారణమడుగగా, అతడు కౌశికునకు జరిగిన విషయము విపులముగా తెలిపెను. అది వినిన కౌశికుని హృదయము ప్రేమతో నిండిపోయెను. శునశ్శేఫుడు తిరిగి యిట్లనెను. ''ప్రభూ! రాజు చేయు యజ్ఞము కొరకు నా తండ్రి నన్ను అమ్మివేసెను. కాని యజ్ఞమునకు ఆటంకము కలుగుట నాకు యిష్టము లేదు, నా ప్రాణములు విడుచుటకు కూడ నాకు యిష్టము లేదు. ఈ రెండును నెరవేరునట్లు నీవు మాత్రమే చేయగలవు. నేను దీర్ఘకాలము జీవించి, తపస్సు చేసి ఆ తర్వాత స్వర్గము చేరవలెనని నా అభిమతము. అనాథుడనైన

నావంటి అభాగ్యుల పాలిటి రక్షకుడవు నీవు''.

విచారించుచున్న బాలునితో కౌశికుడు మృదువైన మాటలతో రక్షించెదనని మాట యిచ్చి ఓదార్చెను. తరువాత కౌశికుడు తన పుత్రులను పిలిచి యిట్లనెను. ''పుత్రులు పున్నామ నరకము నుండి రక్షించి, తాము పితృలోకము చేరుటకు సహాయపడెదరను తలంపుతో తల్లిదండ్రులు పుత్రులను కోరెదరు. మీ జన్మలను మీరు సార్థకము గావించెదరో లేదో నేను చూచెదను. ఈ బాలుడు రక్షింపమని నన్ను కోరుచు నా దగ్గరకు వచ్చెను. మీరందరు శాస్త్రములు చక్కగా అధ్యయనము చేసినవారు, తపస్సు చేసి శక్తిని సంపాదించినారు. నేను ఆశించినట్లుగా మీరు నడచుకొనవలెను. మీలో ఒకరు హరిశ్చంద్రుడు జరుపు నరమేధ యాగమునకు యజ్ఞపశువు కావలెను. ఆ విధముగా నేనీ బాలుని రక్షించి యజ్ఞము జయప్రదముగా సమాప్తి యగునట్లు గావించెదను. ఆ విధముగా మీరు చేసెదరా?''

కౌశికుని పుత్రులలో మధుచ్ఛందుడు మరికొందరు యిది ఒక వేళాకోళముగా పరిగణించి నవ్వుచు తండ్రితో యిట్లనిరి. ''తండ్రీ! ఎవరో ఒక బాలుడు వచ్చి తన హృదయావేదనను తెలుపగా, నీ పుత్రులలో ఒకరిని బలి చేయుటకు నీ హృదయమెట్లు అంగీకరించెను? శునక మాంసమును భుజించుట యే విధముగా అసాధ్యమో, నీ యాదేశమును మేము పాటించుట అంతటి అసాధ్యము''. కౌశికుని ఆగ్రహము అతని ముఖమందు ప్రస్ఫుటముగా గోచరించుచుండెను. అతడు తన పుత్రులతో నిట్లనెను. ''మీ ప్రవర్తన, మాటల తీరు చూడగా యీ జీవితమునకు అనర్హులని తోచుచున్నది. మీరు నాకు పుత్రులుగా నుండదగరు. తండ్రి ఆదేశమును పాటించని వారు గౌరవింపదగరు. వసిష్ఠుని కుమారుల వలె మీరు కూడ నిషాదులై శునక మాంసమును భుజించుచూ వేయు సంవత్సరములు జీవించుడు''

కౌశికుడు తన పుత్రులను శపించిన తర్వాత శునశ్శేపుని యేదో విధముగా రక్షించెదనని అభయ మొసంగెను. అతడిట్లనెను. ''నీవు రోహితునితో వెళ్ళుము. నిన్ను బలి స్తంభమునకు కట్టి మెడలో యెర్రని పూలదండలు వేసి శరీరమునకు యెర్రని గంధము పూసెదరు. పవిత్ర మంత్రములతో మంత్రించిన త్రాళ్ళతో నిన్ను యూప స్తంభమునకు కట్టెదరు. నేను నీకు రెండు మంత్ర శ్లోకములను బోధించెదను. వాటిని నీ మనస్సులో మననము చేసుకొనుము. యజ్ఞము జరుగునపుడు నీవు ఆ మంత్ర శ్లోకములను పఠించుచుండుము. అపుడు యజ్ఞము విజయవంతముగా సమాప్తి అయినట్లు భావించవచ్చును''.

శునశ్శేపుడు అతిశ్రద్ధతో మంత్ర శ్లోకములు నేర్చుకొనెను. తరువాత విశ్రమించుచున్న రోహితుని వద్దకు వెళ్ళి యిట్లనెను. ''తొందరగా మనము నగరము చేరుదము. యజ్ఞము జరుగు స్థలమునకు నన్ను తీసుకొని వెళ్ళుము. నేను సంసిద్ధుడనై యున్నాను''.

శునశ్శేపుడు తనంత తానుగా ఉత్సాహము చూపించుట చూచి రోహితుడు సంతోషించెను. వారిద్దరూ రోగముతో బాధపడుచున్న హరిశ్చంద్రుని వద్దకు వెళ్ళిరి. అనుకూలముగా మారిన పరిస్థితులకు హరిశ్చంద్రుడు చాల సంతోషించెను. మహోదర వ్యాధితో బాధపడుచున్నప్పటికీ, యజ్ఞశాలకు వెళ్ళి యజ్ఞమును ప్రారంభించెను. కౌశికుడచ్చటకు వచ్చెను. రాజు, కౌశికుని యజ్ఞహోతగా నియమించెను. జమదగ్ని అధ్వర్యుడుగను, వసిష్ఠుడు బ్రహ్మగను, అయాస్యుడు ఉద్గాతగను వ్యవహరించిరి

హరిశ్చంద్రుడు శునశ్శేపుని యూపమునకు గట్టెను. ఆ బాలుని వారు బలి చేయుటకు సంసిద్ధులగుచుం

డగా, ఆ బాలుడు పసితనపు తత్తరపాటుతో కౌశికుడు తనకు నేర్పిన మంత్రములను గట్టిగా నుచ్చరించుట మొదలుపెట్టెను. యజ్ఞశాల అంతయు నిశ్శబ్దముగా నుండెను. మొదట ఆశ్చర్యముతోను, తర్వాత ఇంద్రవరుణాది దేవతలను కీర్తించు ఉత్తమ మంత్రములు వినిపించుటచేత యజ్ఞశాల అంతయు గంభీర నిశ్శబ్దమావరించెను. ఇంద్రుడు, వరుణుడు మెచ్చుకొనిరి. వారు ప్రత్యక్షమై శునశ్శేపుడు చిరకాలము జీవించునట్లు వరము ప్రసాదించిరి. హరిశ్చంద్రుని తప్పిదమును క్షమించి, అతని జలోదర రోగమును నివారింపజేసిరి. పుత్రునిపై విశేషమైన మమకారమును పెంచుకొనుట వలన కలిగిన అనుభవములు రాజునకు గుణపాఠము నేర్పగా, అతడు కౌశికుని వద్ద బ్రహ్మవిద్య నేర్వవలెనని తలంచెను. కౌశికుడు చాల సంతోషముతో అంగీకరించెను. ఆ తర్వాత హరిశ్చంద్రుడు పూర్తిగా మారిపోయెను.

కౌశికుడు శునశ్శేపుని దత్త పుత్రునిగా స్వీకరించెను. తన పుత్రులైన మధుచ్ఛందాదులను పేరు పేరున పిలిచి వారితో శునశ్శేపుని తమ అగ్రజునిగా పరిగణించవలెనని చెప్పెను. ''భృగు వంశమునకు చెందినవాడు. అతడిప్పుడు మీలో ఒకడు'' అని కౌశికుడు తన కుమారులతో చెప్పెను. తమ తండ్రి శునశ్శేపుని దత్తపుత్రునిగా స్వీకరించుట పెద్ద కుమారులకు యిష్టము లేకుండెను. వారి ప్రవర్తనకు తండ్రి ఆగ్రహము చెంది నీచ జాతిలో జన్మించునట్లు శపించెను. ఏబదిమంది పుత్రులు శాపగ్రస్తులైరి. మిగిలిన ఏబదిమంది పుత్రులు, మధుచ్ఛందునితో సహా తండ్రి పాదములపైబడి యిట్లనిరి. ''మీ ఆదేశమును శిరసావహించెదము. శునశ్శేపుని అగ్రసోదరునిగా స్వీకరించుటకు మేము సిద్ధమే''

తండ్రి సంతోషించి వారితో నిట్లనెను. ''మీరు చాల ఉత్తములు. మీ ప్రవర్తనకు మెచ్చుకొనుచున్నాను. శునశ్శేపునితో సహా మీరందరూ కౌశికులుగా వ్యవహారింతురు. లోకములో మన కుటుంబము వారు కౌశిక గోత్రోద్భవులుగా ప్రసిద్ధి పొందెదరు''.

కౌశికుడు మరొక వేయి సంవత్సరములు తపస్సు చేసెను. ఆ తర్వాత బ్రహ్మ ప్రత్యక్షమై యిట్లనెను. ''నీ తపస్సుకు అచ్చెరువొంది మెచ్చితిమి. నీకు 'ఋషి' పదమును ప్రదానము చేయుట మాకు సంతోషదాయకము''.

కౌశికునకు సంతృప్తి కలుగలేదు. 'ఋషి' బ్రహ్మర్షి కన్న తక్కువ స్థాయి యని అతడెరుగును. అతడు 'బ్రహ్మర్షి' కొరలచి మరింత ఘోరముగా తపస్సు చేయ మొదలిడెను.

123 కౌశికుని తప్పిదము

కౌశికుని తీవ్ర తపస్సుకు దేవతలు ఆందోళన చెందుచుండిరి. ఇంద్రుడు తన ఇంద్ర పదవికి భంగము కులుగునేమో యని భయపడెను. కౌశికుని తపమునకు భంగము కలిగింపనెంచి, మేనక యను అప్సరసను పిలిపించెను. ఇంద్రుడు మేనకతో యిట్లనెను. ''అప్సరస లందరిలో నీవు ఉత్తమురాలవు. నీవు నాకొక సహాయము చేయవలసి యున్నది. నీవేమి చేయవలెనో నీకు చెప్పెదను. కౌశికుడు తీవ్రమైన తపస్సు ఆచరించుచున్నాడు. అతడు మిట్ట మధ్యాహ్నపు సూర్యునివలె ప్రకాశించుచున్నాడు. అతడింత వరకు చేసిన తపస్సు చాల భయంకరమైనది. అతని తపస్సు విజయవంతమైనచో నా యింద్ర పదవికి ముప్పు వాటిల్లగలదు.

నీవు అతడు తపస్సు చేయుచున్న ప్రదేశమునకు వెళ్లుము. అతడు ఇంద్రియములను నిగ్రహించి, ఏకాగ్రతతో ధ్యానములో నిమగ్నుడై యున్నాడు. నీ అందముతో, హావ భావములు ప్రదర్శించి, పురుషులందరకు నున్న దౌర్బల్యము నూతగా తీసుకుని, అతడు నీ వ్యామోహములోపడి, తపస్సు విరమించునట్లు జేయుము అప్పుడు నిన్ను నేను మెచ్చుకొందును''

మేనక వెళ్ళుటకు భయపడి యిట్లనెను. ''దేవా! అతడు చాల శక్తిమంతుడనియూ, కోపిష్టి యనియూ వినియున్నాను తపశ్శక్తి , ఆగ్రహము, యీ రెండును కలిసిన పర్యవసాన మెట్లుండునో ఊహించవచ్చు! నేను యీ రెండింటిని యెట్లు తట్టుకొనగలను? నీవే అతనికి భయపడుచున్నావు, అటువంటిది నేను యే విధముగా అతని దగ్గరకు వెళ్ళగలను? అతడు వసిష్ఠ పుత్రులను శపించెను అతడు క్షత్రియుడైనప్పటికీ, స్వశక్తిచేత బ్రాహ్మణుడయ్యెను. బ్రహ్మవలె త్రిశంకు స్వర్గము సృష్టించెను అంతటి మహాతపస్వి తప్పకుండ ఇంద్రియముల కతీతుడై యుండును నేనెట్లు ధైర్యము చేసి అతని వద్దకు వెళ్ళగలను? అతడు నన్ను శపించిన నా గతి యేమి కావలయును? అతడు నన్ను శపించకుండునని నీవు అభయ మొసగినచో నీవు చెప్పినట్లు నేను చేయగలను. నాతో వసంతుని మన్మథుని పంపుము. మందానిలమును కూడ నాతో వచ్చునట్లు చేయుము అనురాగ భోగముల కనుకూల పరిస్థితులు కల్పించినచో, నేను అతనిని కవ్వించుటకు ప్రయత్నించెదను''

మేనక భూలోకమునకు వెళ్ళి కౌశికుడు తపస్సు చేయుచున్న పరిసర ప్రాంతములో, తగిన సమయము కొరకు వేచి యుండెను. కౌశికుడు ధ్యానము నుండి లేచి అటు నిటు తిరుగుచుండెను ఇదే తగిన సమయమని తలచి, మేనక విశ్వామిత్రుడు సంచరించుచున్న ప్రాంతమునకు వెళ్ళెను ఆమె ఊహ వమ్ము కాలేదు.

ఆమె అతడు సంచరించుచున్న ప్రాంతములో నడయాడుచుండుట జూచెను ఆమె అందమునకు హావభావములకు ముగ్ధుడై ఆమెకు వశమయ్యెను

ఇట్లు అయిదు సంవత్సరములు గడచెను. మరొక అయిదు సంవత్సరములు గడచెను. ఒకరోజు అతడు స్వప్నము నుండి మేల్కాంచినట్లు లేచెను పది విలువైన సంవత్సరములు వ్యర్థమయ్యెనని అతడు గ్రహించెను అతని తపస్సుకు భంగము కలిగెను అంతవరకు సమకూర్చుకొనిన తపశ్శక్తిని చాలవరకు కోల్పోయెను అతనికి విచారము, తనపై తనకు ఆగ్రహము కలిగెను. తర్వాత అతడు యిది దేవతల పన్నాగమనియు, యెవరైనను తీవ్రముగా తపస్సు చేసిన అందుకు ఆటంకమును కల్గింతురనియు గ్రహించెను. ఇట్టి పరిస్థితిలో నున్న కౌశికుని చూచిన మేనకకు చేతులలో బిడ్డ యుండగా, భయము ఆవహించెను అతని ఆగ్రహము తనపై ప్రసరించునేమోయని ఆమె భయపడెను ఆమె చేతులు జోడించి నిలుచుండెను ఆమె కనుల నుండి కన్నీరు కనురెప్పలపై నిలిచి 'యుండెను. కాని ఆమెపై కౌశికున కాగ్రహము లేకుండెను అతడామెతో తిరిగి తపస్సు కొనసాగించబోవుచున్నానని చెప్పెను

అతడు కౌశికీ నదీ తీరమునకు వెళ్ళెను అతని సోదరి సత్యవతియే కౌశికి అతడు భయంకర తపస్సు చేయుచుండెను చాల కాలము తర్వాత, దేవతలు బ్రహ్మ అతని తపస్సుకు మెచ్చిరి. బ్రహ్మ దేవతలతో కౌశికునకు ప్రత్యక్షమై యిట్లు పలికెను. ''కౌశికా! నీవు యిప్పుడు 'మహర్షి'వైనావు. చాల తీవ్రమైన తపస్సు ఆచరించినావు. నీవు ఋషులలో కెల్ల అత్యుత్తముడవు'' బ్రహ్మ వచనములు కౌశికునకు, సంతృప్తినిగాని, అసంతృప్తినిగాని కలిగించలేదు కౌశికుడిట్లనెను. ''నాతపశ్శక్తి చేత 'మహర్షి' పదవి నందుకున్నాను కాని,

మహాత్మా! నేను యింద్రియములను జయించితినా? దయచేసి తెలుపుడు''. బ్రహ్మ యిట్లనెను. ''బహుశః జయించ లేరనుకొందును. నీవు యింకను సంపూర్ణమైన జితేంద్రియుడవు కావు''. కౌశికుడు వదనము దించుకొనెను. బ్రహ్మ యిట్లనెను. ''నీవు అదికూడను సాధించుటకు ప్రయత్నించవలెను''.

అటు తర్వాత కొన్ని సంవత్సరములు అతిక్లిష్టమైన రీతిని కౌశికుడు తపస్సు చేసెను. అతడు చేతులు పైకెత్తి ఆహారము లేక తపస్సు గావించెను. గాలి మాత్రమే అతని ఆహారము. నడి వేసవి కాలములో పంచాగ్నుల మధ్య నిలుచుండి, శీతకాలములో జలము మధ్య నిలబడి తపస్సు చేసెను. అతని తపస్సు తీవ్రతరమయ్యెను. మరల ఇంద్రుడు అతని తపస్సుకు భంగము చేయనెంచి అప్సరస రంభను పిలిపించెను. అతడామెతో యిట్లనెను. ''ఇది వరకు మేనక చేసినట్లుగా, నీవు కౌశికుని నీ వశము గావించుకొనుము''. రంభ మిక్కిలి భయపడి ఇంద్రునితో యిట్లనెను. ''దేవా! నాకు వెళ్ళుటకు ధైర్యము చాలకున్నది. అతని ఆగ్రహము భరించరానిది''. ఇంద్రుడామెకు యెట్టి ప్రమాదము కలుగబోదని అభయ మొసంగెను. ఇది వరకు మేనక వెళ్ళినట్లే రంభ భూలోకమునకు వెళ్ళెను. ఇంద్రుడు, స్వయముగా తానే వచ్చి రంభకు సహాయముగా నుండగలనని చెప్పెను. కౌశికుడు తపస్సు చేయుచున్న ప్రదేశములోని వృక్షముపై కోయిలలు మధురముగా కూయుచుండెను. ఇంద్రుడు, మన్మధుడు అదే వృక్షముపై కూర్చుండిరి. రంభ, కౌశికుడు తపస్సు చేయు ప్రదేశము కేతెంచెను.

కౌశికుడు తీవ్ర ధ్యానములో నిమగ్నమై యుండగా కోయిల కూతలు అంతరాయము కలిగించుచుండెను. వసంత ఋతువులో పుష్పించు పువ్వుల గుబాళింపులు అతని నాసికను సోకెను. అతడు కళ్ళు తెరచెను. ఎదురుగా అందమైన రంభ నిలిచి యుండెను. కౌశికుడు యిది ఇంద్రుని పన్నాగమని తెలుసుకొనెను. లేకున్న వసంత ఋతువు రావలసిన దానికన్న ముందుగా యెట్లు వచ్చెనని తలంచెను. అంతేకాక అందమైన సుకుమార స్త్రీ యీ అరణ్యము లోనికి, వేరొకరు తీసుకురానిచో, యెట్లు రాగలదు? వెంటనే ఆగ్రహముతో రంభను శపించెను. ''ఇంద్రుని పనుపుపై నీవు యిక్కడకు వచ్చి నీ హావభావ విలాసములతో నన్ను వశపరచు కొనవలెననుకున్నావు. నా తపశ్శక్తిని హరింపజేయ జూచితివి. నీవు శిలగా మారి వేయి సంవత్సరములు యీ భూలోకములో నుండగలవు''. ఆమెను శపించిన తక్షణమే తన తొందరపాటుకు పశ్చాత్తాపము చెందెను. ''బ్రహ్మ చెప్పినది సత్యమే. నేను జితేంద్రియుడను కాను. ఆగ్రహమును నిగ్రహించుకొనలేకున్నాను. ఇంద్రియములను జయించనంత వరకు ఆత్మకు ప్రశాంతత చేకూరదు. ఇప్పటి నుండి ఆగ్రహము చెందక, ఒక్కమాట యైనను పలుకక యుండెదను. అన్ని భావములను బహిష్కరించి, మరల తపస్సు చేసెదను. అప్పుడే నేను చేసిన తపస్సుకు తగిన ప్రతిఫలము లభ్యము కాగలదు''.

124 బ్రహ్మర్షి విశ్వామిత్రుడు

కౌశికుడు ఉత్తర దిశ నుండి తూర్పుదిశగా వెళ్ళి అక్కడ తిరిగి తపస్సు ప్రారంభించెను. ఒక వేయి సంవత్సరములు అతడు మౌనముగా ఘోర తపస్సు ఆచరించెను. అతని తపోగ్నికి యీ లోకము, స్వర్గలోకము అట్టుడికి నట్లుడికి పోయెను. కౌశికుడు పుల్లవలె సన్నగా నయ్యెను. అనేక అవాంతరములను అతిక్రమించెను. తన మనస్సు నుండి క్రోధమును సంపూర్ణముగా విడనాడెను.

ఒకరోజు ఉపవాసము విరమించి అన్నము వండుకొనెను. అతడు తినబోవుచుండగా, ఇంద్రుడు ఒక బ్రాహ్మణుని వేషములో వచ్చి అన్నము పెట్టమని యాచించెను. ఒక్క మాటైనను పలుకక, తాను వండుకొనిన అన్నమును ఆ బ్రాహ్మణునికి పెట్టి, తిరిగి తపస్సు ప్రారంభించెను. అతడు మరింత తీవ్రముగా తపస్సు చేయనారంభించెను. అతడు పీల్చు శ్వాసను కూడ నిగ్రహింప దొడగెను. అతడిప్పుడు గాలిని పీల్చక చాలసేపు ఉండగలుగుచుండెను. అతని శిరస్సు నుండి పొగ వచ్చుట మొదలిడెను. అతని తపస్సు వేడిమికి లోకము క్షోభించుచుండెను. ఇంద్రాది దేవతలు బ్రహ్మ వద్దకు వెళ్ళి యిట్లనిరి. ''కౌశికుడు తన తపస్సు చేత అత్యంత తేజస్సుతో ప్రకాశించుచున్నాడు. ఇంత కాలముగ అతడు అభిలషించిన దానిని నీవు ప్రసాదింపకున్నచో, అతని తపస్సు వేడిమికి ముల్లోకములు నాశనము కాగలవు. తపస్సు చేత అతని తేజస్సు సూర్యుని అగ్నిని మించి యున్నది. అతని ప్రకాశము ముందు అగ్ని, సూర్యుడు తమ ప్రకాశమును గోల్పోయినట్లు గోచరించుచున్నారు. సముద్రములో అలలు ఉద్ధృతముగా నున్నవి. పర్వతముల నుండి అగ్ని చిమ్ముచున్నది. భూమి వణకుచున్నది. ఆకాశములో పెనుతుఫాను చెలరేగుచున్నది. కౌశికుడు కాలాంతాగ్ని వలె నున్నాడు. ఈ తీవ్ర పరిస్థితి నుండి లోకమును రక్షింపవలసిన బాధ్యత నీపై నున్నది''.

బ్రహ్మ త్వరగా కౌశికుని వద్దకు వచ్చి యిట్లనెను. ''బ్రహ్మర్షీ! నీకు స్వాగతము. నీ తపస్సు మమ్ములను మెప్పించినది. నీ అపూర్వమైన సాధన చేత బ్రహ్మర్షి పదవికి అర్హుడనైతివి. నీకు అభ్యుదయమగు గాక!''

కౌశికుని వదనమందు సంతోషము మెరసెను. బ్రహ్మకు సాష్టాంగ ప్రణామము గావించి యిట్లు పలికెను. ''నీవు నాకు ప్రసాదించినది సత్యమే యగుచో, నేను బ్రహ్మర్షినయినచో, మీ అనుగ్రహముచే నేను దీర్ఘకాలము జీవించినచో, వేదములు నన్ను బ్రహ్మర్షిగా గుర్తించునట్లు చేయుము. నాకొక కోరిక యున్నది. నీ కుమారుడైన వసిష్ఠుడు నన్ను బ్రహ్మర్షిగా గుర్తించవలెను''. వారు వసిష్ఠుని పిలువనంపగా అతడు వచ్చి, ప్రేమాభిమానముతో చిరునవ్వు నవ్వి కౌశికునితో యిట్లనెను. ''నీవు చాల గొప్పవాడవు. బ్రహ్మర్షివి. అందుకు సందేహము లేదు''. కౌశికుడు వసిష్ఠుని గౌరవించి సత్కరించెను. కౌశికుడు తన యిష్టము వచ్చిన ప్రదేశమునకు వెళ్ళుటకు పూర్తి స్వేచ్ఛ కలిగియుండెను. లోకములో యితరులకు మంచి చేయవలెనను తలంపు అతని మనస్సులో నుండెను. అందుచేత అతనికి 'విశ్వామిత్ర' నామధేయము సార్థకమయ్యెను.

125 నహుషుడు

పురూరవునకు ఆయువను పుత్రుడు కలడు. ఆయువునకు నలుగురు పుత్రులు. వారిలో నహుషుడు ప్రధానమైనవాడు. అతడు చాల ఉత్తముడు. రాజ్యమును చక్కగా పాలించుచుండెను. అతడు అన్ని దిక్కులందున్న రాజులను జయించి విశేషమైన సంపదను గడించెను. అతడనేక యజ్ఞములు చేసి ఇంద్రపదవి కర్హుడయ్యెను. ఒకప్పుడు, బ్రహ్మ హత్యాపాతకముచే ఇంద్రుడు బాధపడుచున్నప్పుడు, అతడు తాత్కాలికముగా మరుగున నుండవలసి వచ్చెను. ఆ సమయమున దేవతలు నహుషుని ఇంద్రుడుగా వ్యవహరించమని కోరిరి. ఇంద్రుడు బ్రహ్మహత్యాపాపము నుండి విముక్తిపొందునంతవరకు నహుషుడు ఇంద్ర పదవి చేబట్టుటకు అంగీకరించెను. తన పుత్రుడైన యయాతిని రాజుగా నియమించి, నహుషుడు స్వర్గములో ఇంద్ర పదవి నధిరోహించెను.

కొంత కాలమునకు నహుషునిలో అహంభావము పెరిగెను. అతడార్జించిన సంపద, లోకముపై తనకు కల్గిన అధికారము, అనేక యజ్ఞములను జరిపితినను భావము, దేవతలు వచ్చి తన్ను యింద్రుడుగా నుండమని కోరుట — యివన్నియు కూడి అతనిలో గర్వమును, అహంకారమును పెంపొందించెను. నహుషుడు గొప్ప మహారాజు, కాని అధికారము అతనిలో మదమును గర్వమును యినుమడింపజేసెను.

ఇంద్రునకొక ప్రత్యేకత గలదు. అతని పల్లకిని సప్తర్షులు మోసెడివారు. రాజ కార్యముపై నహుషుడు బయటకు పల్లకిలో వెళ్ళునపుడు ఋషులు ఆ పల్లకి మోసెడివారు. ఇది నహుషునకు యెంతయో సంతోషము కల్గించెను రాను రాను ఋషులు తనకు బానిసలను భ్రమలో నహుషుడుండెను. అధికార మదములో నున్న నహుషుడు, ఋషులు ఇంద్రపదవి యందున్న గౌరవముచేత అట్లు చేయుచున్నారని తలపక భూలోకములో నుండి వచ్చిన తనకు సేవకులుగా నున్నారని తలచుచుండెను.

దురదృష్టవశాత్తు అతని మదిలో మరియొక భావము తలయెత్తెను. ఇంద్రపదవి నేలుచుండుటచే శచీదేవిని తన భార్యగా స్వీకరించవచ్చునని తలచెను. ఆమె నివాసమునకు వెళ్ళుటకు నిశ్చయించుకుని పల్లకిని తెప్పించెను ఋషులు పల్లకి మోసుకొని రాగా, నహుషుడందు కూర్చుండెను ఆమె సౌధమునకు తొందరగా వెళ్ళవలెనని మనసు తొందర జేయుచుండెను. పల్లకిని తొందరగా ఋషులు తీసుకువెళ్ళుట లేదని భావించెను ప్రేమ జాడ్యములో పడినవాని మనస్సు ప్రయాణించు వేగముతో గాలి కూడ ప్రయాణించలేదు గదా! ఓర్పు కోల్పోయిన నహుషుడు ఋషులతో వేగముగా వెళ్ళుమని చెప్పుచూ 'సర్ప — సర్ప' యనెను. అగస్త్య మహర్షి అతని మనస్సులో మెదలు విషయము గ్రహించి, అతని అహంకారమును సహించలేక పల్లకి క్రిందకు దించెను అగస్త్యుడు నహుషునితో యిట్లనెను. ''ఓరి మూర్ఖుడా! నీవేమి మాట్లాడుచున్నావో, యేమి చేయుచున్నావో నీవెరుగవు. నీ అహంకారము సహింపరానిదయ్యెను. దీనిని నివారించుటకు ఒకే మార్గము కలదు. నీవు 'సర్ప—సర్ప' అని యున్నావు అట్లే అగుగాక. అయితే సర్పమువలె ఆహారము కొరకు తిరుగలేక, కొండచిలువ మాదిరి ఆహారము నీవద్దకు వచ్చువరకు పడియుండగలవు. ద్వైతవనమను అరణ్య ములో వేయి సంవత్సరములు ఆ విధముగా నుండగలవు''

శాపము పొందిన వెంటనే నహుషుని గర్వము మటుమాయమయ్యెను. అతి వినయముతో అతడిట్లనెను ''మిమ్ము అవమానించిన నన్ను శపించుట ఉచితముగా నున్నది. ఇంతకన్న కఠినమైన శిక్షకు అర్హుడను. కరుణా హృదయులైన మీరు తక్కువ శిక్షను విధించినారు నన్ను కరుణించి, నేను భూలోకములో యెంత కాలము ఉండవలెనో, శాపమెట్లు విముక్తి కాగలదో సెలవీయవలెను. మీ వంటి మహాత్ములు యిటువంటి శాపముల నిచ్చి, మావంటి వారిలో కలుగకూడని దుష్ట భావములను నివారింతురు అయితే విషమునకు విరుగుడు ఉన్నట్లు, శాప కారణము అంతరించినంతనే శాపమునకు విరుగుడు తప్పక యుండగలదు''.

నహుషుని స్థితి జూసి అగస్త్యుడు విచారించెను. ఉత్తముల ఆగ్రహము క్షణకాలమే యుండును. నహుషునితో అగస్త్యు డిట్లనెను. ''శాపము ఉపసంహరించుటకు వీలులేదు. ద్వాపర యుగములో కొండచిలువ రూపము వదలి స్వర్గమునకు తిరిగి రాగలవు నీ వంశములో యుధిష్ఠిరుడనే గొప్ప వ్యక్తి జన్మించును అతడు ధర్మమూర్తిగా విలసిల్లును అతడు నిన్ను శాపవిముక్తుని గావించును. అతని సోదరుని నీవు పట్టుకొనగా అతడు నీ వద్దకు వచ్చి తన సోదరుని విడిచి పుచ్చుమని కోరును. నీవు యుధిష్ఠిరుని ధర్మమును గురించి అడుగు ప్రశ్నలకు అతడు సరియగు సమాధానములు చెప్పగలడు అప్పుడు నీకు కొండచిలువ రూపము

పోయి, తిరిగి యీ స్వర్గమునకు రాగలవు''

పంద్రెండేడుల అరణ్యవాసములో పాండవులు ద్వైతవనమున వెళ్ళుచుండగా, అగస్త్యుడు చెప్పినట్లు జరిగెను ఆ విధముగా నహుషునకు శాపవిముక్తి కలిగెను.

126 వాగ్వాదము

వృషపర్వుడు అసురులను పాలించుచుండెను. అతని గురువు శుక్రాచార్యుడు. శుక్రాచార్యునికి కుమార్తె దేవయానిపై మిక్కిలి ప్రేమ వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ. దేవయాని శర్మిష్ఠ మంచి చెలికత్తెలు

ఒకరోజు దేవయాని, శర్మిష్ఠ స్నేహితురాండ్రతో జలకమాడుటకు నదీ తీరమునకేగిరి. వారు వస్త్రములను నది గట్టుపై నుంచి, నీటిలో జలకము లాడుచుండగా, మహాదేవుడు వృషభము నెక్కి తన సేవకులతో ఆకాశమున సంచరించుచుండుట జూచిరి పార్వతి మహాదేవుని ప్రక్కనే యుండెను. నదిలో జలకమాడుచున్న స్త్రీలందరూ సిగ్గుపడి, వడివడిగా నది ఒడ్డుకు వెళ్ళి వస్త్రములు ధరించిరి వారు నదిలో జలకమాడుచున్న పుడు చల్లగా వీచుచున్న గాలికి నది గట్టున పెట్టిన వస్త్రములు యెగిరి కలసిపోయెను తొందరలో వారు చేతికందిన వస్త్రములను తీసుకుని ధరించిరి. ధరించిన తర్వాత శర్మిష్ఠ దేవయాని వస్త్రములను ధరించినట్లు తెలుసుకొనెను. అక్కడ మిగిలియున్న రాకుమార్తె శర్మిష్ఠ వస్త్రములను దేవయాని ధరించవలసి వచ్చెను.

అంతవరకు శర్మిష్ఠపై ప్రేమాభిమానములు గల దేవయానికి అకస్మాత్తుగా కోపము ముంచుకు వచ్చెను శర్మిష్ఠ ప్రయత్న పూర్వకముగా చేయకున్నప్పటికీ, అట్లు చేసినదని దేవయాని తలంచి, శర్మిష్ఠతో నిట్లనెను ''నీవు అసుర స్త్రీవి నాకన్న అధము రాలవు. నేను బ్రాహ్మణ పుత్రికను నా దుస్తులను నీవు ధరించుటచే అవి కలుషితమైనవి నీకు మర్యాద తెలియదు'' రాకుమార్తె శర్మిష్ఠ, సహజముగా అసుర స్వభావము గలదగుటచే, దేవయాని అవమానకరమైన మాటలను విని సహించలేకపోయెను. ఆమె కోపముతో యిట్లనెను ''నీ గురించి నీవు గొప్పగా భావించకు, నీవు ఒక ముష్టివాని కుమార్తెవు నా తండ్రి కడకు వచ్చి నీ తండ్రి పడిగాపులు పడియుండును. ఎల్లపుడూ నా తండ్రిని పొగడుచుండును యజమాని కొరకు వేచి లాభము పొందుటకు, నా తండ్రికేది ప్రీతిని చేకూర్చునో దానిని చేయుటకు సిద్ధపడును. నీవు అతని పుత్రికవు నీ తండ్రి శుక్రుడు నా తండ్రి యిచ్చు దానధర్మములపై ఆధారపడి యున్నాడు నీ కోపమునకు ద్వేషమునకు లక్ష్యపెట్టు వారెవరూ యిక్కడలేరు! నా వంటి రాకుమార్తెతో నీవు పరుషముగా మాట్లాడుట చూడగా, ఆయుధము లేని మనిషి ఆయుధము కలవానితో తలపడిన రీతిగా నున్నది. నీవన్న నాకు లక్ష్యములేదు. ముష్టి అడుగుకొను నీవు నాతో యీ విధముగా మాట్లాడుట కెంత ధైర్యము'' శర్మిష్ఠకు కోపము ముంచుకు వచ్చి, ఆమె దేవయానిని గొట్టెను. ఆమె వస్త్రములను పట్టిలాగి, చేరువలోనే వాడుకలో లేని నూతిలోకి త్రోసివేసి, శర్మిష్ఠ తిరిగి నగరము చేరుకొనెను ''ఈ ముష్టి బ్రాహ్మణ స్త్రీ యిక చచ్చినట్లే'' యని శర్మిష్ఠ తనలో తాననుకొనెను ఇంటివద్ద జరిగిన విషయము ఆమె యెవరికినీ చెప్పకుండెను.

127 దేవయానిని రక్షించినరాజు

పురూరవ వంశములో జన్మించి ప్రఖ్యాతి పొందిన మహారాజు యయాతి. అతడు నహుషుని కుమారుడు. ఇంద్రుడు బ్రహ్మహత్యా పాపముతో ఇంద్రపదవిని తాత్కాలికముగా త్యజించినపుడు, నహుషుడు దేవతల కోరికపై ఇంద్రపదవిని చేబట్టి రాజ్యమును పుత్రుడైన యయాతికి అప్పగించెను. పురూరవునకు ఆయువను కుమారుడు గలడు. ఆయువు కుమారుడు నహుషుడు.

అందరి రాజుల వలె యయాతికి కూడ వేట యనగా ప్రీతి. అతడు వేటకై అరణ్యమునకు వచ్చెను. అతని అశ్వము అరణ్యములో చాల దూరము తీసుకుపోయెను. అతనికి అలసటచే దప్పిక కలిగెను. అతడు దూరములో నున్న నూతిని చూచి, అశ్వము నదలించగా అది బావి వద్దకు యయాతిని జేర్చెను. అతడు వంగి బావిలో చూడగా అందు నీరు లేకపోవుటచే పాడుకలో లేరని గ్రహించెను. అతడు విసుగుచెంది వెళ్ళబోవు సమయములో అతనికి దగ్గరలో నుండి వచ్చుచున్న మూలుగు వినిపించెను. ఆ మూలుగు బావిలో నుండి వచ్చుచున్నట్లు అతడు తెలుసుకొనెను. అతడు బావిలోకి వంగి చూడగా ఒక స్త్రీ కన్పించెను. ఆమె చాల అందముగా ప్రకాశించుచున్నట్లు అతనికి కన్పించెను. అతడు ఇరకాటపు పరిస్థితిలో చిక్కుకునెను. ఆమెకు సహాయ మత్యవసరమని గ్రహించెను. అతడు సరళముగా కరుణాపూరిత స్వరముతో యిట్లనెను. ''నీవెవరు? ఇక్కడ నుంచి సహాయము నర్ధించుచున్న నీ అందమైన చేతులను గాంచుచున్నాను. నీ చేతి వ్రేళ్ల గోరులు రాగి వలె యెర్రగా నున్నవి. నీవొక యువతివని తలంతును. నిన్ను బాధించునదేమి? ఎందుకు నీ నిట్టూర్పులు క్రోధము, విచారముతో నున్నవి? ఎండిపోయి గడ్డితో నిండిన యీ బావిలో నీవు యెట్లు పడినావు? నీవు యెవరి కుమార్తెవు? అగమ్య గోచరముగా నున్న యీ పరిస్థితిని వివరించి చెప్పుము''.

దేవయాని యిట్లనెను. ''అసురులకు దేవతలకు జరిగిన యుద్ధములో అసురులు గెలుచుచుండిరని నీవు వినియుందువు. మరణించిన అసురులను వారి గురువు శుక్రాచార్యుడు పునరుజ్జీవింప జేయుచుండెను. నేను ఆ శుక్రాచార్యుని కుమార్తెను. నీవు నాకు తెలియని పర పురుషుడవు. చూడగా యువకుని వలె అందముగా, శక్తిమంతుని వలె గోచరించుచున్నావు. నీవెవరు? ఎందుల కిచ్చటకు వచ్చితివి''.

యయాతి మహారాజు యిట్లనెను. ''నేను నహుష చక్రవర్తి కుమారుడను. నా పేరు యయాతి. చంద్ర వంశమునకు చెందిన వాడను. వేటాడగా అలసిపోయి దాహము తీర్చుకొనుటకు వచ్చితిని. బావిలో నీటి కొరకు రాగా నిన్ను చూచుట తటస్థించెను.

దేవయాని, తాను వివస్త్రనని చెప్పెను. ఆమె పరిస్థితికి రాజు విచారించి, తన యొడలిపై నున్న వస్త్రమును తీసి ఆమెకు అందునట్లు బావిలోనికి విసరెను. ఆమె ఆ వస్త్రమును ధరించి యిట్లనెను. ''ఇదిగో, నీవు వర్ణించినట్టే నా కుడిచేయి రాగి రంగు గోరులతో నున్నది. నీవు సత్పురుషుని వలె గోచరించుచున్నావు. నన్ను రక్షించుటకు విధి నిన్ను తీసుకువచ్చినట్లున్నది. నన్ను పైకి లాగి రక్షింపుము''. రాజు ఆమె కుడిచేతిని పట్టుకుని పైకి లాగెను. ఆమెను బావి నుండి బయటకు లాగి భూమిపై గూర్చుండబెట్టి యిట్లనెను. ''నీవు యిపుడు సురక్షితవుగా నున్నావు. నిస్సహాయముగా మరణింతునన్న భయము యిక లేదు. నీవు త్వరగా గృహము చేరుకొనగలవు''. దేవయాని కదలకుండెను. అతనివైపు చూచి ఆమె యిట్లనెను. ''నేను వెళ్ళు ప్రదేశ మింకేదియు లేదు. నేను నీతో వచ్చెదను''.

ఆమె మాటలకు యయాతి ఆశ్చర్యపడెను. అతడామెతో యిట్లు పలికెను. ''ఇంతకు ముందు నీవు శుక్రాచార్యుని కుమార్తెనని చెప్పితివి. ఇప్పుడు నీవు వెళ్ళుదగు ప్రదేశము లేదనుచున్నావు. నాకు యేమియూ బోధపడుటలేదు''.

''నీకు బోధపడుట లేదా?'' నవ్వుచు దేవయాని అడిగెను. ''నేను నీకు వివరించెదను. నేను అవివాహితను. నీవు నా కుడిచేతిని పట్టి లాగినావు. అందుచేత నీవు నాకు భర్తవైనావు. కాబట్టి నన్ను నీతో తీసుకువెళ్ళుట ఉచితము''.

యయాతి యిట్లు జవాబిచ్చెను. ''అది అసంభవము. నేను మహారాజును. క్షత్రియుడను. నీవు ఒక బ్రాహ్మణుని కుమార్తెవు. క్షత్రియుడు అగ్ర కులములో జన్మించిన వారిని పరిణయమాడుట అధర్మము''.

దేవయాని అతని మాటలను వినకుండెను. ఆమె యిట్లనెను. ''నిన్ను భర్తగా యెంచుకున్నాను. నీవు వన్నిపుడు నిరాకరించవచ్చు. కాని నా తండ్రి నిన్ను పిలువ నంపినపుడు, నీవు వచ్చి నన్ను చూడగలవు''. యయాతి ఆమెకు వీడ్కోలు చెప్పి తన నగరమున కేగెను.

128 దేవయాని పగ

దేవయాని ఒక చెట్టు క్రింద కూర్చుని యేడ్చుచుండెను. ఈ లోపుగా దేవయాని యింటికి రాకున్నందున శుక్రాచార్యుడు తన కుమార్తెను గురించి ఆందోళన పడుచుండెను. అప్పటికి సాయంకాలమయ్యెను. అతడు ఇక వేచి యుండలేకపోయెను. దేవయానిని వెదకి రమ్మని శుక్రాచార్యుడు సేవకురాలిని పంపెను. దేవయాని స్నేహితురాండ్రందరి యిళ్ళకూ వెళ్ళెను. కాని ఆమె జాడ తెలియలేదు. చివరకు వారందరు జలకమాడుటకు వెళ్ళిన నది వద్దకు వెళ్ళెను. అచ్చట ఒక చెట్టు క్రింద విచారించుచున్న దేవయానిని చూచెను. దేవయానిని సమీపించి ఆమె యిట్లడిగెను. ''ఏమి జరిగినది? ఎందుకేడ్చుచున్నావు? నీ కొరకు నీ తండ్రి ఆందోళన పడుచున్నాడు''. దేవయాని ఆమెతో శర్మిష్ఠకూ తనకూ జరిగిన వివాదమును తెలిపి యిట్లనెను. ''ఘూర్ణికా! నీవు వెళ్ళి నా తండ్రితో యిదంతయు చెప్పుము. ఆ రాక్షసి తండ్రి వృషపర్వుని నగరములో నేను కాలుబెట్టనని కూడ చెప్పుము''. ఆ సేవకురాలు తొందరగా శుక్రాచార్యుని వద్దకు వెళ్ళి జరిగిన విషయము పూసగ్రుచ్చినట్లు నివేదించెను. ఆమె సహజధోరణిలో జరిగిన దానికి కొంత కల్పనచేసి చెప్పుచు యిట్లనెను. ''ప్రభూ! దేవయాని అరణ్యములో నున్నది. ఆమె చచ్చిపడి యున్నది. రాజు కుమార్తె శర్మిష్ఠ ఆమెను చంపివేసెను''.

మతి చెడిన వానివలె శుక్రాచార్యుడు బయటకు వచ్చెను. దేవయాని మరణమునకు చింతించుచూ అరణ్యమునకు పరుగెత్తెను. ఆమె బ్రతికి యున్నట్లు కనుగొనెను. ఆమె ఒక చెట్టు నానుకొని యుండెను. తండ్రిని చూచిన దేవయాని బావురుమని విలపించెను. ఆమెను దగ్గిరకు తీసుకుని మిక్కిలి ఆదరాభిమానముతో యిట్లనెను. ''ఇది వరలో నేను చేసిన యేదో ఒక పాపమునకు యీనాడీ విధముగా బాధపడుచున్నాను''. దేవయాని ఓర్పు కోల్పోయి యిట్లనెను. ''పాపమో, గీపమో, అది వేరే విషయము. అది అంత ముఖ్యమైనది కాదు. తండ్రీ! నా మాట వినుము. వృషపర్వుని కూతురు పలికిన అవమానపు మాటలు నేను మరువలేకున్నాను.

''తండ్రీ! నీవు మహారాజుకు స్తుతిపాఠకుడవనియు, అతనిని పొగడుట తప్ప వేరేమియు చేయని వాడవనియు ఆమె అన్నది. నేను ఒక స్తుతిపాఠకుని పుత్రికనని, నీవొక ముష్టివాడవని, రాజు యిచ్చు దాన ధర్మములు స్వీకరించుట తప్ప తిరిగి నీవేమియు చేయుటలేదని చాల యీసడింపుగా మాట్లాడెను. ఆమె యీ విధముగా మాట్లాడునపుడు ఆమెలో కొట్టవచ్చునట్లు కన్పించిన అహంకారము, క్రోధము నేను మరువలేను. ఈ విధముగా నన్ను సూటిపోటి మాటలని నూతి వద్దకు యీడ్చుకు వెళ్ళి నన్ను నూతిలోనికి త్రోసివేసి తాను వెళ్ళిపోయెను. తండ్రీ! నాకు సమాధానము చెప్పుము. నేను స్తుతిపాఠకుని కుమార్తెనా? ఒక ముష్టివాని పుత్రికనా?''

శుక్రాచార్యుడు అశ్రువులు కార్చుచు ప్రేమ పూర్వకముగా దేవయానితో నిట్లనెను. ''కుమారీ! నీవు ముష్టివాని కుమార్తెవు కావు. ముల్లోకములందు నీ తండ్రిని కీర్తించుచుందురు. అంతేగాని నీ తండ్రి యెవరినీ పొగడదు, లోకములో అందరు రాజులు, వృషపర్వుడు, ఇంద్రుడు, యయాతి, మున్నగువారు జ్ఞానమే నా సంపదయని, లోకములో అందరికన్న నేను సంపన్నుడనని యెరుగుదురు''.

దేవయాని యిట్లనెను. ''అట్లయినచో, శర్మిష్ఠ పలికిన పలుకులకు నేను ఆమెను క్షమించలేదు. గౌరవములేని ప్రదేశమందుండుటకు నా కిష్టము లేదు. నేను నగరములో ప్రవేశించను''. తండ్రి ఆమెకు యెంతగానో నచ్చజెప్ప జూచెను. క్రోధము తగదని, ఉదారముగా నుండవలెనని తెలియజెప్ప ప్రయత్నించెను. కాని ఆమె వినకుండెను.

శుక్రునికి కుమార్తెయే సర్వస్వము. అతడు మరుచటి రోజు ఉదయము వృషపర్వుని వద్దకేగి ముందురోజు జరిగిన దుస్సంఘటనను వివరించి ఇట్లనెను. ''నా కుమార్తె సంతోషము తప్ప నాకు వేరే కోరిక లేదు. ఆమె వెళ్ళుచోటునకే నేను కూడ వెళ్ళెదను. ఆమె లేక నేను జీవించలేను''. వృషపర్వుడు శుక్రాచార్యుని వెంటబెట్టుకుని త్వరగా అరణ్యము చేరి దేవయానిని సముదాయించుటకు ప్రయత్నించెను. ఆమె పాదములపై బడి వృషపర్వు డిట్లనెను. ''నా సంపద, కీర్తి, శక్తి నీ తండ్రి అనుగ్రహముచే కల్గినవి. అతడు నన్ను విడిచి పెట్టి వెళ్ళినచో నేను ఆత్మహత్య చేసుకొనవలసి యుండును. నాకు వేరు మార్గము లేదు. దయచేసి అతడు నా వద్ద ఉండునట్లు కరుణించుము. నీవు యేది ఆజ్ఞాపించిన అది చేయుటకు సిద్ధముగా నున్నాను''. దేవయాని కొంతసేపు యోచించి యిట్లనెను. ''నీ కుమార్తె, మరొక వేయి మంది సేవికలతో కలసి నాకు దాసిగా నుండవలెను. నేను వెళ్ళుచోటుకు వారు నాతో దాసీలుగా వచ్చి యుండవలెను. నాకు యెవరో ఒకరితో వివాహము జరిగి వెళ్ళునపుడు నీ కుమార్తె నాతో దాసిగా అనుసరించవలెను''.

వృషపర్వుడు తన సేవికలలో ఒకరిని పంపి కుమార్తెను రప్పించెను. బ్రాహ్మణ పుత్రిక దేవయాని విధించిన షరతులన్నిటినీ రాకుమారి శర్మిష్ఠకు తెలియజేసెను. ఆమె అయిష్టతను సూచించు ఒక్క పలుకైననూ పలుకలేదు. ఆమె పరిచారకు లందరినీ కూడగట్టుకుని మౌనముగా తండ్రి సముఖమునకు వచ్చెను. ఆమె దేవయానిని సమీపించి సరళముగా నిట్లనెను. ''నేను దాసిని. ఈ పరిచారికలందరు నాతో వచ్చిరి. నీవు వెళ్ళు ప్రదేశమునకు నిన్ను అనుసరించి రాగలము''.

దేవయాని ఆమెను చూచి యేవగింపు స్వరముతో యిట్లడిగెను. ''పొగిడ్తలందుకునే వాని కుమార్తె ఒక స్తుతిపాఠకుని కుమార్తెకు దాసిగా యెట్లు రాగలదు? ఇది సంభవమా?''

శర్మిష్ఠ అదే స్వరముతో సరళముగా యిట్లు జవాబిచ్చెను. ''తనవారు క్లిష్ట పరిస్థితులలో నుండి విచారించునపుడు, వారి బాధలు, విచారము సమసిపోవుటకు ప్రయత్నించుట వారి కర్తవ్యము. పురాణ కాలములో యిట్లు చేయుట ధర్మమని చెప్పియున్నారు. ఈ ధర్మము ప్రతి మానవునికి వర్తించగలదు. ఈ ధర్మము ననుసరించుట రాజుకు అతని పిల్లలకు అత్యంత ప్రధానము. నా మూలముగా నా తండ్రికి ప్రజలకు యిక్కట్లు కలుగుట నాకిష్టము లేదు. కాబట్టి నేను నీకు బానిసగా నుండి విధేయురాలనై నీవు యెచ్చటకు వెళ్ళిననూ అనుసరించి వచ్చెదను.

దేవయాని తండ్రితో యిట్లనెను. ''తండ్రీ! నాకు సంతృప్తి కలిగినది. ఇక మనము నగరమునకు వెళ్ళుదము''.

ఎవరి ఆలోచనలలో వారుండిరి. వారందరు నగరము ప్రవేశించిరి. దేవయాని పంతము నెగ్గెను. ఆమె తన పంతము నెగ్గించుకున్నందుకు శుక్రుడు సంతోషించెను. వృషపర్వుడు మాత్రము విచారముగా నుండెను. రాజునకు గురువు అతి ప్రధానమైనవాడు. గురువైన శుక్రుడు విడిచి వెళ్ళనందుకు రాజు మనసు కొంత ఊరట జెందెను. శర్మిష్ఠ మనస్సులోని ఆలోచనలు యెవరికిని అంతుబట్టనివి. ఆమె కనులు దించుకుని యున్నప్పటికీ, ఆమె ముఖమందు ప్రశాంతత గోచరించుచుండెను. తండ్రి యెడల ఆమెకుగల విశేషమైన ప్రేమ చేత, ఆమె యేది చేయుటకైనను సంసిద్ధురాలయ్యెను.

129 యయాతి దేవయానిని వివాహమాడుట

అనేక దినములు గడచెను. ఒకరోజు, శర్మిష్ఠాది పరిచారికలతో గూడి అరణ్యమునకు వెళ్ళెను. వారు తమ శత్రుత్వమును మరచిపోయినట్లు గోచరించెను. అరణ్యములో వారు ఆడుచూ, పాడుచూ, నాట్యము చేయుచు గడపిరి.

ఆ అరణ్యమునకు మరల హస్తినాపుర రాజు యయాతి వచ్చెను. దూరము నుండి స్త్రీ సమూహమును జూచెను. తరువాత వారికి దగ్గరగా వచ్చెను. వారిలో యిద్దరు అందముగా నుండుట అతడు గమనించెను. వారిని నిదానముగా చూచిన తర్వాత, ఆ యిద్దరిలో నొకరిని తానిదివరకు చూచినట్లు గ్రహించెను. ఆమె, తాను నూతి నుండి రక్షించిన బ్రాహ్మణ వనిత. ఆనాటి సంఘటన గుర్తుకు వచ్చి తనలోతాను నవ్వుకొనెను. ఆనా డామె కుడిచేయి పట్టుకుని లాగుటచేత, తనను భార్యగా స్వీకరించమనెను. ఆమె నిజముగా అందమైనదే. కాని రెండవ ఆమె కూడ ఈమె అందమునకు సరితూగగలదు!

దేవయాని మణిఖచితాసనముపై గూర్చుండుట యయాతి గుర్తించెను. అందముగా నున్న రెండవ ఆమె శరీరముపై ఆభరణములు లేకుండుట అతడు గమనించెను. ఆమె దేవయాని పాదముల వద్ద కూర్చుని పాదముల నొత్తుచుండెను. ఆమె యెవరో తెలుసుకొనుటకు కుతూహలుడై, పూర్వ పరిచయమును పురస్కరించుకొని దేవయానిని సమీపించి ఆమెతో సంభాషించెను. అతడు అపరిచితునివలె నటించెను. అతడిట్లనెను. ''వేయి మంది వనితల మధ్య మీరిద్దరూ యితరులపై పెత్తనము చలాయించుచున్నట్లు గోచరించుచున్నది. నాలో కుతూహలము రేగెను. మీరెవరో తెలుసుకొనవచ్చునా?'' దేవయాని యిట్లు బదులు చెప్పెను. ''నేను

చెప్పెదను, జాగ్రత్తగా వినుము. అసుర గురువు శుక్రాచార్యునకు ఒక కుమార్తె గలదు. నేను అతని కుమార్తెను. ఈమె నాకు పరిచారకురాలు, నాకు బానిస. ఈమె నేనెక్కడ యుండిన అక్కడ ఉండును. అసుర రాజు వృషపర్వుని కూతురు యీమె''.

యయాతి అప్రయత్నముగా యిట్లనెను. ''ఆహా! ఏమి యీమె సౌందర్యము! స్వర్గములోని అప్సరసలుగాని, గంధర్వ కిన్నర వనితలుగాని యీమె అందమునకు సాటి రారు. ఇక మానవులలో యిటువంటి అందకత్తెను చూడలేదు. పద్మములవంటి ఆమె నేత్రములు లక్ష్మీదేవి నేత్రములు వలె విశాలముగా నున్నవి. ఆమె సౌందర్యము సంపూర్ణమైనది. రాజ భవనములో నుండవలసిన యీ రాకుమార్తె యేదో ముని శాపమునకో, దేవతల శాపమునకో తప్పక గురి అయి ఉండవచ్చును. లేకపోయిన, ఆమె నీకు బానిసగా నుండుటెట్లు సంభవము?'' దేవయాని, అతడు శర్మిష్ఠ అందమును పొగడుచు పలికిన మాటలు వినెను. అవి యామె కిష్టము లేకుండెను. ఆమె యిట్లనెను. ''ఈ లోకములో అన్నియు విధి ననుసరించి జరుగును. ఇది కూడను విధికృతమే యని తలచి ఆ విషయముపై ఆలోచనను విరమింపుము. నీవెవరో దయచేసి చెప్పుము. నీవు మహారాజువలె దుస్తులు ధరించినావు. చూడగా చక్కగ చదువుకున్న వానివలె గోచరించుచున్నావు. నీ పేరేమి? నీవెక్కడ నుంచి వచ్చితివి? నీవెవరి కుమారుడవు? దేనికొరకు నీవిక్కడకు వచ్చితివి?''

దేవయాని అహంభావముతో అడిగిన ప్రశ్నలకు తనలో తాను నవ్వుకుని, ఆమె తలంపులకు అనుగుణంగా నటించి ప్రదర్శించవలెనని తలచెను. అతడిట్లు పలికెను. ''నేను విద్యార్థిగా నున్నపుడు వేదశాస్త్రములు అధ్యయనము చేసితిని. నేను ఒక రాజును, ఒక చక్రవర్తి కుమారుడను. నేను చంద్రవంశములో ప్రసిద్ధిపొందిన యయాతి మహారాజును''. దేవయాని యిట్లడిగెను. ''ఏదైన ప్రత్యేక కార్యముపై యీ అరణ్యమునకు వచ్చితివా? శత్రువు నెవరినైనా జయించుటకు వచ్చితివా, లేక వేటయం దాసక్తి నిన్నీ అరణ్యమునకు తీసుకువచ్చెనా?'' యయాతి యిట్లు సమాధాన మిచ్చెను. ''నీ ఊహ సరియైనది. నేను వేటకై వచ్చితిని. నాకు దాహము కలుగుటచే నీ పరిచారికా బృందమును సమీపించితిని. దప్పిక తీర్చుకొని సేద తేరుటకు నీ వద్దకు వచ్చితిని. నన్ను గురించి సంపూర్ణముగా తెలుసుకున్నావు. నేనేమి చేయవలెనో చెప్పుము''.

దేవయాని యిట్లనెను. ''నిన్ను నా భర్తగా యెంచుకున్నాను. నన్ను నీ భార్యగా స్వీకరించుట కంగీకరిపుము''. యయాతి నేత్రములు శర్మిష్ఠ అందమును గ్రోలుచుండెను. శర్మిష్ఠ తన భార్య కావలెనని యయాతి తలంచెను. దేవయాని సూచనకు అతడు విశ్వేష్టుడై యిట్లనెను. ''నేను నిన్ను వివాహమాడుట ఉచితము కాదు. నేను క్షత్రియుడను. నీవు బ్రాహ్మణ వనితవు, ఉత్తముడుగా పేరు గాంచిన శుక్రాచార్యుని పుత్రికవు. అవివాహితవైన నీతో నేనిట్లు సంభాషించుట నీ తండ్రి అంగీకరింపక పోవచ్చునని నా భయము. ఏ పురుషుడును, మరొకరి భార్యనుగాని, కుమారుని భార్యనుగాని, ఉత్తమ కులమునకు చెందిన స్త్రీనిగాని, స్వగోత్ర సంభవయైన స్త్రీనిగాని, సోదరినిగాని, పేద స్త్రీ, లేక రోగముతో బాధపడుచున్న స్త్రీనిగాని సమీపించుట అనుచితమని జ్ఞానులందురు. అందుచే నీ మాటలను నేను స్వీకరించలేను''.

దేవయాని ఓర్పును కోల్పోయి యిట్లు పలికెను. ''నాకును శాస్త్ర జ్ఞానము కలదు. బ్రాహ్మణులు క్షత్రియ కన్యలను వివాహమాడిన సందర్భములు నేనెరుగుదును. క్షత్రియులు బ్రాహ్మణ కన్యలను వివాహమాడిన సందర్భము లనేకము కలవు. ఈ రెండు సుమారుగా ఒకటియే. ఈ రెండు వర్ణముల మధ్య యెక్కువగా తర తమ భేదము లేదు. నీవు నహుషుని కుమారుడవు, అనగా నీవు ఒక ఋషి కుమారుడవు. నీ భార్యగా

నన్ను గైకొనుము''.

వారిద్దరు యిట్లు మాట్లాడుకొనుచు మిగిలిన వారికి దూరముగా సంచరించుచుండిరి. దేవయాని మరల యిట్లనెను. ''నేను నూతిలో నిస్సహాయస్థితిలో నున్నపుడు నీవు వచ్చి నా కుడిచేయి పట్టుకుని బయటకు లాగితివి. నీవు పట్టిన నా కుడిచేతిని యే బ్రాహ్మణ యువకుడు ముందుకు వచ్చి చేబట్టగలడు? ఆనాడే నీవు నా భర్తవని నా నిశ్చయమును తెలిపియున్నాను''.

యయాతి మరొక కారణము చూపుటకు ప్రయత్నించి యిట్లనెను. ''బ్రాహ్మణుని ఆగ్రహశక్తియెంతటిదో నీకు తెలియనట్లు తోచుచున్నది. క్రుద్ధసర్పము విషముగాని, వాడి ఆయుధములచే కలుగుబాధగాని, మంటలు చుట్టుముట్టినపుడు కలిగే నిస్సహాయ స్థితిగాని, బ్రాహ్మణుని ఆగ్రహావేశముచేత కలిగే ప్రమాదమునకు సాటి రావు''.

''క్రోధావిష్టుడైన బ్రాహ్మణుడెవరు?'' ప్రేమలో పడిన దేవయాని ఆక్రోశించెను. ''నీ మాటలు నాకర్థ మగుటలేదు''.

యయాతి యిట్లనెను. ''పాము తనకు హాని తలపెట్టినపుడు మాత్రమే యెదుటివారిని కరచును. ఆయుధమును ప్రయోగించినపుడే అది యెదుటివారికి బాధ కలిగించును. కాని బ్రాహ్మణుని ఆగ్రహము వ్యక్తిని, అతని రాజ్యమును, సేనా బలమును సంపూర్ణముగా నాశనము గావించును. నిన్ను వివాహమాడగలనని మాట నీయజాలను. ఎందుకనగా నీ తండ్రి నన్ను నా తరువాతి తరము వారిని కూడ శపించలగడు. నీ తండ్రి స్వయముగా నిన్ను నాకిచ్చి వివాహము చేసిన తప్ప నేను నీ ప్రేమ నంగీకరించలేను''. ఈ మాటలు విన్న దేవయాని వదనము సంతోషముతో వికసించెను. ఆమె యిట్లనెను. ''నీవు ఆ విషయమై భయపడవలసిన పని లేదు. కొంచెముసేపు ఆగుము. నా తండ్రిని కలుసుకొనుము''. ఆమె పరిచారికను పిలిచి ''వెంటనే వెళ్ళి మా తండ్రిని పిలుచుకుని రమ్ము'' అని చెప్పి పంపెను.

వెంటనే శుక్రాచార్యుడు వచ్చెను. మిక్కిలి తేజస్సుతో ప్రకాశించుచున్న శుక్రాచార్యుని చూచినంతనే యయాతి శుక్రుని పాదములపైబడి అతని పాద ధూళిని శిరస్సు నందుంచుకుని యిట్లనెను. ''నేను నహుషుని కుమారుడను. నా పేరు యయాతి''.

దేవయాని తండ్రి వదనమందు వింత దృక్కులను చూచి యిట్లనెను. ''తండ్రీ! నీకు జ్ఞాపక మున్నదా? ఆరోజు నేను నూతిలో పడినపుడు ఆ రోజంతయు నీవు నా కొరకు వెదికినావు. నీవు నేనొక చెట్టు క్రింద కూర్చుండగా చూచినావు. అపుడు, ఒక ఉదారపురుషుడు వచ్చి నన్ను బయటకు లాగి రక్షించినాడని చెప్పినాను. జ్ఞప్తియున్నదా? ఈతడే ఆ ఉదార పురుషుడు. ఇతడు నా కుడిచేయు పట్టుకుని నూతి అట్టడుగు నుండి బయటకు లాగెను.

''ఇది వరకెవరును నా కుడిచేయిని పట్టుకొనలేదు. నన్ను యితనికిచ్చి వివాహము చేయమని కోరుతు న్నాను. నా భర్తగా యితనిని యెంచుకున్నాను''.

శుక్రుడు సంతోషించినట్లు కన్పించుటకు ప్రయత్నించెను. అతడిట్లనెను. ''అతడు క్షత్రియుడు. నీవు బ్రాహ్మణ స్త్రీవి. మీరిద్దరు వేరు కులములకు చెందినవారు. బ్రాహ్మణ క్షత్రియ ధర్మములు వేరు. ఇది

నాకు ఆందోళన కలిగించుచున్నది. కాని, కుమారీ! నీవు అతనిని భర్తగా యెంచుకున్నావు. నీ కోరికను నెరవేర్చెదను''.

శుక్రుడు యయాతివైపు తిరిగి యిట్లనెను. ''ఆమె నిన్ను వరించినది. ఆమెను నీవు రాణిగా స్వీకరించవచ్చును. ఆమెను నీకు కన్యాదానము చేయుట నా కంగీకారమే. నాపుత్రికను చేబట్టుము''.

యయాతి యిట్లనెను. ''ఓ భార్గవా! నీవు చాల ఉత్తముడవు. కాని నాకు సంకోచము కలుగుచున్నది. ఈ విధముగా వివాహమాడుట అధర్మమని తోచుచున్నది. జాతి సంకరము మహాపాపము. ఇట్టి పాపము చేయుట నా కిష్టములేదు. అందుచేతనే నేను సంకోచించుచున్నాను''. యయాతి పలుకులు శుక్రునికి ప్రీతికలిగించెను. అతడిట్లనెను. ''ఈ వివాహము వలన నీకెట్టి పాపము కలుగదు. దేవయానిని భార్యగా స్వీకరించు. నీపై ఆమెకు యెనలేని ప్రేమ గలదు. ఆమె నిన్ను సుఖపెట్టగలదు''

అపురూపమైన దూరదృష్టితో శుక్రుడు రహస్యముగా యయాతితో నిట్లు పలికెను. ''నా కుమార్తెతో నున్న యువతి శర్మిష్ఠ. ఆమె వృషపర్వుని కుమార్తె. ఎట్టి పరిస్థితులలోను నీవు ఆమెను ప్రేమించుటగాని, ఆమె గురించి ఆలోచించుట గాని చేయ తగదు. దేవయానిని తీసుకువెళ్ళి ఆమెను సుఖపెట్టుము''. ''ఆమెను సుఖపెట్టుటకు ప్రయత్నించెదను'' అని యయాతి బదులు చెప్పెను.

దేవయాని—యయాతి వివాహము శాస్త్రోక్తమైన విధులతో జరిగెను. యయాతి దేవయానిని తన రాజ్యమునకు తీసుకువెళ్ళెను. ఆమెతో శర్మిష్ఠ, మిగిలిన వేయి మంది పరిచారికలు కూడ వెళ్ళిరి.

130 శర్మిష్ఠ

యయాతి దేవయానిని అతఃపురమునకు తీసుకువెళ్ళెను. ఆమె అచట సుఖముగా నుండెను. ఆమెతో వచ్చిన శర్మిష్ఠ అశోకవనములో నిర్మించిన చిన్న గృహములో నివసించుచుండెను. అశోకవనము రాజ సౌధమున కానుకొని యుండెను. దేవయాని యిదివరకు విధించిన షరతుల ప్రకారము వేయిమంది పరిచారికలు కూడ వచ్చిరి. యయాతి దేవయానితో సుఖముగా కాలము గడపుచుండెను. కొంతకాలమునకు వారికొక పుత్రుడు కలిగెను.

ఒకరోజు శర్మిష్ఠ అశోకవనములో సంచరించుచుండెను. ఆమె హృదయమంతయు విచారముతో నిండి యుండెను. ఆమె తన విధికి వగచుచుండెను. తనను దేవయానితో పోల్చి చూచుకొనెను; దేవయానికి అందమైన భర్త, ముద్దులు గొలిపే కొడుకు నుండిరి. దేవయాని స్త్రీత్వము సఫలమయ్యెను. శర్మిష్ఠ యింకను కన్యగానే మిగిలిపోయెను. చిన్నతనములో చేసిన చేష్టలకు పర్యవసానముగా యిట్లు జరిగెను కదాయని ఆమె తలపోయు చుండెను. జరిగిన దానిని తలచుకుని లాభము లేదు. కాని ఆరోజు యెందుంకో ఆమె మిక్కిలి విచారముగా నుండెను. అశోకవనములో ఒక చెట్టు నానుకుని ఆమె నిలిచియుండెను. ఆమెలో ఆలోచనలు విచ్చలవిడిగా వెల్లి విరియుచుండెను. ఆ చెట్టు బాగుగా వికసించి యుండెను. చెట్టు కొమ్మలకు నారింజ పూవులు మొగ్గలు గుత్తులు గుత్తులుగా క్రమ్ముకొని యుండెను. ఆమె చెట్టు నానుకుని నిలబడి చేతులతో కొమ్మలను

తాకుచుండెను.

యయాతి అశోక వనమునకు కాకతాళీయముగా వచ్చెను. అతడు, శర్మిష్ఠ చెట్టు నానుకుని యుండుట జూచెను. చాలసేపు అతడక్కడే నిలిచి యుండి ఆమెను చూచుచుండెను. ఇంత అందమైన యువతిని అతడిదివర కెన్నడును చూడలేదు. చాల కాలము క్రితము దేవయానితో వివాహము జరుగక మునుపు, ఆమె యందు ప్రేమ కలిగి యుండెను. అతడు భార్య దేవయానితో సుఖించుచుండెను. కాని అతని హృదయము శర్మిష్ఠకు అంకితమైనది. శుక్రాచార్యుడు హెచ్చరిక చేయుటబట్టిగాని, లేకున్నచో యెన్నడో ఆమెను వివాహమాడి యుండెడివాడు. అతడు చాల ధర్మపరాయణుడు. చేసిన వాగ్దానమును భంగపరచుట అతని కిష్టము లేకుండెను. బ్రాహ్మణుని ఆగ్రహమునకు గురికాగలనేమోనను భయము కూడ కలదు. ఈ కారణముచేత శర్మిష్ఠపై ప్రేమ గురించి యెన్నడును ఆలోచించలేదు. ఈరోజు ఆమెను ఒంటరిగా చూచుట తటస్థించెను. ఆమె అందము అతనిని ముగ్ధుని చేయుచుండెను. అతడు కదలక స్తంభించినట్లు అచ్చటనే నిలుచుండెను.

శర్మిష్ఠ ప్రక్కకు తిరిగెను. కొద్ది దూరములో రాజు నిలబడి యుండుట ఆమె జూచెను. కొలది మాసములుగా ఆమె అతనిపై ప్రేమను పెంచుకొనెను. ఆరోజు అరణ్యములో దేవయాని పాదము లొత్తుచున్నప్పుడు అతడు వచ్చినప్పటి నుండి ఆమెకు అతనిపై ప్రేమ కలిగెను. అతని చూపులను బట్టే అతనికి తనపై ప్రేమ కలదని ఆమె గ్రహించెను. కాని దేవయాని అతనిని భర్తగా యెంచుకొనెను. నూతన దంపతులతో తాను యీ రాజ్యమునకు వచ్చెను. ప్రతిదినము రాజును చూచుచు — అతని గురించిన ఆలోచనలతో సతమత మగుచు బాధపడుచుండెను.

ఆమె అతనిని చూచి, చేతులు జోడించి నమస్కరించెను. ఇద్దరు అట్లే కొంతసేపు నిలుచుండిరి. తరువాత ఆమె యిట్లనెను. ''నీవు మహారాజువు, దైవమువలె, నీపై ఆధారపడినవారి ప్రార్థనలను విని వాటిని ప్రసాదించుచున్నావు. నాకొక సహాయము చేయగోరుచున్నాను''.

''ఏమిటి నీ కోరిక?'' అనునట్లుగా రాజు కనురెప్పలను పైకెత్తెను. ఆమె యిట్లనెను. ''నన్ను నీ భార్యగా గైకొనుము''.

యయాతి యిట్లనెను. ''నీవెవరో నేనెరుగుదును. నీవు వృషపర్వుని కుమార్తెవు. నా భార్యతో పరిచారికగా వచ్చినావు. నిన్ను చూచినప్పటి నుండి నేను మరువలేకున్నాను. నీవు చాల అందమైన దానవు. నీకు సాటియైన వారు లేరు. కాని శుక్రాచార్యుడు నీపై యెట్టి ఆలోచనలు పెట్టుకొనవలదని నన్ను హెచ్చరించెను. అతనికి వాగ్దానము చేసియుండుటచే యింతవరకు నీకు నేను దూరముగా ఉంటున్నాను.

శర్మిష్ఠ నవ్వి యిట్లనెను. ''శాస్త్రములతో మిక్కిలి పరిచయమున్న నీ వంటి వారికి అయిదు సందర్భములలో అసత్యము లాడవచ్చునన్న విషయము తెలియదా? పరస్పరము ఒక స్త్రీ ఒక పురుషుడు ప్రేమించుకున్నప్పుడు పురుషుడు అసత్యము పలుకవచ్చునని, అని నేళాకోళముగా మాత్రమే యెంచవలెనని అందురు. పురుషుడు స్త్రీని చేబట్టునపుడు అసత్యము లాడుట అధర్మము కాదు. అవి అసత్యములుగా పరిగణింపరు. వివాహ సమయమందు అసత్యములాడుట అనుచితము కాదు. ప్రాణమునకు ముప్పు సంభవించి నపుడు, ప్రాణ రక్షణ కొరకు అసత్యమాడుట దోషము కాదు. సంపద గోల్పోవుచున్నపుడు అసత్యము లాడవచ్చును. ఈ సందర్భముగా అసత్యము పలికిన అది అధర్మ మనిపించుకొనదు.

''ప్రభూ! నీ భార్యకు నేను దాసిని. ఆమెకు చెందినది మీకు కూడ చెందును ఆ విధముగా మీకు నేను యిది వరకే చెంది యున్నాను కాబట్టి నన్ను స్వీకరింపుడు. ప్రతిరోజును నగర వీధులలో 'ఎవరేది కోరినను నేను దానిని ప్రసాదింతును' అని ప్రకటించుచున్నారు. అది అసత్యమును ప్రకటించుటకాదు గదా'' రాజు చిరునవ్వు నవ్వి అంగీకారము సూచించెను క్షత్రియులకు వర్తించు గాంధర్వ పద్ధతిలో వారు భార్యాభర్తలైరి.

కొంతకాలమునకు వారికొక కుమారుడు జన్మించెను శర్మిష్ఠతో రాజు సుఖముగా గడపుచుండెను. అతడు తనలో తానిట్లు తలంచెను. ''రాజ్యమునకు సంపద యెట్లో, మోడువారుచున్న మొక్కలకు వర్షపు నీరు యెట్లో, దేవతలకు అమృతము యెట్లో, యీమె నాకట్లున్నది. ఈ శర్మిష్ఠ అందాలరాశి, నా సుఖము కొరకే జన్మించినట్లున్నది''.

శర్మిష్ఠకు కుమారుడు జన్మించెనని వినిన దేవయానికి, ఆమె భర్త యెవరై యుండురాయను కుతూహలము జనించెను ఆమె ఊహించుటకు ప్రయత్నించెను చివరకు ఉండబట్టలేక, శర్మిష్ఠ వద్దకు వెళ్ళి సూటిగా ఆమె నడిగెను. ''ఏమిటి నీవు చేసినది? కామమునకు దాసినవై మాన మర్యాదలను మరచినావా? ఎవరు నిన్ను చేబట్టి తల్లిని గావించినారు? ఇటువంటి సిగ్గుమాలిన పని నీవెట్లు చేసితివి?'' రాకుమారి శర్మిష్ఠ యిట్లనెను ''అదృష్టవశాత్తు ఒక ఋషి వచ్చుట తటస్థించెను నేను అవివాహిత కన్యనని నీకు తెలుసు. అది పాపము. వివాహము కాని స్త్రీ, సంతానములేని స్త్రీ జీవితము వ్యర్థమని శాస్త్రములు చెప్పుచున్నవి. తరువాత జన్మలో కూడ వారి జీవితము వ్యర్థమేయగును. అందుచేత నేనతనిని నాకు పాప విముక్తి కలిగించమని కోరినాను. అదీ జరిగిన సత్యము నన్ను పురికొల్పినది పాప భయము కాని, కామవాంఛ కాదు

''అట్లయినచో నీవు చేసినది చాల సముచితముగానే యున్నది'' అని రాణి దేవయాని పలికెను. ''ఇందులో తప్పేమియూ లేదు. ఆ ఋషి యెవరో చెప్పుము అతని పేరేమి? గోత్రమేమి?

''సూర్యుని తేజస్సుతో సమానమైన తేజస్సు గలవాడు'' అని రాకుమారి పలికెను ''అతని శక్తి సౌశీల్యము నన్ను ముగ్ధుని గావించెను అతని పేరు గోత్రము అడుగలేకపోతిని''

ఆమె సమాధానము దేవయానికి సంతృప్తి కల్గించకుండెను కాని దేవయాని ఆ విషయమై యెక్కువగా ఆలోచించలేదు. ఆమె అంతఃపురమునకు వెళ్ళిపోయెను. శర్మిష్ఠ గండము గడిచినట్లు భావించి నిట్టూర్చెను.

దేవయానికి యిద్దరు పుత్రులు కలిగిరి వారు — యదు, తుర్వసులు తండ్రివలె వారు అతి సౌందర్యముగా నుండిరి రాజభవనములో అందరకును వారు ముద్దుల బాలురైరి

దేవయాని మద్యపానమున కలవాటుపడెను మైకములో భర్తను పరుషవాక్కులతో దూషించుచుండెను తరుచుగా ఆమె యేడ్చుచుండెను. ఒకొక్కపుడు గానము, నాట్యము చేయుచుండెను. ఒళ్లు తెలియని స్థితిలో ఆమె యిట్లనుచుండెను. ''నిర్జనమైన యీ అరణ్యమునకు నీవెందుకు వచ్చితివి? రాజ వేషము ధరించి యేల నా వద్దకు వచ్చెదవు? నీవు బ్రాహ్మణుడవు, కాని రాజ వస్త్రాలంకారములను ధరించితివి నా భర్త యయాతి పురుషులందరిలో శ్రేష్ఠుడు. అతడు నిన్ను చూచినచో ఆగ్రహించును వెంటనే యిక్కడినుండి వెళ్ళిపో''.

తన సమక్షము నుండి రాజు వెళ్ళిపోవునట్లు ఆమె చరించుచుండెను ఆమెను తిరిగి పూర్వపు దేవయాని

వలె చేయుటకు ప్రయత్నించెను. కాని అతని ప్రయత్నములు విఫలమయ్యెను. ఆమె మైకములో నున్నపుడు కనిపెట్టి జాగ్రత్తగా చూచుటకు పాత పరిచారికలను నియమించెను. ఆమె ప్రస్తుత పరిస్థితిని తన స్వార్థము కొరకు వినియోగించదలచెను. ఆమె మద్యము యెక్కువగా సేవించునట్లు ప్రోత్సహించుచుండెను. ఆమెకు కావలిగా వికలాంగులైన పరిచారికలను యేర్పరచెను. ఆమె బాగుగా మైకములో నున్నపుడు, అక్కడ నుండి తప్పించుకుని, అశోకవనము వెళ్ళి, తన ప్రియమైన శర్మిష్ఠతో గడుపుచుండెను.

ఇట్లు చాలకాలము దేవయానికి తెలియకుండ గడచెను. శర్మిష్ఠకు ముగ్గురు కుమారులు కలిగిరి. వారు — ద్రుహ్యుడు, అనువు, పూరువు అనువారు.

ఒకరోజు దేవయాని రాజుతో అశోకవనమునకు వెళ్ళెను. అక్కడ ఆ ముగ్గురు బాలురు ఆడుకొనుచుండగా ఆమె చూచెను. వారి అందమున కచ్చెరువంది, రాజుతో ఆమె యిట్లనెను. ''నాథా! వారెంత అందముగా నున్నారో చూడుము! వారెవరై యుందురు? స్వర్గలోకము నుండి వచ్చినట్లు కన్పించుచున్నారు. వారి అందము అసమానమైనది. గమనించి చూడగా, వారిలో నీ పోలికలు కానవచ్చుచున్నవి''.

అతని వద్ద నుండి యెట్టి సమాధానము లేకపోవుటచే, ఆమె ఆ బాలురను సమీపించి, వారితో నున్న పరిచారికను 'యెవరు వీరు' అను కుతూహలము తెలుపు దృక్కులతో చూచెను. ఆ పరిచారిక నవ్వి యిట్లనెను. ''బాలకులారా! ఈమె మీరెవరో తెలుసుకొన గోరుచున్నది. ఆమెకు చెప్పండి''. ఆటలాడుచున్న ఆ బాలురు దేవయానిని చూచి యిట్లనిరి ''మా తండ్రి ఒక ఋషి, అతడు రెండు కులములకు చెందినవాడని మా తల్లి చెప్పెను. మా తల్లి శర్మిష్ఠ''.

దేవయాని తనను తాను సముదాయించుకుని యిట్లడిగెను. ''మీ తండ్రిపేరేమి? అతడే గోత్రమునకు చెందినవాడు? అతడెక్కడ ఉండునో తెలియునా?'' వారు దేవయానివైపు చూచి, దూరముగా నిలుచుని యున్న యయాతిని చూపుడు వ్రేలుతో చూపిస్తూ ''అతడే మా తండ్రి'' యని పలికిరి.

131 దేవయాని ఆగ్రహము, శుక్రశాపము

దేవయాని ఆ బాలురను తనతో తీసుకువెళ్ళి రాజు ముందు నిలబెట్టెను. యయాతి, దేవయానికి అప్రియము కలిగించుటకు భయపడి, ఆ బాలురవైపు చూడకుండెను. ఈ విధమైన తండ్రి వైఖరిని ఆ బాలురు యిదివరలో చూడనందున, వారు తమ తల్లివద్దకు వెళ్ళి యేడ్వసాగిరి. వారు తల్లితో యిట్లనిరి. ''అమ్మా! నాన్నగారి ప్రవర్తన యీరోజు విడ్డూరముగా నున్నది. మమ్ములను పలుకరించి మాట్లాడలేదు'' శర్మిష్ఠ బయటకు వచ్చి దూరముగా నున్న రాజును చూచెను. అతనితో మహారాణి దేవయాని ఉండుట ఆమె చూచెను.

దేవయాని అంతయూ గమనించుచుండెను. ఆమె కిప్పుడు అంతయు బోధపడెను. ఆమె రాజువైపు మరల చూచెను. అతడు మౌనముగా నిలిచి యుండెను. అతడు తలదించుకుని సిగ్గుతో కుంచించుకుపోయెను.

దేవయాని శర్మిష్ఠ వద్దకు వెళ్ళి ఆమె చేతిని మొరటుగా తన చేతితో లాగి యిట్లనెను. ''చాల కాలము క్రిందట నీ పుత్రుని తండ్రి యెవరని అడిగినపుడు ఒక ఋషి అని చెప్పి నన్ను మోసగించినావు. ఆ 'ఋషి'

యీ రాజేయని యీనాడు నేను గ్రహించినాను. నీవు నా బానిసవు. నీకై నీవు స్వేచ్ఛగా వర్తించుటకు హక్కు లేదు. నీవు నన్ను అడిగి యున్నట్లైన నీకు మంచి భర్తను తెచ్చియుండుదానను. నా యెడల నీకు భయము లేదు. నీ ప్రవర్తన సరిగా అసుర ప్రవర్తనవలె నున్నది''. శర్మిష్ఠ సరళ స్వరముతో యిట్లనెను. ''నేను ఋషి అని చెప్పుటలో అసత్యము లేదు. అతడు రాజర్షియని లోకములో అందరకూ తెలియును. నా ప్రవర్తన నియమ నిబంధనం పరిధిలోనే యున్నది. నీవు నీ భర్తను యెంచుకున్నట్లే, నీ బానిసగా నేను కూడ అట్లే చేసితిని. నీవు అతనికి చెందినావు కాబట్టి, నీ బానిసనైన నేను కూడ అతనికి చెందినదాననే. నీవు నా తండ్రి గురు కుమార్తెవు. నా తండ్రి నీ తండ్రిని గౌరవించినట్లే నేను నిన్ను గౌరవించుచున్నాను. నీ భర్త నీ నుండి గౌరవము నాశించినట్లే నానుండి కూడ ఆశించును. వివాహము మూలముగా నీ పతని దాసవైనావు. నీ బానిసనైన నేను కూడ అతనిదాసనైనాను. నీతో నేను యిక్కడికి వచ్చినప్పటి నుండి, అతడు నాకు యిల్లు, బట్టలు, సర్వమూ సమకూర్చెను. అటువంటప్పుడు అతడు నన్ను చేబట్టి యీ బాలురకు తల్లిగా చేయుటలో తప్పేమి కలదు?''

దేవయాని ఆగ్రహమును భరించలేకుండెను. ఆమె పెదవులు వణకుచుండెను. కన్నులు యెర్రబడెను. ఒకప్పటి ఆమె స్నేహితురాలి భుజములను పట్టి ఊపి యిట్లనెను. ''నీతో నేనిక మాట్లాడదలచుకోలేదు''. మౌనముగా నిలిచియున్న రాజువైపు తిరిగి దేవయాని యిట్లనెను. ''ఓ రాజా! బానిసయైన యీ శర్మిష్ఠతో నీవు తనివితీర సుఖించవచ్చును. నీవు నాకు అప్రియముగా వర్తించుటచే యింకొక క్షణమైనను యిక్కడ నీతో నేనుండలేను''.

దేవయాని మంటలు గ్రక్కుచున్న అగ్నివలె నుండెను. ఆమె ఆభరణము లన్నిటిని తీసివేసి రాజు ముందు నేలపై విసిరెను. ఆమె, రాజువైపు శర్మిష్ఠవైపు దగ్ధము గావించు చూపులను బరపెను. వడివడిగా అక్కడ నుండి వెళ్ళిపోయెను. రాజు ఆమెకు, ఆమె ఆగ్రహమునకు భయపడి ఆమె వెంట పరుగెత్తి ఆమె చేతిని దీసుకుని ఓదార్చుటకు ప్రయత్నించెను. కాని ఆమె వినకుండెను. రాజు మాటల కామె సమాధానము చెప్పక అశోకవనము విడిచి వెళ్ళెను. రథమును దెప్పించి శీఘ్రముగా తన తండ్రి గృహమును చేరెను. శుక్రుడు ఒక్కడే యుండెను. ఆమె సుడిగాలి వలె వచ్చి తండ్రి పాదములపై బడెను. శుక్రుడు ఎగాదిగ జూచి, ఆమె తల యెత్తి, మిక్కిలి విచారముతో నిండిన ఆమె ముఖమును గాంచెను. కళ్ళు దించుకుని నెమ్మదిగా వచ్చుచున్న రాజును శుక్రుడు యెదురుగ గమనించెను. అతడు కూడ శుక్రుని పాదములపై బడెను. శుక్రునకీ నాటకము అవగతము కాలేదు. యయాతి పలుకక మునుపే దేవయాని మాట్లాడెను. ఆమె మాటలు అతి తొందరగా వచ్చుచుండెను. ఆమె మాటలను బట్టి ఆమెలో పేరుకుపోయిన క్రోధము స్పష్టముగా గోచరించుచుండెను. ఆమె తండ్రితో జరిగినదంతయూ తెలిపి, రాజు తన నేవిధముగా మోసగించెనో వివరించెను. ''అధర్మము ధర్మమును జయించినది'' అని దేవయాని పలికెను. ''వృషపర్వుని కూతురు శర్మిష్ఠ నన్ను అతిక్రమించెను. ఆమెకు ముగ్గురు పుత్రులు, నాకు యిద్దరే పుత్రులు. ధర్మపరాయణుడని పేరు పొందిన రాజు నిజముగా నీతిలేనివాడు. అతనికి హృదయము లేదు. నా నమ్మకమును వమ్ముగావించెను''.

పుత్రిక దేవయానిపై యెనలేని ప్రేమగల శుక్రుడు ఆమె చెప్పినది విన్న తర్వాత క్రోధపూరిత నేత్రములతో యయాతిని జూచెను. రాజు ముఖమును తిలకించిన శుక్రుడు తన కుమార్తె చెప్పినది సత్యమేయని విశ్వసించెను. శుక్రుడు మండిపడెను. వివాహ సందర్భములో ప్రత్యేకముగా శర్మిష్ఠను గురించిన ఆలోచనలు తగవని హెచ్చరించి నప్పటికిని రాజు వినకుండెనని శుక్రుడు భావించెను. అతని కుమార్తె మిక్కిలి విచారముతో నుండుట

చూచి, తండ్రిగా ఆమె యందు విశేషమైన ప్రీతి గలవాడగుటచే, అతడు రాజాతో నిట్లనెను.

''యయాతీ! ధర్మ శాస్త్రములతో బాగుగా పరిచయ మున్నప్పటికిని, కామవాంఛ ప్రకోపించుటచేత నీతి నియమముల నుల్లంఘించితివి. నా కుమార్తెకు తీరని దుఃఖము కలిగించుటచేత నిన్ను శపించుచున్నాను. లౌకిక సుఖముల వెంట పరుగెత్తువారు ముసలితనము ననహ్యించుకొందురు. అట్టి ముసలితనము నిన్ను ఆవహించగలదు''

శుక్రుని భీకర శాపమునకు యయాతి మూగబోయెను. రాజర్షి యయాతిలో ఒక దోషము కలదు. అదియే కామవాంఛ ఈ శాపమువలన జీవితమంతయు చీకటి అయినట్లయ్యెను చేతులు జోడించి, కనులవెంట అశ్రువులు కారుచుండగా యయాతి యిట్లు పలికెను ''దేవా! నేను చెప్పునది మీరు వినకుండగనే శాపమొసగినారు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ తన్ను స్వీకరించమని ప్రాధేయపడెను లేకున్న ఆమె జీవితము వ్యర్థమగునని ఆమె తలంచెను నేను నేర్చిన ధర్మ సూత్రములు యిట్లు తెలుపుచున్నవి 'స్త్రీ తనంతట తానుగా ఒక పురుషుని చేబట్టుమని కోరినపుడు ఆమె కోరికను తీర్చవలసియున్నది. లేకున్న ఆ పురుషునికి శిశుహత్యా పాపము కలుగును అట్టి పరిస్థితిలో ఆ పురుషుడు మరొక విధముగా ప్రవర్తించినచో అది పరిస్థితుల ప్రభావము కాని, అతని యిచ్ఛకాదు. అదియుగాక, నా జీవితములో యెవరేది అడిగినను దానిని ప్రసాదించెదనని ప్రకటించినాను ఆమె తన కోరిక తెలిపి నన్ను ప్రసాదించమని అర్థించెను అధర్మపరుడనని అనిపించుకొనుట యిష్టములేక ఆమెను స్వీకరించితిని''

శుక్రు డిట్లనెను ''నీవు తప్పు చేసితివనియే నేను భావించెదను చేసిన వాగ్దానము నుల్లంఘించినవాడవు నీవు కట్టుకున్న భార్య యెడల ఉచితముగా ప్రవర్తించలేదు నీకు వృద్ధాప్యము త్వరలోనే సంభవించును''

అతడట్లు పలుకుచుండగనే, యయాతి అవయవములు శుష్కించి ముడతలు పడుచున్నట్లు కనుగొనెను. తన బలమైన, శక్తిమంతములైన అందమైన బాహువులను చూచుకొనగా, అవి మిక్కిలి సన్నబడి ఒక్కసారిగా ముడుతలేర్పడి, చర్మము మాత్రమే కప్పియున్నట్లుండెను. తన స్వరూపము తనకే భయము కలిగించెను అతడు చాల దుఃఖించి యిట్లనెను. ''ఆచార్యా! నాకింకను అనేక కోరికలు మిగిలి యుండెను దయచేసి నాకీ ముసలితనము పోవునట్లు చేయుము నన్ను కరుణింపుము నేను యింకనూ అనేక సంవత్సరములు జీవించవలసియున్నది అందు నీ కుమార్తెను అనేక రీతులుగా సుఖపెట్టగలను కాని నీవు నాకీ వృద్ధాప్యమును అంటగట్టినావు నీవు మాత్రమే నాకు సహాయము చేయగలవు'' శుక్రుడు యిట్లు పలికెను ''బ్రాహ్మణు డిచ్చిన శాపమునకు తిరుగులేదు. నేను యేదైన పలికినచో అది జరిగి తీరును నేనెప్పుడును అసత్యము పలుకలేదు. సరే, శాపమును కొంతవరకు మార్చగలను ఎవరైనా యువకుడు నీ వృద్ధాప్యమును గ్రహించిన యెడల, అతని యౌవనము నీవు యెరువు తెచ్చుకొనవచ్చును నీకు జీవితములో పూర్తి సంతృప్తి కలిగి, కోరికలన్నియు తీరిన మీదట, నీకు యౌవనము యెరువు యిచ్చిన వ్యక్తికి తిరిగి యౌవనము కలుగును''

132 యయాతి పుత్రులు

యయాతికి చీకటిలో గుడ్డి దీపము వెలుగు నిచ్చినట్లు, ఆశాకిరణము గోచరించెను. అతడిట్లనెను. ''శాపము మార్చినందుకు మీకు నా కృతజ్ఞత. నా అయిదుగురు పుత్రులను అడిగెదను. నా కొరకు యెవరు సర్వసౌఖ్యములు త్యజించునో, అతడు నా తర్వాత చక్రవర్తి కాగలడు. అతడు చేసిన త్యాగమునకు అతని కీర్తి లోకములో చిరస్థాయిగా నిలిచిపోగలదు. అతనికి విశేషమైన పుణ్యము కలుగును''.

శుక్రుని వద్ద యయాతి సెలవు తీసుకొనెను. శుక్రుని ఆగ్రహము అణగారెను. అతడిట్లనెను. ''నీ దారిన నీవు వెళ్ళుము. నీ కొరకు యౌవనము త్యాగము చేయు కుమారుడు నీ తర్వాత రాజు కాగలడు. అతడు కీర్తి ప్రతిష్ఠలు గడించును. అతడు దీర్ఘకాలము జీవించును. అతని కనేక మంది పుత్రులు కలుగుదురు''.

విలపించుచు, వృద్ధాప్యము చేత మెల్లగా నడచుచూ యయాతి నగరము ప్రవేశించెను. ప్రవేశించిన వెంటనే జ్యేష్ఠ కుమారుడు యదువును పిలిపించెను. యదువు దేవయాని కుమారుడు. అతడు వచ్చి తండ్రియెదుట నిలుచుండెను. అతనికి జరిగిన దేమియు తెలియలేదు. తన తండ్రికి అకస్మాత్తుగా కలిగిన వృద్ధాప్యమునకు, విచారమునకు కారణమేమై యుండునా యని ఆశ్చర్యముతో చింతించుచు మౌనముగా నిలబడి యుండెను.

రాజు యిట్ల పలికెను. ''చూడు కుమారా! నాకు అకస్మాత్తుగా వృద్ధాప్యము ప్రాప్తించెను. నా అవయముల పటుత్వము తగ్గెను. నేను కదలలేక పోవుచున్నాను. నీ మాతామహుడైన శుక్రాచార్యుని శాపముచే యిట్లు జరిగెను. నాకు పెక్కు తీరని కోరికలు మిగిలి యున్నవి. నీవు నా కుమారుడవు. నాకు సహాయపడగలవు. నీ యౌవనము నాకిచ్చి నా వృద్ధాప్యము నీవు స్వీకరించినచో, ఒక వేయి సంవత్సరములు కోరికలు తీర్చుకుని, నీ యౌవనము తిరిగి నీకిచ్చివేయగలను''.

యదువు కొంచెముసేపు యోచించి యిట్లనెను. ''తండ్రీ! ముసలితనము యెవ్వరికీ ఆమోదయోగ్యము కాదు. ముఖ్యముగా యువకునకు అసలే వీలుకాదు. నిండు జీవితమంతయూ ముందుండగా వృద్ధాప్యము నెవరు వరింతురు? తెల్లబడిన వెంట్రుకలు, శుష్కించిన శరీరము, వంగిన నడుముతో దైనందిన కృత్యముల నెట్లు నెరవేర్చగలను? రాచ కార్యములనెట్లు నిర్వహించగలను? నీవు నాపై రుద్దనున్న యీ ముసలితనము నాకు వద్దు. వృద్ధాప్యము యెవరు కూడ ఆహ్వానించరు''.

యయాతి పుత్రునికి నచ్చచెప్పజూచెను. ''వృద్ధాప్యము కొంతకాలము మాత్రమే యుండగలదు. ఆ తర్వాత నీకు మరల యౌవనము కలిగి అనేక సంవత్సరములు సుఖముగా నుండగలవు''.

యయాతి పుత్రులందరిలో యదువు సర్వస్వమును త్యజించి భగవంతుని ధ్యానము చేయుచు కాలము గడపవలెనని తలచుచుండెను. వైరాగ్యమునకు అనురాగము పెంచుకొనకుండుట అతి ముఖ్యము. కొంతకాలము ప్రాపంచిక సౌఖ్యము లనుభవించిన పిదప వైరాగ్యమును సాధించవచ్చును. యౌవనమందు సౌఖ్యము లనుభవించిన తర్వాత వైరాగ్యమునకు సిద్ధపడవలెనని యదువు సంకల్పము. తండ్రి తనకివ్వనున్న వృద్ధాప్యము అతి తొందరలోనే రాగలదని తలంచెను. అందుల కతడు సిద్ధముగా లేకుండెను. అసహజమైన యీ వృద్ధాప్యము తన ఆశయము నెరవేరుటకు ఆటంకమగునని భావించెను.

సహజముగా సంప్రాప్తించు వృద్ధాప్యము, వైరాగ్య భావమును, పరలోక చింతను, భగవంతునిపై భక్తిని కలిగించును. తండ్రి తనకివ్వనున్న వృద్ధాప్యము ఒక బ్రాహ్మణుని శాపఫలితము. అది తన ఆశయము నెరవేరుటకు ప్రతిబంధకము కాగలదని తలచెను. యదువు వృద్ధాప్యమును తిరస్కరించుటకు మరొక కారణము గలదు. అతడు తనలో తానిట్లు తలంచెను. ''నా తండ్రి యౌవనము కోరుట ఉత్తమ ఆశయము కొరకు కాదు; నా తల్లితో సుఖించుట కొరకు యౌవనము కోరుచున్నాడు. నా యౌవనము నతని కిచ్చినచో, ఆ యౌవనముతో నా తల్లిని సుఖపెట్టును. దీనివలన నేను నా తల్లికి ఘోర అపచారము చేసినట్లగును. ఈ పాపము నేను చేయలేను. నా తండ్రికి అప్రియము కలిగించుటకన్న వేరు మార్గము లేదు. నేను వృద్ధాప్యము నిరాకరించుటకు వెనుక నున్న కారణములను విశదీకరించి చెప్పజాలను''.

యదువు విచారముగ నుండెను. కాని మనస్సు మార్చుకొనకుండెను. అతడిట్లనెను, ''అకస్మాత్తుగా సంభవించు వృద్ధాప్యము నాకు వద్దు. క్రమేణ సంక్రమించు వృద్ధాప్యము చేతనే వైరాగ్య మలవడును. నా యౌవనము నేను వదలుకొనలేను. తండ్రీ! నన్ను క్షమింపుడు''.

యయాతికి పుత్రునిపై ఆగ్రహము కలిగి యిట్లనెను. ''నీవు నాకు జన్మించితివి. నీ ఉనికికి కారణము నేను. అయినప్పటికిని, నేనడిగిన దానిని నీవు కాదనుచున్నావు. నీకు యీ రాజ్యము సంక్రమింపదు. నీవు పాలితుడవే కాని పాలకుడవు కాలేవు''.

యదువు సమాధానము చెప్పక యూరకుండెను. తండ్రికి నమస్కరించి అక్కడ నుండి వెళ్ళిపోయెను.

ఆ తర్వాత దేవయాని రెండవ కుమారుడు తుర్వసుని పిలిపించెను. యదువుతో చెప్పినట్లుగనే, యయాతి చెప్పెను. తన వృద్ధాప్యము స్వీకరించి అతని యౌవనము నిచ్చినచో, తాను సుఖించి, వేయి సంవత్సరముల తర్వాత తిరిగి అతని యౌవనము నిచ్చి వేయుదునని చెప్పెను. కాని అతడందు కంగీకరించక, ''తండ్రీ! నా బలము, అందమును హరించే వృద్ధాప్యము నాకు వద్దు. వృద్ధాప్యము వలన సౌఖ్యానుభవము పొందలేను. మరియు బుద్ధిని మందగింపజేయును. అంతేకాక ప్రాణమును కూడ తీయగలదు. నాకు వృద్ధాప్యము వద్దు''.

యయాతి ఆగ్రహము యినుమడించెను. అతడిట్లనెను. ''నాకు ప్రీతికరమైన దానిని చేయుటకు అయిష్టతను చూపుచున్నావు. నా తర్వాత నీవు రాజు కాజాలవు. నీవు మ్లేచ్ఛులకు రాజుగా నుందువు. వారు నీతి నిజాయితీ, మర్యాద తెలియని వారుగా నుందురు. సంకుచిత స్వభావులు. లోకులు వారిని యేవగించుకుందురు. అటువంటి మూర్ఖులకు నీవు మూర్ఖుడవైన రాజుగా నుందువు''.

ఆ తర్వాత శర్మిష్ఠ పుత్రులను పిలిపించెను. ద్రుహ్యుడు, అనువు దేవయాని పుత్రుల వలె వృద్ధాప్యము తీసుకొనుటకు నిరాకరించిరి. వారు కూడ తన తర్వాత రాజ్యము నేలుట కనర్హులని యయాతి పలికెను. వృద్ధాప్యము తలచుకొనగా కలిగిన భయము చేత వారు రాజరికము పోయినను బాధ లేదనుకొనిరి. అందుచే, రాజు వారికి యెంతగా నచ్చజెప్ప జూచినను వారు లక్ష్యపెట్టకుండిరి.

యయాతి కిప్పుడు ఆశలన్నియు సుమారుగా అంతరించి, వృద్ధాప్యము తప్పదన్నట్లు తోచెను. కనిష్ఠ పుత్రుడు పూరుని రావించి, అతనిని మిగిలిన పుత్రులను అడిగినట్లే యడిగెను.

పూరు డిట్లనెను. ''తండ్రీ! మీ ఆజ్ఞను శిరసావహించెదను. పెద్దల ఆజ్ఞలను విధేయతతో ఆచరించుటయే

కర్తవ్యమని నేను నేర్చుకుంటిని. అట్టివారు అనుగ్రహపాత్రులై దీర్ఘకాలము జీవింతురని ఉన్నత లోకములు చేరుటకు అదే మార్గమని తెలుసుకున్నాను. మీ వృద్ధాప్యమును సంతోషముగా స్వీకరించి, నా యౌవనమును మీ కిచ్చెదను. తండ్రీ! నా ప్రాణములను కోరినను వానిని మీకు యివ్వగలను. నా యౌవనము మీరు స్వీకరించి సుఖముగా జీవించుడు. మీరు ఆనంద మనుభవించి, వృద్ధాప్యము చేపట్టునంతవరకు నేను మీ వృద్ధాప్యమును ధరించి యుందును.

పుత్రుడైన పూరుని మాటలను వినిన యయాతికి అమితోత్సాహము గలిగెను. అతడిట్లనెను. ''నా తర్వాత నీవు రాజువు కాగలవు. నీ రాజ్యములో ప్రజలు సుఖసంతోషములతో తులతూగెదరు. నీవు దైవభీతితో ధర్మబద్ధముగా పాలించెదవు''.

133 అసంతృప్తి

పూరుడు యయాతి వృద్ధాప్యమును, యయాతి పూరుని యౌవనమును స్వీకరించిరి. యయాతి తాను తలచినట్లు సుఖముగా కాలము గడుపుచూ, రాచకార్యములను అలక్ష్యము చేయక, నిర్వర్తించుచుండెను. దేవయాని యిప్పుడు బాగుగ పరిణతి చెందెను. ఆమె ఆగ్రహమును వీడెను. ఆమె యయాతి ప్రేమను చూరగొనుచుండగా, అతడామెను సహస్ర విధములుగా సుఖపెట్టుచుండెను.

ఇట్లు వేయి సంవత్సరములు గడచెను. యౌవన కాలము అంతరించు సమయము సమీపించినదని యయాతి గ్రహించెను. కాని యౌవనము ప్రసాదించిన సుఖ సంతోషముల యెడ తనకు పూర్తిగా తనివి తీరలేదని తెలుసుకొనెను. ఈ విషయమై అతడు దేవయానితో ముచ్చటించెను. అతడామెతో యిట్లనెను. ''దేవీ! ఆనాడు నీ కుడిచేయి పట్టుకుని, నూతి నుండి బయటకు లాగినప్పటి నుండి నేటివరకు నా ఆలోచనలు నీ మీదనే యుండెను. నీవు, నీపై ప్రేమ, నీతో నేననుభవించిన సుఖము — యీ ఆలోచనలు తప్ప వేరు ఆలోచనలు లేవు. ఇతర విషయములు గురించి ఆలోచించవలసిన సమయము వచ్చినది. మనము ఒకరిపై నొకరికిగల ప్రేమతో కట్టుబడి మాయలో చిక్కుకుని యింతకాలము గడపినాము. ఈ జీవితము తర్వాత యేమిటని యెన్నడు ఆలోచించలేదు; ఆత్మవిద్యను అలక్ష్యము చేసితిని. ఈ జీవితములో నేను ఒక ముఖ్యమైన పాఠమును నేర్చితిని. ధనధాన్యములు, గోవులు, స్త్రీ సౌఖ్యము మనిషికి తృప్తిని కలిగించలేవు. మానవుని హృదయములో కోరికలు జనించుచున్నంత కాలము, అవి తీరుచున్నప్పటికిని, అతడు 'ఇక చాలును' అని యెప్పటికీ అనలేడు''.

''అనుభవించుట ద్వారా కామవాంఛ అణగారదు. అగ్నిలో నెయ్యి వేయగా, యెగసి మరింత విజృంభించు విధముగా, కోరికలను తీర్చుచున్నకొలది మరల మరల అవి అనంతముగా పుట్టుచునే యుండును. కోరికలను త్యజించుట అతిక్లిష్టమైనది. వయసు ముదిరినను కోరికలు తరగవు. దుఃఖ సముద్రములో మునుగక, ఆనందము పొందవలెనన్న కోరికలను త్యజించవలెను. ఇంద్రియములు చాల శక్తిమంతమైనవని చెప్పుదురు. జ్ఞానులు కూడ ఇంద్రియముల శక్తికి లొంగి పాపకూపములో పడుచుందురని చెప్పుదురు. అందుచేతనే సోదరితో, పుత్రికలతో ఒకే ఆసనముపై కూర్చొనరాదని జ్ఞానులందురు. క్షణకాలములో నిద్ధివానిని చేయు శక్తి ఇంద్రియములకు

కలదు.

''వేయి సంవత్సరములుగా నేను కోరికల వెంట పరుగిడుచుంటిని. నాకు యింకను తృప్తి తీరలేదు కాబట్టి, యీ కోరికలను పూర్తిగ విడనాడుటకు ప్రయత్నించి చూచెదను శాశ్వతమైన బ్రహ్మముపై నా హృదయమును కేంద్రీకరించెదను. ద్వంద్వములను మరచి, 'నాది' 'నేను' అనుభావములు విడనాడి, అరణ్యములో లేడివలె, సంచరించెదను

''ఇంద్రియములకు సుఖమును కలిగించు వస్తువులు అనిత్యమని మానవుడు గ్రహించవలసి యున్నది. ప్రాపంచిక వస్తువులు సంసార కూపములోనికి లాగును. కాబట్టి మనస్సును భౌతిక విషయముల నుండి ఉపసంహరించి, నిత్యము, శాశ్వతము అయిన బ్రహ్మముపై లగ్నము చేయవలెను''

యయాతి కుమారుడైన పూరుని వద్దకు వెళ్ళి అతని యౌవనము తిరిగి యిచ్చి వేసెను. శాంతినిండిన మనస్సుతో, ఒకప్పుడు శాపముగా భావించిన వృద్ధాప్యమును స్వీకరించెను మనస్సు పరిశుద్ధమగుటచే వృద్ధాప్యమును తనకు తానుగా యెట్టి సంకోచములేక పొందెను. అతనిలో యిప్పుడెట్టి కోరికలు లేవు మిగిలిన పుత్రులపై కోపము కూడ లేకుండెను. పూరుని చక్రవర్తిగా జేసెను. యదువు దక్షిణదిశను, ద్రుహ్యుడు వాయవ్య దిశను, తుర్వసుడు పశ్చిమదిశను, అనువు ఉత్తరదిశను పాలించునట్లు యయాతి నియమించెను

యయాతి అరణ్యమునకు వెళ్ళి అచట సంచరించుచుండెను కోరికల నుండి స్వేచ్ఛ పొందిన యయాతి, రెక్కలు వచ్చిన పక్షి గూడు విడచి యెగిరిపోయినట్లుగా, విహరించుచుండెను

కొంతకాలమునకు యయాతి చరమదశ చేరుకొనెను. దేవయాని కూడ అతడు చూపిన మార్గము ననుసరించి, భగవంతునిపై మనసు లగ్నము చేసి, యీ శరీరమును విడచెను

134 దుష్యంతుడు

చంద్రవంశపు రాజులలో పూరు చక్రవర్తి మహాప్రసిద్ధి చెందెను. కురు మహారాజు యిదే వంశములోని వాడు. వీరితరము, తరువాత తరములో వీరి వంశీయులు పౌరవులనియు, కౌరవులనియు గిణుతికెక్కిరి.

పౌరవ వంశములో జన్మించిన ఒకరాజు ఐలికుడు అతని కుమారుడు దుష్యంతుడు ఐలికునకు మరికొందరు పుత్రులు గలరు. దుష్యంతుడు జ్యేష్ఠుడగుటచే అతడు చక్రవర్తిగా పట్టాభిషిక్తుడయ్యెను అతడు నాలుగు దిక్కులందున్న రాజులను జయించి, యీ లోకమును యెదురు లేని మహారాజుగా పాలించెను అతడు చాల ఉదాత్తుడు అతనిపాలనలో ప్రజలు భోగభాగ్యములతో తులతూగిరి ప్రజలు ఆకలి యననేమియో యెరుగరు. అతని రాజ్యములో 'దొంగ' అను పదమునకు తావు లేకుండెను. ప్రజలకు అనారోగ్యమననేమో తెలియరు అయా ఋతువులందు వర్షములు బాగుగా వర్షించి పంటలు పుష్కలముగా పండుచుండెను. రాజ్యమందు సమృద్ధిగా పాలనిచ్చు గోవులు విరివిగా నుండెను ప్రతి ఒక్కరికిని సమృద్ధిగా ఆహారము లభ్యమగుచుండెను. అందరును సుఖసంతోషములతో విలసిల్లు చుండిరి.

రాజు ప్రజలందరి ప్రేమను చూరగొనుచుండెను. అతడు గొప్ప వీరుడు. విలువిద్యయందు, గదాయుద్ధము నందు సాటిలేని మేటిగా పేరు గాంచెను

అతనికి విష్ణువునకున్న బలము గలదు. సూర్యుని తేజస్సు గలదు, సాగరమునకున్న ఉదాత్తత, భూమికి యున్న ఓర్పు అతనిలోని విశేష గుణములు. సూక్ష్మముగా చెప్పవలెనన్న, అతని రాజ్యములో అందరును సుఖముగా జీవించుచుండిరి.

ఒకసారి నగరము వానుకుని యున్న గ్రామములలో కొద్ది గందరగోళము చెలరేగెను. క్రూరమృగములు గ్రామములలో ప్రవేశించి గోవులకు హాని కల్గించుచున్న వార్తలు దుష్యంత మహారాజునకు అందెను. ఆ వెంటనే అతడు అరణ్యమునకు ప్రయాణమయ్యెను. సేనా బలము తోడురాగా రీవిగా వేటకు బయలుదేరెను. అతడు ప్రయాణించుచున్నపుడు మార్గమున కిరువైపుల చేరిన ప్రజలు తమలో తాము యిట్లనుకొనసాగిరి. ''ఈతడే దుష్యంతుడు పెద్దపులి కున్నంత శక్తిగలవాడు యుద్ధములో అతనిని జయించగలవారు లేరందురు. అతని బలశౌర్యములు చూచి అందరూ నివ్వెర పడెదరు'' వారి మాటలు చెవిని పడగా, దుష్యంతుడు చిరునవ్వు నవ్వుచు అరణ్యమునకు సాగిపోయెను.

అతడు తోటలు దాటెను నగరపు పొలిమేరలలో నున్న పొదలను కూడ దాటి వెళ్ళుచుండెను అరణ్యములో ప్రవేశించి, చాల సేపు పులులను సింహములను ఎలుగుబంట్లను అడవి దున్నలను వేటాడుచూ కాలము గడిపెను అతనికి మార్గములో ఏనుగుల గుంపులు, లేళ్ళమందలు యెదురయ్యెను.

అందులో ఒక లేడి అందముగా కనుపించెను. ఆ లేడిపై బాణము ప్రయోగింపదలచెను. రాజు ఉద్దేశ్యమును కనిపెట్టిన లేడి, తనకు రానున్న ప్రమాదము తలచుకొని, సన్నని కాళ్ళతో సాధ్యమైనంత వేగముగా పారిపోయెను. రాజు రథమునెక్కి ఆ లేడి ననుసరించి వెళ్ళెను అట్లు యెంతసేపు అయినదీ అతనికి తెలియకుండెను ఇంతలో అతడు అలసిపోయి, దాహము వేయుచున్నట్లు భావించెను అతడు లేడిని యింకను వెంబడించుచుండెను. ఆ లేడి మరొక అరణ్యము ప్రవేశించెను

దుష్యంతుడు కూడ ఆ అరణ్యములో ప్రవేశించెను. అచ్చటి వాతావరణము చాల ఆహ్లాదముగా నుండుట అతనికి ఆశ్చర్యము గొలిపెను అచ్చట మనస్సుకు శాంతి దొరకుచున్నట్లుండెను ప్రశాంతత ఆ పరిసరమంతా వ్యాపించి యున్నట్లు కనుగొనెను చల్లటిగాలి వీచగా ఫలపుష్పములతో నిండిన వృక్షముల కొమ్మలు ఊగుచూ ఆహ్వానించుచున్నట్లు యుండెను. వృక్షముల నీడతో ఆ ప్రదేశము చీకటిగా యుండెను. పక్షులు చేయు మంజుల నాదము మధురముగా వినిపించుచుండెను తుమ్మెదలు పువ్వుల గుత్తులపై వ్రాలి ఝుమ్మను శబ్దము చేయుచుండెను మత్తెక్కించుచున్న పుష్పపరిమళములు ఇంద్రియములకు హాయి కలిగించుచుండెను. ఉండి ఉండి వీచు చల్లని గాలికి వృక్షముల నుండి పుష్పములు నేలపై రాలి తివాసీ పరచినట్లు అందముగా నుండెను.

ఆ ప్రదేశము యొక్క రామణీయకత దుష్యంతునకు అద్భుతముగా కనుపించెను ఆ అరణ్యము అంచున ఒక చిన్న సెలయేరు అతివేగముగా ప్రవహించుచుండుట జూచెను. ఇన్ని సంవత్సరములుగా వేటకు వచ్చుచున్నప్పటికిని యీ అందమైన ప్రదేశమును యెట్లు చూడకుంటిని యని ఆశ్చర్యపడెను దగ్గరలోనే ఋషి ఆశ్రమములను కొన్నిటిని అతడు జూచెను ప్రవహించుచున్న నది మాలిని అని అతడు గుర్తించెను. తల్లి పిల్లలను ఆలింగనము చేసుకొనునట్లు, యీ నది ఆశ్రమములను ఆలింగనము చేసుకున్నట్లు యుండెను.

కణ్వమహర్షి ఆశ్రమము మాలినీ నదీ తీరమున నున్నదని దుష్యంతు డెరుగును. అందుచే, అతడు ఆశ్రమమునకు వెళ్ళకుండ ఋషిని పలుకరించకుండిన అమర్యాదగా నుండునని భావించెను. తన సేనాబలమును అక్కడనే యుండుమని దుష్యంతుడు చెప్పి వారితో యిట్లనెను. ''ముందు ఆశ్రమములున్నవి. ఇది దాటి మీరు ముందుకు పోరాదు. నేను తిరిగి వచ్చువరకు మీరిక్కడనే యుండుడు. నేను ఋషికి నమస్కారము చేసి తిరిగి వచ్చెదను''. రాజ వస్త్రములును, ఆభరణములను తీసివేసి, సామాన్య వస్త్రములు ధరించి ఆశ్రమమువైపు వెళ్ళెను. అతడు బ్రాహ్మణ పురోహితునితో కలసి, ప్రశాంతతతో అందముతో నిండియున్న ఆ మార్గమున నడిచి ఆశ్రమమును చేరుకొనెను.

135 శకుంతల

ఆ రమణీయ ప్రశాంత వాతావరణమమందు దుష్యంతుడు రాచకార్యములను పూర్తిగా మరచి, మహర్షి సందర్శనము చేసి పాదధూళి తీసుకొనవలెనను తలంపుతో నిమగ్నుడై యుండెను.

దుష్యంతుడు అతి వినమ్రతతో ఆశ్రమములో ప్రవేశించెను. ఆశ్రమములో యెవరూ లేకుండుట అతని కాశ్చర్యము కలిగించెను. ఆశ్రమము శూన్యముగా వదలిపెట్టిన గృహమువలె నుండెను. అతడు చుట్టును పరికించి చూచెను. ఎవ్వరును కనుపించలేదు. కొంచెముసేపు అటులనే నిలిచియుండి, తర్వాత బిగ్గరగా ''ఎవరైన నున్నారా?'' అని అడిగెను. అతని స్వరము ప్రతిధ్వనించగా, కొంతదూరమున కూడ అతనిమాటలు వినిపించెను. అతని ప్రశ్నకు జవాబు నాశించుచుండగా, ఆశ్రమము లోపలినుంచి ఒక అందమైన యువతి తొందరగా వచ్చుట గాంచెను. ఆమె తొందరగా కదలుచుండుట జూచిన దుష్యంతుడు ఆకాశమందు నల్లని మబ్బులలో మెరుపును గాంచినట్లు భావించెను.

ఆమె అందములో 'శ్రీ' వలె నుండెను. ఆమె నల్లని నేత్రములందు కుతూహలము గోచరించెను. ఆమె రాజును చూసి నిశ్చేష్టురాలయ్యెను. అందమైన పురుషుడు తన యెదుట నిలిచియుండుట జూచెను. విశాలమైన వక్షస్థలము, పద్మ దళముల వలె విశాలముగా నున్న అతని నయనములు ఆకర్షణీయముగా నుండెను. అతని మెడ సింహము మెడ వలె నుండెను; పొడవైన అతని బాహువులు శక్తిమంతమైనవి. దుష్యంతునకు ఆ యువతి అవయవములు చక్కగా సమకూర్చినట్లుండెను. ఆమె చంద్రుని వలె యింపుగా నుండెను. వసంతుడు స్త్రీ రూపము దాల్చెనా యనునట్లు ఉన్నదామె; ఆమె అందము అంత స్వచ్ఛముగా నుండెను. ఒకరి నొకరు చూచుకొనుచు అట్లే చాలసేపు నిలిచి యుండిరి. ఆమె తొందరగా లోనికి వెళ్ళెను. వెంటనే అర్ఘ్య పాద్యములతో తిరిగి వచ్చి అతనికి సమర్పించి యిట్లనెను. ''ఈ ఆశ్రమమమునకు వచ్చిన నీకు స్వాగతము''. దుష్యంతుని కూర్చొనబెట్టి ఆశ్రమ ఆతిథ్యము స్వీకరించమని కోరెను. ఆ తర్వాత ఆమె కొంత తడవు మౌనముగా నుండెను. అతడామెనే చూచుచుండుట గమనించి, సిగ్గుతో యిట్లడిగెను. ''నీకు ఆనందము చేకూర్చుటకు నేనేమి చేయగలను? ఈ ఆశ్రమమునకు వచ్చుటకు కారణమేమై యుండునో అడుగవచ్చునా? నీవెవరో తెలుసుకొనవచ్చునా? ఎక్కడ నుండి వచ్చినావు?''

దుష్యంతుడిట్లనెను. ''రాజర్షి ఎలికుని కుమారుడను. నన్ను దుష్యంతుడందురు. నేను కణ్వ మహర్షిని సందర్శించుటకు వచ్చితిని. అతడిక్కడ లేనట్లు ఉన్నది. అతడెక్కడకు వెళ్ళెనో చెప్పగలవా?'' ఆ యువతి

యిట్లనెను. ''పండ్లు యేరి తెచ్చుటకు కొద్దిసేపు క్రిందటనే ఆశ్రమము విడచి వెళ్ళెను. కొంచెముసేపు వేచి యుండినచో నా తండ్రి రాగలడు. అప్పుడు నీవు కలుసుకొనవచ్చును''.

ఆమె మాట్లాడుచున్నపుడు రాజు మౌనముగా కూర్చుండెను. ఆమె అందమునకు అతడు ముగ్ధుడయ్యెను. ఆశ్రమమునకు వెలుగునిచ్చు దీపమువలె ఆమె యున్నదని తలంచెను. యౌవనము అందము మిళితమై ఆమెలో వ్యక్తమైన గంభీరతను అతడిదివర కెన్నడును చూచి యుండలేదు. అటు పిమ్మట రాజు యిట్లడిగెను. ''నీవు యెవరు? ఎవరికి చెందిన దానవు? లోకమును త్యజించిన వారితో నిండియుండు ఆశ్రమములలో నీ వంటి యువతిని చూడగలనని నేను ఊహించలేదు. నీవు చాల అందమైన దానవు. నిన్ను చూచిన క్షణము నుండి నీ అందమే నా మనస్సు నందు మెదలుచుండెను. సావకాశముగా నా మాటలు వినుము. ప్రఖ్యాతి గాంచిన పూరు వంశములో జన్మించిన రాజును నేను. నేను దుష్యంతుడను. నీవు అందకత్తెవు. నాకు నీపై ప్రేమ అంకురించినది. ధర్మపరాయణుల వంశములో జన్మించిన నాకు దురాలోచనలు కలుగజాలవు. నాలో పాపచింత యేమియూ లేదు. బహుశః ఋషి కుమార్తెయైన బ్రాహ్మణ కన్య ప్రేమలో పడలేదనుకుంటాను! నీవు బ్రాహ్మణ కన్యవు కావని నీపై నా ప్రేమ సరియైనదేనని వినగోరుచున్నాను. నీపై కలిగిన ప్రేమతో నేను దహించుకొని పోవుచున్నాను. నన్ను, నా ప్రేమను నీవు స్వీకరించవలెను''.

ఒక క్షణము ఆ యువతి యేమియు మాట్లాడక యూరకుండెను. ఆమె పెదవులందు సన్నని చిరునవ్వు మెరలసాగెను. వారటులనే ఆశ్రమములో కొంతసేపు కూరుచుండిరి. ఆ తర్వాత ఆమె అతి మృదువుగా యిట్లు పలుకసాగెను. ''నేను కణ్వ మహర్షి కుమార్తెను. అతడు మహా తపస్వి, స్థిరచిత్తుడు. ధర్మ సూత్రములు బాగుగా యెరిగినవాడు. అతని కీర్తి లోకమంతయు వ్యాపించెను. కణ్వుడు నాకు తండ్రి, గురువు, అతని అనుమతి లేనిదే యేది చేయుటకు నాకు స్వేచ్ఛ లేదు. నీవు నన్ను సూటిగా అడుగుట యుచితముగా లేదు. నా తండ్రి నడుగుము. నా యిష్టము వచ్చునట్లు చేయుటకు నాకు స్వేచ్ఛ లేదు''. దుష్యంతుడిట్లు పలికెను. ''నీ తండ్రి కీర్తి లోకమంతటను వ్యాపించినదని నీవు చెప్పినది సరియైనదే. అతని గొప్పదనమును నేనెరుగుదును. అతడు అవివాహితుడని కూడ నేనెరుగుదును. అతడు బ్రహ్మచర్యము తర్వాత, గృహస్థాశ్రమము స్వీకరించకుండ, తిన్నగా సన్యాసాశ్రమము స్వీకరించినాడు. ఈ సత్యము లోక విదితమే. మరి నీవు అతనికి పుత్రిక వెట్లు అయితివి? ఇది అసంభవము. నా మనస్సులో యీ సందేహము కలుగుచున్నది. నా సందేహమును తీర్చుము. ఇదెట్లు జరిగెను?''

ఆమె మరల చిన్నగా నవ్వెను. రాజును చూచి తిరిగి తలదించుకుని నేలపై దృక్కులను బరపుచుండెను. సూటిగా రాజును చూడలేక మృదు స్వరముతో నిట్లనెను. ''నీవు చెప్పినది సరియైనది. నేను కణ్వ మహర్షి దత్తపుత్రికను''. అని పలికి కొంతసేపు ఆగెను. ఆమె గిగిగి చెప్పబోవు దానిని వినుటకు కుతూహలముతో రాజు మాట్లాడక యుండెను. ఆమె తిరిగి కొనసాగించెను. ''ఒకసారి నా తండ్రి వద్దకు ఒక ఋషి వచ్చెను. నేను తన కుమార్తెనని ఆ ఋషితో నా తండ్రి చెప్పెను. నీ విప్పుడడిగినట్లుగానే ఆ ఋషి యిదెట్లు సంభవమని నా తండ్రి నడిగెను. నా గురించి ఆ ఋషితో నా తండ్రి చెప్పగా విని, సత్యమును తెలుసుకున్నాను. నా తండ్రి యిట్లు చెప్పెను:

''ఒకప్పుడు నా మిత్రుడు విశ్వామిత్రుడు తపస్సు చేసి ముల్లోకములను గడగడలాడించెను. అతని తపశ్శక్తి తన పదవికి భంగము కలిగించగలదని ఇంద్రుడు భావించి, విశ్వామిత్రుని తపస్సును భంగము గావింప

నిశ్చయించుకొనెను. అప్సరస మేనకను పిలిచి, తన అందచందములతో విశ్వామిత్రుని కవ్వించి తపస్సు భంగము చేయవలసినదని ఇంద్రుడు చెప్పెను. విశ్వామిత్రుడు ఆగ్రహావేశశాలియని తెలుసుకున్న మేనక విశ్వామిత్రుని దగ్గరకు వెళ్ళుటకు సంకోచించెను కాని ఇంద్రుడామెకు అభయమొసగి ఆమెను విశ్వామిత్రుని వద్దకు పంపెను. ఆమెను మన్మధుడు, వసంతుడు, మలయమారుతము అనుసరించిరి.

''మేనక వచ్చిన పనిని సాధించెను. మేనకా విశ్వామిత్రులకు ఒక కుమార్తె కలిగెను మేనక పుత్రికను తీసుకుని విశ్వామిత్రుని సమీపించగా, అతడు తన తపస్సుకు భంగము కలిగెనని తలచి, మేనకను గాని ఆ శిశువునుగాని చూడకుండెను మేనక శిశువు బాధ్యత వహించుట కిష్టపడక, అరణ్యమున మాలినీ నదీ తరమున ఆ శిశువును వదలి, స్వర్గమునకు తిరిగి వెళ్ళిపోయెను

''ఆ అరణ్యమున సింహములు, క్రూర మృగములు విరివిగా సంచరించుచుండెను. గడ్డిపై శిశువు పరుండి యున్నది. వృక్షములపై నున్న శకుంత పక్షులు ఆ శిశువుపై దయదలచి, సూర్యుని వేడి, చలి గాలి శిశువుకు సోకకుండునట్లుగా చుట్టూ చేరి, సంరక్షించుచుండెను.

''నేను ఉదయమున నదిలో స్నానము చేసి సూర్యస్తవ మొనర్చుటకు వెళ్ళితిని ఆ అరణ్యములో పక్షుల రక్షణలో, యేకాకిగా నున్న శిశువును చూచితిని. శకుంత పక్షులు నన్ను చూచి యిట్లనెను. 'ఓ మహర్షీ! ఈ శిశువు నీ మిత్రుడైన విశ్వామిత్రుని పుత్రిక. తపోభంగము కలిగినందుకు తనపై తనకే ఆగ్రహము కలిగి, తిరిగి తపస్సు ప్రారంభించుటకు కౌశికీ నది తీరమునకు వెళ్ళెను. అతని తపస్సుకు మేనక అంతరాయము కల్గించి భగ్నము చేసెను మేనక శిశువు బాధ్యతను చేబట్టక యిక్కడ వదలిపెట్టి స్వర్గమునకు వెళ్ళిపోయెను. నీవు దయార్ద్ర హృదయుడవు. నీవు యీ శిశువును యింటికి తీసుకువెళ్ళి పెంచవలెను' ఆ పక్షులు సరిగా చెప్పినవి. సహజముగా నేను కరుణామయుడను అరణ్యములో గడ్డిపై నున్న ఆ శిశువును శకుంత పక్షులు రక్షించుచుండుట చూచి నా హృదయము ద్రవించినది. ఆ శిశువును నా చేతులలోనికి తీసుకుని ఆశ్రమమునకు వచ్చితిని శకుంత పక్షులచే రక్షింపబడిన ఆ శిశువుకు 'శకుంతల' యని పేరు పెట్టితిని. ఆ విధముగా ఆమె నా కుమార్తె అయినది. ఆమె కూడ నన్ను తండ్రిగా పరిగణించుచున్నది''

''ఇదీ నా తండ్రి ఆ ఋషికి చెప్పిన కథ'' అని శకుంతల పలికెను ''కాబట్టి నేను విశ్వామిత్ర మహర్షికి, అప్సరస మేనకకు జన్మించితిని కాని నా మట్టుకు యీ కణ్వ మహర్షియే నా తండ్రి అతడు చెప్పినట్లే నేను చేయుదును''

136 దుష్యంతుడు శకుంతలను వివాహమాడుట

దుష్యంతుడు తన నిర్ణయము సరియైనదని తెలుసుకుని సంతోషించెను ఆమె క్షత్రియ కన్య యగుటచే రాణిగా నుండదగునని భావించెను అతడు నవ్వుచూ ఆమెతో నిట్లనెను. ''నీవు ఒక క్షత్రియుని కుమార్తెవని తెలుసుకున్నాను అది నాకు చాల సంతోషము. నీవు నా భార్యవగుటకు యిక యెటువంటి అభ్యంతరము లేదు నీవు యేది అడిగిన నది చేయుటకు సిద్ధముగా నున్నాను నీవు నాకు కావలెను నీవు లేక నేను జీవించలేను నీవు కోరినచో నా రాజ్యమంతయూ నీ కిచ్చివేసెదను నీ తండ్రి వచ్చునంత వరకు నేను వేచి

యుండలేను. నేను క్షత్రియుడను, గాంధర్వ పద్ధతిలో నిన్ను నేను వివాహమాడవచ్చును. ఈ వివాహమునకు ప్రేమ పునాదిగా యుండుటచే యీ గాంధర్వ పద్ధతి అత్యుత్తమమైనది'' శకుంతల యిట్లనెను ''త్వరలోనే నా తండ్రి అరణ్యము నుండి రాగలడు. దయచేసి ఆయన కొరకు వేచి యుండుము. నా తండ్రి నాకు దైవము. అతడు నన్ను యెవరి కిచ్చిన వారిని నేను భర్తగా స్వీకరించెదను. లోకములో స్త్రీకి స్వేచ్ఛ లేదను విషయము నీకు తెలియదా? చిన్నతనములో తండ్రి, ప్రాయమందు భర్త వృద్ధాప్యములో పుత్రుడు స్త్రీకి రక్షకులు. స్త్రీకి యెన్నడూ తన యిష్టము వచ్చునట్లు చేయుటకు స్వేచ్ఛలేదు నా తండ్రిని విస్మరించి నీ ప్రేమను అంగీకరించలేను''. ''అట్లు అనకుము'' అని దుష్యంతుడనెను. ''నీ తండ్రి నీపై ఆగ్రహించునని నీవు సంకోచించ పనిలేదు. అతనికి ఆగ్రహమే కలుగదు. కణ్వుడు అత్యంత కరుణామయుడు. నీ భర్తను నీవు యెంచుకున్నందుకు అతడు విచారించడు నన్ను యిప్పుడు చేబట్టుటకు అంగీకరించినందువల్ల నీ తండ్రిని అవమానించినట్లు నీవు భావింపతగదు''.

''బ్రాహ్మణుల ఆగ్రహము ఆయుధముంకన్న ప్రమాదకరమైనది. సాధారణ ఆయుధములు శరీరమును మాత్రమే బాధించగలవు. అగ్ని వేడిచేత దహించును, సూర్యుడు తన కిరణములచేత, రాజు బల్లెముచేత బ్రాహ్మణుడు తన ఆగ్రహముచేత యెదుటి వారిని దహించుదురు. ఋషి కోపము ఇంద్రుని వజ్రాయుధమువలె సర్వ నాశనము చేయగలదు''.

దుష్యంతుడు ఆమె నాలోచించనీయక యిట్లనెను. ''నాకు ఋషి కరుణా స్వభావము పూర్తిగా తెలుసును. నీవు అతనికి భయపడ నవసరము లేదు నీవు నాకు భార్యవు కమ్ము నీ గురించిన ఆలోచనలు, నీ అందము నన్ను పూర్తిగా ఆవహించెను. నీకొక విషయము చెప్పెదను ఆత్మయే ఏకైక బంధువు, ఆత్మయే ఏకైక మిత్రుడు, ఆత్మయే తల్లి తండ్రి, సర్వస్వము ధర్మము నతిక్రమింపక, నీ ఆత్మ అనుమతితో నా భార్యవు కమ్ము గాంధర్వ విధిచే నన్ను వివాహమాడుము. నా దానివి కమ్ము'' అతని తొందరపాటు శకుంతలకు ప్రీతి కలిగించెను. అతని ప్రేమ ఆమెను మెప్పించెను. అయినప్పటికిని, ఆమెకు తనయందుగాని అతని యందుగాని స్థిరమైన భావము కుదురలేదు ఆమె యిట్లనెను. ''నీవు చెప్పినట్లు నీవు సూచించిన మార్గము సరియైనదగుచో, నా ఆత్మ అనుమతితో నీకు భార్యనగుట సముచితమైనచో నేను నీ ప్రేమ నంగీకరింతును. కాని నీవు ప్రమాణ పూర్వకముగా నాకు ఒక మాట నియ్యవలెను. మనకు జన్మించు పుత్రుని నీ తర్వాత చక్రవర్తిగా పట్టాభిషిక్తుని చేయవలెను. ఆ విధముగా నీవు వాగ్దానము చేసినచో నిన్ను వివాహమాడెదను''.

ఆమె యేది కోరిన అది చేయగలనని దుష్యంతుడు వాగ్దానము చేసెను శకుంతల తర్వాత యిట్లనెను. ''శాస్త్ర రీత్యా జరిగే వివాహమునే పెద్దలు అంగీకరింతురని చెప్పగా విన్నాను. అట్టి వివాహము వల్ల కూడిన దంపతులను గౌరవముతో చూచెదరు పుట్టబోవు పుత్రుని దృష్ట్యా యిది అత్యంత ముఖ్యము నాకు గాని నాకు పుట్టబోవు పుత్రునకు గాని యెటువంటి అపనిందయు కలుగరాదు అందుచే నీతో వివాహము సరియైన పద్ధతిలో జరుగవలెను. ఇచ్చట ఆశ్రమములో అవసరమైన వస్తువులన్నియు గలవు యజ్ఞశాలలో వివాహము జరుపుటకు కావలసిన వస్తువులన్నియు నున్నవి పాత్రలు, దర్భాసనము, బియ్యము యిచట గలవు కలుగబోవు పుత్రుని వైభవము వివాహము యొక్క పవిత్రతపై ఆధారపడి యుండును. ఇచట నున్న బ్రాహ్మణులు ఆజ్య, హవిర్లాజాగ్నులతో వివాహము జరుపగలరు ఈ ఆర్భాట మంతయు నీకు యిష్టము లేదని నేనెరుగుదును. కాని ధర్మబద్ధముగా యీ వివాహము జరుగవలెనని కోరుచున్నందుకు నన్ను క్షమించవలెను''